PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 45 సంచిక : 63 | విజయవాడ, శనివారం 4 అక్టోబర్ 2025 | 10 + 8 పేజీలు వెల : 5. 50
Vol No | Vijayawada, Saturday 4 October 2025 | Rs

నెరవేరుతున్న మరో హామీ
ఆటో డ్రైవర్ల సేవలో
శ్రమజీవులకు గౌరవం, స్వావలంబనకు ప్రోత్సాహం



అంబేద్కర్ విగ్రహానికి నిప్పు

భగ్గుమన్న అఖిలపక్ష, దళిత సంఘాల నాయకులు

ప్రజాశక్తి - వెదురుకుప్పం (చిత్తూరు) / అమరావతి బ్యూరో

చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు నియోజకవర్గం వెదురుకుప్పం మండలం దేవళంపేట ప్రధాన కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. కొంతమేర విగ్రహం కాలిపోయింది. విషయం తెలుసుకున్న దళిత, అఖిలపక్ష నాయకులు భగ్గుమన్నారు. వెదురుకుప్పం, పలమనేరులో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను కెవిపిఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. మరోవైపు అధికార, ప్రతిపక్ష పార్టీలు రగడకు దిగాయి. ఇటు ఎమ్మెల్యే థామస్ అనుచరులు, అటు వైసిపి నేత కృపాలక్ష్మి అనుచరులు పోటాపోటీగా ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు దేవళంపేటకు చేరుకుని కేసు నమోదు చేశారు. చిత్తూరు ఎస్‌పి తుషార్ డూడీ ఘటనా స్థలికి చేరుకున్నారు. ఆందోళనకారులకు సర్దిచెప్పారు. ఎంపి థామస్ స్పందిస్తూ... దోషులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

దుండగులను అరెస్టు చేయాలి : కెవిపిఎస్

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ ఘటనను సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఒ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. దోషులు ఎంతటివారినైనా శిక్షించాలని కోరారు. ఈ చర్యలో మనువాద మతోన్మాదుల కుట్ర దాగి ఉందని పేర్కొన్నారు. అంబేద్కర్ విగ్రహాలపై దాడులు చేస్తూ సమాజాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్న వారిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ దుర్మార్గమైన ఘటనకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలియజేయాలని పిలుపునిచ్చారు.



కఠిన చర్యలు తీసుకోవాలి: బివి రాఘవులు

అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వారి పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి ప్రజల మధ్య ఐక్యతకు చిచ్చు పెట్టడానికి ప్రయత్నం చేసిన దురహంకారులను శిక్షించాలని, ముఖ్యమంత్రి... సొంత జిల్లాలో ఓ పథకం ప్రకారం జరిగిన ఈ కుట్ర వెనక ఎంతటి వారు ఉన్నా కఠినంగా వ్యవహరించాలన్నారు. భారతదేశంలో అత్యంత ఆదరణీయమైన వ్యక్తులలో అగ్రగణ్యుడైన అంబేద్కర్‌ను అవమానించడానికి పలు సందర్భాల్లో కుల దురహంకారులు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారని, వారి పట్ల ప్రభుత్వాలు సంశయం లేకుండా వ్యవహరించి చర్యలు తీసుకోవాలని కోరారు.

కూటమి పాలనలో దళితులపై దాడులు : వైసిపి

సిఎం చంద్రబాబు దళిత ద్రోహి అని వైసిపి ఎస్‌సి, ఎస్‌టి సెల్ అధ్యక్షులు కొమ్మూరి కనకారావు ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి సర్కారు పాలనలో దళితులపై నిత్యం దాష్టీకాలు జరుగుతున్నాయని, అందులో భాగంగానే చిత్తూరు జిల్లాలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టారని అన్నారు. ఈ ఘటనకు కారణమైన టిడిపి నాయకులు సతీష్ నాయుడును అరెస్టు చేయాలని కోరారు.

చర్యలు తీసుకుంటాం : మంత్రి డోలా

డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. వెదురుకుప్పంలో అంబేద్కర్ విగ్రహానికి మంటలు అంటుకున్న ఘటనను మంత్రి తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన బాధాకరమన్నారు. సచివాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా ఎస్‌పి, కలెక్టర్లు సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారని తెలిపారు. దోషులు ఎవరైనా ఉపేక్షించేది లేదన్నారు. కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ విషయంపై విద్వేషాలు రెచ్చగొట్టేలా ఎవరూ మాట్లాడవద్దని సూచించారు. జాతీయ నేతల విగ్రహాలకు అవమానం కలిగించేలా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు.

ఎమ్మెల్యేలను నియంత్రణలో ఉంచండి

- మంత్రులకు సిఎం చంద్రబాబు ఆదేశం?
- జిఎస్‌టి -2పై ప్రజల నుంచి స్పందన లేదన్న మంత్రి నాదెండ్ల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు తమ పరిధిలో ఉన్న ఎమ్మెల్యేలను నియంత్రణలో ఉంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించినట్లు తెలిసింది. సచివాలయంలో శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఇటీవల అసెంబ్లీలో జరిగిన వ్యవహారాలను ఆయన ప్రస్తావిస్తూ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఎమ్మెల్యేలు తెలిసి మాట్లాడినా, తెలియక మాట్లాడినా వారిని నియంత్రించాల్సిన బాధ్యత జిల్లా మంత్రులదే అని చంద్రబాబు వారితో అన్నట్లు తెలిసింది. తమ పరిధిలో ఉన్న ఎమ్మెల్యేలను పిలిచి మాట్లాడుతున్నారా అని అడగగా మంత్రులు మౌనంగా ఉండిపోయినట్లు సమాచారం.

ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్ మంత్రుల మధ్య సమన్వయం ఉండాలని ఉండాలని సూచించారు. ఏవరి శాఖల్లోనూ ప్రతికూల అంశాలు రాకుండా చూసుకోవాలని,ఒకవేళ వస్తే వాటిపై వెంటనే స్పందించాలని ఆదేశించారు. జిఎస్టిపై నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమం ప్రజల నుంచి స్పందన లేదని పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ అనట్లు సమాచారం. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 16వ తేదిన ప్రధాన మంత్రి కర్నూలు పర్యటనను విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి మంత్రులకు దిశా నిర్దేశం చేసినట్లు తెలిసింది. కేంద్రప్రభుత్వం ప్రకటించిన పూర్వోదయ పథకంలో రాష్ట్రం కూడా ఉందని, ఈ పథకం ద్వారా రానున్న రెండేళ్లల్లో ఉద్యాన, , ఆక్వా రంగాల్లో రూ.65వేల కోట్ల వరకు నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. విజయవాడలో నిర్వహించిన 'విజయవాడ ఉత్సవ్' వంటి కార్యక్రమాలను ఒక్కో నగరంలో ఒక నెల నిర్వహించాలని చెప్పారు.

స్థానికంగా జరిపే ఉత్సవాలను ఈ కార్యక్రమానికి అనుసంధానం చేయాలని సూచించారు. కడప జిల్లాలో జిందాల్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఉక్కు ఫ్యాక్టరీ రానున్న ఎన్నికల సమయం నాటికి అందుబాటులోకి వస్తుందని చెప్పినట్లు తెలిసింది.

నలుగురు మంత్రులు గైర్హాజరు

మంత్రివర్గ సమావేశానికి నలుగురు మంత్రులు శుక్రవారం గైర్హాజరయ్యారు. ఆర్థిక, ఇంధన, వైద్య, ఆరోగ్య, పరిశ్రమల శాఖల మంత్రులు పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్, సత్యకుమార్ యాదవ్, టిజి భరత్ సమావేశానికి హాజరు కాలేదు. పయ్యావుల కేశవ్ అనారోగ్యం కారణంతో రాలేదు. గొట్టిపాటి విదేశీ పర్యటనలో ఉండటం వల్ల హాజరుకాలేదు.

రైస్ మిల్లు వ్యాపారికి రూ. కోటి టోకరా

- సైబర్ నేరగాళ్ల దందా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఫేస్‌బుక్‌లో పరిచయం చేసుకుని రైసు మిల్లు వ్యాపారి నుంచి రూ.కోటి కాజేసిన సైబర్ నేరగాళ్ల ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక పట్టాభిపురం పోలీసులకు శుక్రవారం అందిన ఫిర్యాదు మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు ఎస్‌విఎన్ కాలనీకి చెందిన నల్లూరి వెంకటేశ్వర్లుకు వట్టిచెరకూరు మండలం పల్లపాడు వద్ద రైసు మిల్లు ఉంది. గత కొన్ని రోజుల క్రితం శైలజ పేరుతో ఒక యువతి వెంకటేశ్వర్లు ఫేస్‌బుక్ ఖాతాకు మెసెజ్ పంపారు. ఇందుకు ఆయన స్పందించారు. తరువాత ఆయనతో మాటలు కలిపి కాల్‌బాయ్‌గా పనిచేస్తే డబ్బులు వస్తాయని ఆశపెట్టింది. తనకు 68 ఏళ్ల వయస్సు అని తనకు ఇలాంటి మెసేజ్‌లు పంపవద్దని ఆయన కోరారు. తరువాత మరో యువకుడు ఫోన్ చేసి తాము హైదరాబాద్ పోలీసులమనీ, మీరు మహిళలతో అసభ్యంగా చాట్ చేస్తున్నట్లు ఆమె భర్త ఇచ్చిన రిపోర్ట్ పై మీ మీద కేసు అయిందని, మిమ్మల్ని కేసు నుండి తప్పించడానికి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ ద్వారా రూ.30 లక్షల వరకు కాజేశారు. కొద్ది రోజుల తరువాత మళ్లీ ఒకరు ఫోన్ చేసి తాము ఇన్‌కామ్ టాక్స్ అధికారులమని మీకు ఉన్న రైస్ మిల్లులో చాలా ట్రాన్సాక్షన్స్ జరుగుతున్నాయని మీ రైస్ మిల్లు పై రైడ్ చేయడానికి వస్తున్నామని, అలా రాకుండా ఉండాలంటే డబ్బులు ఇవ్వాలని బెదిరించగా సుమారు ఒక కోటి రూపాయల వరకు డబ్బులు పంపినట్లు పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పట్టాభిపురం సిఐ కళ్యాణం వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమరావతి మణిహారంగా విజయవాడ ఉత్సవ్

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ముగిసిన దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి - విజయవాడ, సిటీ, అర్బన్

అమరావతికి మణిహారంగా విజయవాడ ఉత్సవ్ నిలుస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. దసరా సంబరాల్లో భాగంగా గురువారం సాయంత్రం గొల్లపూడిలో ఏర్పాటు చేసిన ఎక్స్‌పో గ్రౌండ్స్‌ను సిఎం సందర్శించారు. ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత రోబో వంటశాలను పరిశీలించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించి, ఆర్గానిక్ వ్యవసాయంపై మరింత దృష్టి సారించాలని అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... ఏడాదిన్నర కిందటి వరకు రాష్ట్ర ప్రజల ముఖాల్లో ఆనందం కనిపించలేదని, ఆ సమయంలో భయం, దాడులు, ఆవేదన రాజ్యమేలాయని గుర్తు చేశారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తరువాతే ప్రజల ముఖాల్లో స్వేచ్ఛా వాతావరణం, సంతోషం తిరిగి కనిపించాయని తెలిపారు. హెలీ రైడింగ్, సాహస క్రీడలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని, రోబోటిక్ కిచెన్ ద్వారా విజయవాడ పారిశ్రామికవేత్తల ప్రతిభను ప్రదర్శించారని అభినందించారు. అన్నవరం, శ్రీకూర్మం, సింహాచలం, వాడపల్లి, ద్వారకాతిరుమల, దుర్గగుడి, పానకాల లక్ష్మీనరసింహస్వామి, పెంచలకోన, తిరుమల, కాణిపాకం, శ్రీశైలం, శ్రీకాళహస్తి, మహానంది వంటి పుణ్యక్షేత్రాలు మన సంపద, వారసత్వమని పేర్కొన్నారు. విజయవాడ ఉత్సవ్ విజయవంతం కావడం ప్రజల ఐక్యతకు, సంస్కృతిపై మమకారానికి, అభివృద్ధిపై విశ్వాసానికి ప్రతీకగా నిలిచిందని తెలిపారు. అనంతరం మహాత్మా గాంధీ రోడ్డులో నిర్వహించిన సాంస్కృతిక కవాతు, డప్పు కళాకారుల ప్రదర్శన ఆకర్షణలుగా నిలిచాయి. గరగలు, కొమ్ముకోయ, తప్పెటగుళ్ళు, కర్రసాము, బుట్టబొమ్మలు, భేతాళసెట్టు, నాసిక్ డోల్ వంటి ప్రజా కళారూపాలు ఆకట్టుకున్నాయి. క్రీడాకారిణి పివి సింధు తదితరులు పాల్గొన్నారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై వైభవంగా ప్రారంభమైన దసరా నవరాత్రులు ముగిశాయి. చివరి రోజు రాజరాజేశ్వరిదేవి అలంకారంలో అమ్మవారిని అలంకరించారు. నగరోత్సవంలో భాగంగా ఉత్సవమూర్తులను కనకదుర్గ నగర్ నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి దుర్గా ఘాటు వద్ద హంస వాహనంపై కూర్చుండబెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవానీల మాల విరమణతో యాత్రికుల రద్దీ పెరిగింది. అమ్మవారి దర్శనానికి సుమారు ఆరు గంటలకు పైగా సమయం పడుతుంది. తొలి మూడు రోజులు యాత్రికుల సంఖ్య లక్ష లోపు ఉండగా, ఆ తర్వాతి నుంచి రద్దీ పెరిగింది. 11 రోజుల్లో 16 లక్షల మందికి పైగా యాత్రికులు అమ్మవారిని దర్శించుకున్నట్లు సమాచారం.



ప్రతినిధుల నుంచి గిన్నిస్ బుక్ రికార్డును అందుకుంటున్న సిఎం, ఎంపి, చిత్రంలో పివి సింధు, తదితరులు

పాత జిఎస్‌టి చివరి నెల ఆదాయం 3,653 కోట్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పాత జిఎస్‌టి ధరల మేరకు సెప్టెంబర్ నెలలో 3,653 కోట్లు వసూలైంది. ఈ ధరల మేరకు ఇదే చివరి నెల కావడం విశేషం. అయితే గత నెలలో చివరి తొమ్మిది రోజులు కొత్త జిఎస్‌టి స్లాబులు అమలులోకి వచ్చినప్పటికీ మెజార్టీ రోజులు పాత స్లాబుల్లోనే ఉన్నాయి,. దీంతో ఆ నెలలో వచ్చిన ఆదాయాన్ని అంతా పాత జిఎస్‌టి కిందకే లెక్క వేసినట్లు అధికారులు చెబుతున్నారు. అక్టోబర్‌కు సంబంధించి గణాంకాలు నవంబర్‌లో సిద్ధమవుతాయని, వాటి ఆదారంగా కొత్త జిఎస్‌టి స్లాబుల వల్ల కలిగే లాభ నష్టాలను అంచనా వేయడం సాధ్యమవుతుందని అంటున్నారు. తాజాగా వాణిజ్య పన్నులశాఖ వెల్లడించిన వివరాల మేరకు సెప్టెంబర్‌లో 3,653 కోట్లు జిఎస్‌టిగా సమకూరింది. గత ఏడాది సెప్టెంబర్ నెల్లో 3,506 కోట్లు వసూలు కాగా, తాజా ఆదాయం సుమారుగా 650 కోట్లు ఎక్కువగా వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్ వరకు మొత్తం పన్నుల వసూళ్లు 26,685 కోట్లుగా తేలింది. ఇందులో జిఎస్‌టి ద్వారా 17,556 కోట్లు రాగా, రద్దయిన పాత పన్ను చట్టాల ద్వారా 127 కోట్లు, పెట్రోలియం ఉత్పత్తుల ద్వారా వచ్చే వ్యాట్ నుంచి 8,245 కోట్లు, మద్యంపై వ్యాట్ ద్వారా 494 కోట్లు, వృత్తి పన్ను ద్వారా 264 కోట్లు వచ్చినట్లు తేల్చారు. గత ఏడాది సెప్టెంబర్ వరకు పోల్చిచూస్తే పెట్రో ఉత్పత్తుల ద్వారా మాత్రం కేవలం 1.72 శాతమే ఆదాయం పెరగడం గమనార్హం. 2024లో 8,105 కోట్లు రాగా, ఈ ఏడాది 8,245 కోట్లు మాత్రమే పన్ను రూపంలో చేతికందింది.

రెట్టింపైన వసూళ్లు

జిఎస్‌టి అమలు ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు జిఎస్‌టి వసూళ్లు రెట్టింపయ్యాయి. గతేడాది కన్నా ఈ సెప్టెంబర్‌లోనే కొంత వసూళ్లు పెరగడం విశేషం. 2017 సెప్టెంబర్‌లో 1,802 కోట్లు జిఎస్‌టి రూపంలో రాగా, 2018లో 2,023 కోట్లు, 2019లో 1,985 కోట్లు చేతికందాయి. ఆ తరువాత క్రమంగా పెరుగుతూ 2023 నాటికి 3,658 కోట్లుగా వసూళ్లు నమోదైంది.

స్పౌజ్‌లకు అంతర్ జిల్లా బదిలీల్లో అవకాశం

- మంత్రి లోకేష్‌కు పిడిఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయుల అంతర్‌జిల్లా బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న స్పౌజ్‌లకు బదిలీ అవకాశం కల్పించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బి గోపిమూర్తి కోరారు. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు శుక్రవారం లేఖ రాశారు. సర్‌ప్లస్, డెఫిషిట్ పేరుతో కొంతమంది స్పౌజ్‌లకు బదిలీల్లో అనుమతినివ్వలేదని తెలిపారు. ఐదేళ్ల తరువాత జరుగుతున్న ఈ బదిలీల్లో వారికి అవకాశం ఇవ్వకపోతే వారి కుటుంబాలు ఇబ్బందికర పరిస్థితుల్లోకి నెట్టవేయబడతాయని పేర్కొన్నారు. చాలా ఏళ్ల నుంచి కుటుంబానికి దూరంగా ఉంటున్నారని, మానవతా దృక్పథంతో అవకాశం ఇవ్వాలని కోరారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ యాజమాన్యాలకు లాంగ్వేజ్ పండిట్ నుంచి స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతులకు అవకాశమిచ్చారని తెలిపారు. పండిట్‌లకు ఇవ్వగా మిగిలిన స్కూల్ అసిస్టెంట్ పోస్టులను అర్హత గల ఎస్‌జిటిలకు ఉద్యోగోన్నతుల ద్వారా కల్పించాలని కోరారు. మున్సిపల్, కార్పొరేషన్‌లలో 100 శాతం లాంగ్వేజ్ స్కూల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలని తెలిపారు. చాలా ఏళ్ల నుంచి ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న గిరిజన సంక్షేమశాఖ లాంగ్వేజ్ పండిట్ అప్‌గ్రేడేషన్ ఫైల్‌ను క్లియర్ చేయించి ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పండిట్, పిఇటి పోస్టుల అప్‌గ్రేడేషన్ ఫైల్ త్వరితగతిన ఆమోదించాలని ఆర్థికశాఖ జాయింట్ సెక్రటరీ ఎ గౌతమ్‌కు గోపిమూర్తి మరో లేఖ రాశారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - తిరుమల

శ్రీవారి బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు పుష్కరిణిలో చక్రస్నానాన్ని వైభవంగా నిర్వహించారు. దీంతో తొమ్మిది రోజుల పాటు వైభవంగా సాగిన ఉత్సవాలకు ముగింపు పలికారు. యాత్రికుల సంతృప్తే ఈ ఉత్సవాలకు గీటురాయి అని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా మొత్తం 5.80 లక్షల మంది యాత్రికులు స్వామివారిని దర్శించుకున్నారని వెల్లడించారు. శ్రీవారి హుండీ ద్వారా రూ. 25.12 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. 2.42 లక్షల మంది భక్తులు తలనీలాలు సమర్పించారని, 28 లక్షలకు పైగా శ్రీవారి లడ్డూ ప్రసాదాలను కొనుగోలు చేశారని చెప్పారు. గరుడ సేవ రోజున అదనంగా 45వేల మందికి శ్రీవారిని దర్శించుకున్నారు.

పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉత్తరాంధ్ర, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్ జైన్ తెలిపారు. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వంశధార నది, గొట్టా బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 88,179 క్యూసెక్కులు ఉందని, నాగావళి నది తోటపల్లి వద్ద ఇన్‌ఫ్లో 18,638, అవుట్‌ఫ్లో 36,339 క్యూసెక్కులు ఉందని వెల్లడించారు. రేపటి నుంచి నదుల వరద ఉధృతి క్రమంగా తగ్గుతుందని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి

- ఫ్రాన్స్ పెట్టుబడిదారులకు మంత్రి గొట్టిపాటి పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విదేశీ పెట్టుబడులకు రాష్ట్రం గమ్యస్థానంగా నిలుస్తుందని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న అంతర్జాతీయ సమ్మిట్‌లో పాల్గొనాలని ఫ్రాన్స్ పారిశ్రామికవేత్తలను కోరారు. ఇండో-ఫ్రెంచ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సహకారంతో ప్యారిస్‌లో నిర్వహించిన రోడ్‌షోలో మంత్రి గొట్టిపాటి శుక్రవారం పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలున్నాయని అన్నారు. ఎపి ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024 అమలు తీరును వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలు, పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా ప్రభుత్వ పాలసీలున్నాయని తెలిపారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను అందిపుచ్చుకోవాలని కోరారు. రాష్ట్రానికి సహజ సిద్ధంగా ఏర్పడిన సుదీర్ఘ తీర ప్రాంతం, అభివృద్ధి చెందిన ఓడరేవులు, విమానాశ్రయాలు, కీలకమైన మౌలిక సదుపాయాల కల్పనతో పెట్టుబడిదారులకు రాష్ట్రం అత్యంత అనుకూలంగా ఉందన్నారు. సిఎం చంద్రబాబు నేతృత్వంలో బిజినెస్ ఫ్రెండ్లీ ప్రభుత్వంతో రాష్ట్రం పురోగమిస్తుందని తెలిపారు. అనంతరం ఫ్రాన్స్‌లో పునరుత్పాదక విద్యుత్ సంస్థ ఇడిఎఫ్‌తో మంత్రి సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు సిఇఒ సిఎం సాయికాంత్ వర్మ, సిసిఐఎఫ్ఐ ప్రెసిడెంట్ కౌమార్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ సేవా కేంద్రం ప్రారంభం

- సిసిఐ డైరెక్టర్ జనరల్ మునీంద్ర కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామీణ ప్రాంతాలతో ప్రభుత్వం అనుసంధానం కావడానికి భారత్ సేవా కేంద్రాన్ని (బిఎస్‌కె) భారత వాణిజ్య, పరిశ్రమల ఛాంబర్ (సిసిఐ) ప్రారంభించిందని సిసిఐ డైరెక్టర్ జనరల్ మునీంద్ర కుమార్ తెలిపారు. ఆర్థిక సహాయం, ఆరోగ్య సంరక్షణ, విద్య, డిజిటల్ సాధికారత, ఉపాధి, వ్యవసాయ మద్దతుతో సహా ముఖ్యమైన సేవలను పొందడం ద్వారా గ్రామీణ ప్రాంతాల మధ్య అంతరాన్ని తగ్గించడానికి బిఎస్‌కె సరైన మార్గమని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిఎస్‌కె వంటి వ్యూహాత్మక నిర్ణయాల ద్వారా ఆర్థిక, సామాజిక పరివర్తనను నడిపించడంలో సిసిఐ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. బిఎస్‌కె సేవా ప్రదాత మాత్రమే కాదని, మార్పునకు దోహదపడుతుందని తెలిపారు.

స్వచ్ఛాంధ్ర అవార్డులు

6న సిఎం చంద్రబాబు పంపిణీ

- రాష్ట్ర స్థాయిలో 69, జిల్లా స్థాయిలో 1,257 మంది ఎంపిక
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డి అనిల్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛాంధ్ర అవార్డులను ఈ నెల 6న అందజేయనున్నట్లు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డి బి అనిల్‌కుమార్ రెడ్డి తెలిపారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి సిఎం చంద్రబాబు హాజరవుతారని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవార్డులకు రాష్ట్ర స్థాయిలో అనంతపురం జిల్లా స్వచ్ఛ జిల్లాగా ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో 69 మంది, జిల్లా స్థాయిలో 1,257 మంది చొప్పున, మొత్తం 1,326 మంది విజేతలకు బహుమతులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. లక్ష నుంచి 3 లక్షల జనాభా ఉన్న పట్టణాల విభాగంలో మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్, తాడిపత్రి మున్సిపాలిటీ, బొబ్బిలి మున్సిపాలిటీ అగ్ర స్థానాల్లో నిలిచాయని పేర్కొన్నారు. 50 వేల లోపు జనాభా ఉన్న పట్టణాల విభాగంలో పలమనేరు, కుప్పం, ఆత్మకూరు మున్సిపాలిటీలు గుర్తింపు పొందాయని తెలిపారు. అవార్డుల ఎంపిక ప్రక్రియను మూడు దశల్లో పారదర్శకంగా నిర్వహించినట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో 1,12,833 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించామని, స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర పోర్టల్, మొబైల్ యాప్‌లతో అనుసంధానించి ఈ అవార్డులకు విజేతలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. పట్టణాలు, గ్రామ పంచాయతీలు, పాఠశాలలు, ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, రైతు బజార్లు, బస్ స్టేషన్‌లు, పరిశ్రమలు వంటి వివిధ విభాగాల్లో అత్యుత్తమ పనితీరును కనబరిచిన వారికి అవార్డులు అందజేయనున్నామని పేర్కొన్నారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, బహిరంగ ప్రదేశాల శుభ్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, 'రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్' వంటి విషయాల్లో సరికొత్త ఆలోచనలు చేసిన వారిని విజేతలుగా ఎంపిక చేశామని తెలిపారు. కొన్ని గ్రామ పంచాయతీలు శుభ్రత విషయంలో అత్యుత్తమ పనితీరును ప్రదర్శించాయని, ముఖ్యంగా అనకాపల్లి జిల్లా చౌదువాడ, ప్రకాశం జిల్లా ఆర్‌ఎల్ పురం, బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా లోల్ల, కృష్ణా జిల్లా చల్లపల్లి, వైఎస్‌ఆర్ కడప జిల్లా చెన్నూరు, చిత్తూరు జిల్లా కానమాకులపల్లె గ్రామాలు విజేతలుగా నిలిచాయన్నారు. విజేతల పూర్తి వివరాలు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచామన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సామినేని కోటేశ్వరరావు

టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా సామినేని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎపి టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా సామినేని కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ మేరకు గుంటూరులోని అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా పి కోటిరావు, ఉపాధ్యక్షులుగా ఎంవి సత్యనారాయణ, రమేష్ రాజు, బి ఉమామహేశ్వరరావు, పి చలపతిరావు, గౌరవ సలహాదారుడుగా ఎల్ రఘు రామిరెడ్డి ఎన్నికయ్యారని కోటేశ్వరరావు మీడియా సమావేశంలో తెలిపారు. వారితో పాటు 12 మంది డైరక్టర్లుగా ఎన్నికయినట్టు తెలిపారు. రాష్ట్రంలో టెక్స్‌టైల్ మిల్స్ అన్ని సంక్షోభంలో ఉన్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ రంగాన్ని ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు వాగ్దానం చేసిన రూ.900 కోట్ల విద్యుత్ సబ్సిడీ రాయితీని వెంటనే విడుదల చేయాలని, విద్యుత్ బిల్లులపై యూనిట్‌కు రూ.రెండు రాయితీని ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ డిమాండ్ ఛార్జీలను యూనిట్‌కు రూపాయి పెంచే ప్రస్తావనను ఐదు సంవత్సరాల పాటు వాయిదా వేయాలన్నారు. ప్రస్తుత ఛార్జీ అయిన యూనిట్‌కు ఆరు పైసలు కొనసాగించాలని రాష్ట్ర ప్రభ్వుత్వాన్ని కోరారు.

ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియట్ పరీక్షల టైమ్ టేబుల్‌ను ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి నారాయణ భరత్ గుప్తా శుక్రవారం విడుదల చేశారు.

మొదటి సంవత్సరం

తేది	సబ్జెక్ట్
23-02-2026(సోమవారం)	తెలుగు/సంస్కృతం/ఉర్దూ/హిందీ/తమిళ్/కన్నడ/అరబిక్, ఫ్రెంచ్, పెరిసియన్ సెకెండ్ లాంగ్వేజ్ పేపర్-1 (బ్యాక్ లాగ్)
25-02-2026(బుధవారం)	ఇంగ్లీష్ పేపర్-1 (బ్యాక్ లాగ్, రెగ్యులర్)
27-02-2026(శుక్రవారం)	హిస్టరీ (రెగ్యులర్, బ్యాక్‌లాగ్), బోటనీ పేపర్-1 (బ్యాక్ లాగ్)
02-03-2026 (సోమవారం)	మేథమెటిక్స్ పేపర్-1 (రెగ్యులర్) మేథమెటిక్స్ పేపర్-1ఎ (బ్యాక్‌లాగ్)
05-03-2026 (గురువారం)	బయాలజి పేపర్-1, మాథమెటిక్స్ పేపర్-1బి(బ్యాక్‌లాగ్) జువాలజీ పేపర్-1(బ్యాక్‌లాగ్)
07-03-2026(శనివారం)	ఎకనామిక్స్ పేపర్-1(ఇద్దరికీ)
10-03-2026(మంగళవారం)	ఫిజిక్స్ పేపర్-1(ఇద్దరికీ)
12-03-2026 (గురువారం)	కామర్స్ పేపర్-1(బ్యాక్‌లాగ్, రెగ్యులర్),సోషయాలాజీ పేపర్-1(బ్యాక్‌లాగ్) ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ పేపర్-1(బ్యాక్‌లాగ్)
14-03-2026 (శనివారం)	సివిక్స్ పేపర్-1(బ్యాక్‌లాగ్, రెగ్యులర్) బ్రిడ్జ్‌కోర్స్, మేథమెటిక్స్ -1(బ్యాక్‌లాగ్)
17-03-2026(మంగళవారం)	కెమిస్ట్రీ పేపర్-1(ఇద్దరికీ)
20-03-2026(శుక్రవారం)	పబ్లిక్ అడ్మిన్‌స్ట్రేషన్ పేపర్-1, లాజిక్ పేపర్-1(ఇద్దరికీ)
24-03-2026(మంగళవారం)	మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-1, జియోగ్రఫీ పేపర్-1(ఇద్దరికీ)

ద్వితీయ సంవత్సరం

తేదీ	సబ్జెక్ట్
24-02-2026(మంగళవారం)	సెకెండ్ లాంగ్వేజ్ పేపర్-2
26-02-2026(గురువారం)	ఇంగ్లీష్ పేపర్-2
28-02-2026(శనివారం)	హిస్టరీ పేపర్-2, బోటనీ పేపర్-2
03-03-2026(మంగళవారం)	మేథమెటిక్స్ పేపర్-2ఎ, సివిక్స్ పేపర్-2
06-03-2026(శుక్రవారం)	జువాలజీ పేపర్-2, ఎకనామిక్స్ పేపర్-2
09-03-2026(సోమవారం)	మేథమెటిక్స్ పేపర్-2బి
11-03-2026 (బధవారం)	కామర్స్ పేపర్-2, సోషియాలాజీ పేపర్-2 ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ పేపర్-2
13-03-2026(శుక్రవారం)	ఫిజిక్స్ పేపర్-2
16-03-2026 (సోమవారం)	మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-2, జియోగ్రఫీ-2, బ్రిడ్జ్‌కోర్స్, మేథమెటిక్స్-2(బైపిసి)
18-03-2026(బుధవారం)	కెమిస్ట్రీ పేపర్-2
23-03-2026(సోమవారం)	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-2, లాజిక్ పేపర్-2

తొక్కిసలాట బాధిత కుటుంబాలకు సిపిఎం అండ

- రెండేళ్ల చిన్నారి కుటుంబానికి ఓదార్పు
- తల్లిని కోల్పోయిన కుమారుడి చదువు కొనసాగింపునకు ఎంఎ బేబీ హామీ

5

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 63 | విజయవాడ, శనివారం 4 అక్టోబర్ 2025 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 4 October 2025 | Rs



రాహుల్, జురెల్, జడేజా సెంచరీలు

- ఇండియా 448/5
- వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్ 162/10

10



మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

అమరావతి కోసం భూసేకరణ

- గత పూలింగ్ నోటిఫికేషన్ ఉపసంహరణ
- పనుల వేగవంతం కోసం ఎస్‌పివి
- కేబినెట్ నిర్ణయాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా అవసరమైన చోట భూసేకరణ చేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. రాజధాని నిర్మాణంలో భాగంగా ఇప్పటికే కొనసాగుతున్న ప్రాజెక్టులు, సంస్థలకు భూకేటాయింపులు, ప్లాట్ల కేటాయింపుల ప్రక్రియను వేగంగా పూర్తి చేసేందుకు వీలుగా భూ సేకరణ, పునరావాసం (ఎల్‌ఎ, ఆర్ అండ్ ఆర్) చట్టం-2013 కింద భూ సేకరణ చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ మేరకు 343.36 ఎకరాల భూమిని ల్యాండ్‌పూలింగ్ ద్వారా సేకరించాలంటూ ఇప్పటికే జారీ చేసిన నోటిఫికేషన్‌ను ఉపసంహరించాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు. అవసరమైన చోట చట్ట ప్రకారం భూ సేకరణకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సిఆర్‌డిఎ తాజాగా విడుదల చేస్తుంది. మంత్రిమండలి తీసుకున్న నిర్ణయాలను మీడియాకు రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పార్థసారధి వివరించారు. రాజధాని ప్రాంతంలో అభివృద్ధి పనులు వేగంగా జరిపేందుకు వీలుగా స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పివి)ని ఏర్పాటు చేయాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించినట్లు మంత్రి చెప్పారు. శంలోనే తొలిసారిగా గ్రీన్‌హైడ్రోజన్ ప్రాజెక్టును అభివృద్ధి చేసేందుకు వీలుగా రాష్ట్రంలో సలహా కమిటీని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

ఇద్దరు మించి పిల్లలున్నా నీటి సంఘాల ఎన్నికలకు ఓకే

నీటి సంఘాల ఎన్నికల్లో ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నప్పటికీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలుగా నిబంధనలను సడలించాలన్న ప్రతిపాదనను కేబినెట్ అంగీకరించింది. ఈమేరకు నీటిపారుదల వ్యవస్థల చట్టానికి సవరణ చేయనున్నారు. ప్రకాశం బ్యారేజీ, దివిసీమ ప్రాంతంలోని కాలువల కీలకమైన మిగతా 5లో

మహోగ్రంగా వంశధార

ఉధృతంగా నాగావళి, మహేంద్రతనయ, బహుదా నదులు

- వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర అతలాకుతలం
- విశాఖలో ఈదురుగాలుల జోరు
- ముగ్గురు మృతి.. పంటలకు అపార నష్టం
- సిఎం సమీక్ష , తక్షణ సహాయానికి ఆదేశం



వంశధార వరద ఉధృతికి జలదిగ్బంధంలో చిక్కుకున్న కొత్తూరు మండలంలోని పెనుగోటివాడ గ్రామం

ప్రజాశక్తి - యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో గురు, శుక్రవారాల్లో కురిసిన వర్షానికి ఉత్తరాంధ్ర అతలాకుతలమైంది. ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా వంశధార నది మహోగ్రరూపం దాల్చింది. నాగావళి, మహేంద్ర తనయ, బహుదా నదులు సైతం ఉధృతంగా పరుగులు తీశాయి. ఈ నదుల్లో ఇటీవల కాలంలో ఎన్నడూ లేనంతగా వరద చోటుచేసుకోవడంతో అధికారయంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. వంశధారలో శుక్రవారం మధ్యాహ్నం ఏకంగా 1.04 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహంతో ఉధృతరూపం దాల్చింది. దీంతో అధికారయంత్రాంగం మూడవ నెంబరు ప్రమాద హెచ్చరికను ఎగురవేసింది. పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షపు నీటితో గోడలు నానడంతో శ్రీకాకుళం జిల్లా మందస మండలం సవర తుబ్బూరులో ఇల్లు కూలి భార్యాభర్తలు సవర బుద్దయ్య (65), రూపమ్మ (60) మృతి చెందారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలంలో ఉదయపురం పంచాయతీలో గల ఉదయపురం కాలనీలో మట్టి ఇంటో నివాసముంటున్న అన్నదమ్ములు కుంబురుక అరవింద్ (28), కుంబురుక వినాయకరావులపై ఇంటి గోడ కూలిపోయింది. తీవ్రగాయాలపాలైన అరవింద్ చికిత్స పొందుతూ మరణించారు. ఉత్తరాంధ్రలోని దాదాపు అన్ని జిల్లాలోనూ భారీ ఎత్తున పంట నష్టం సంభవించింది. ఎక్కడ చూసిన పంటపొలాలు నీటమునిగి కనిపిస్తున్నాయి. విశాఖ నగరంలోఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఎంవిపి.కాలనీ, మద్దిలపాలెం, హెచ్‌బి.కాలనీ వంటి చోట్ల వాయు విలయమే నెలకొంది. ఈదురు గాలులకు 80 ప్రాంతాల్లో చెట్లు పాక్షికంగా, 150 ప్రాంతాల్లో పూర్తిగా నేలకూలాయని జివిఎంసి అధికారులు ప్రకటించారు. అల్లూరి జిల్లా అనంతగిరి - అరకు ఘాట్ రోడ్డులో ఈదురుగాలులతో కూడిన వర్షానికి వృక్షాలు విరిగిపడ్డాయి. శివలింగపురం, తైడా, డముకు, ములియాగూడ, అనంతగిరి, బీసుపురం, సుంకరమెట్ట ప్రాంతాల్లో రహదారులపై చెట్లు కూలడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది నెలకొంది. ఐదు గంటలపాటు రహదారులపై రాకపోకలు నిలిచిపోయాయి. పరిస్థితి తీవ్రతపై హోంశాఖ మంత్రి అనితతో పాటు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులతో సమీక్షించారు. మృతుల కుటుంబాలకు నాలుగు లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని అధికారులను సిఎం ఆదేశించారు. (మరిన్ని వార్తలు 9లో)

ప్రజాస్వామ్యం ఉంటేనే ప్రశ్నించగలం

- ట్రంప్ సుంకాలపై మోడీ మౌనమేల..?
- డబుల్ ఇంజిన్ కాదు.. ఇది డబుల్ దోపిడీ సర్కార్
- 'ప్రమాదంలో ప్రజాస్వామ్యం' సదస్సులో బివి రాఘవులు



సదస్సులో ప్రసంగిస్తున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'మన దేశ రాజ్యాంగంలో ప్రజాస్వామ్యం ఉంది... రాజ్యాంగాన్ని కాపాడుకుంటేనే ప్రజాస్వామ్యం మనగలుగుతుంది.. ప్రజాస్వామ్యం ఉంటేనే ప్రశ్నించగలం' అని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. 'దేశరక్షణ, దేశభక్తి, హిందువుల ఐక్యత' గురించి చెబుతున్న ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిల వైఖరి వల్ల భిన్నత్వంలో ఏకత్వం సాధ్యమేనా? అని ప్రశ్నించారు. భిన్నత్వంలో ఏకత్వమనేది మన దేశ రాజ్యాంగం అమలుతోనే సాధ్యమన్నారు. హెచ్1బి వీసాల పేరుతో మన ఉద్యోగులను, సుంకాల పేరుతో మన దేశ ప్రజలను ట్రంపు సర్కారు ఇబ్బందులకు గురిచేస్తుంటే ప్రధాని మోడీ ఎందుకు మౌనం దాల్చారని ప్రశ్నించారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా.. ట్రంపును ప్రశ్నించమని మోడీని చంద్రబాబు ఎందుకు అడగడం లేదన్నారు. 'డబుల్ ఇంజిన్ సర్కార్.. ప్రమాదంలో ప్రజాస్వామ్యం' అనే అంశంపై తిరుపతి రామతులసి కల్యాణ మండపంలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు సదస్సుకు అధ్యక్షత వహించారు. రాఘవులు మాట్లాడుతూ... కేంద్రంలోని ఎన్‌డిఎ, రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వాలు తమది డబుల్ ఇంజిన్ పాలనని చెబుతున్నారని, వాస్తవానికి ఇది డబుల్ ఇంజన్ దోపిడీ పాలనని ఎద్దేవా చేశారు. గతంలో వైసిపి అవినీతి పాలనపై ధ్వజమెత్తిన చంద్రబాబు, ప్రస్తుతం టిడిపి కూటమి హయాంలోనూ ఇసుక, కంకర, భూముల కబ్జాలో ఏ మాత్రం తక్కువ తినడం లేదని ఆరోపించారు. అమరావతికి 1300 ఎకరాలు సరిపోతున్నా, వేలాది ఎకరాలు ఎందుకు సేకరిస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. హైదరాబాద్‌ను వెయ్యి ఎకరాల్లోనే నిర్మించారని గుర్తు చేశారు.

మొన్నటివరకూ పోలవరం-బనకచర్లకు రూ. లక్ష కోట్లని చెప్పిన సర్కారు, ప్రస్తుతం పోలవరం-సోమశిలను తెరపైకి తెచ్చి రూ. 50 వేల కోట్లతో సరిపెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. అభివృద్ధి మాటున, ప్రాజెక్టుల పేరుతో రైతులు, దళితుల నుంచి వేలాది ఎకరాలను బలవంతంగా లాక్కుని కార్పొరేట్లకు కట్టబెడుతున్నారన్నారు. 17 మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌కు అప్పగిస్తే పేదలకు వైద్యం అందేనా అని ప్రశ్నించారు. రాష్ట్రాల హక్కులు హరించుకుపోతుంటే, జిఎస్‌టి ద్వారా రాష్ట్రానికి రూ.తొమ్మిది వేల కోట్లు రావాల్సి ఉన్నా కేంద్రాన్ని చంద్రబాబు ప్రభుత్వం అడగలేని దయనీయ స్థితిలో ఉందన్నారు. భారతదేశం అమెరికా మిగతా 5లో


నేడు 'ఆటో డ్రైవర్ సేవలో' ప్రారంభించనున్న సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆటో డ్రైవర్లకు సాయం అందించే 'ఆటో డ్రైవర్ సేవలో' పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం ప్రారంభించనున్నారు. విజయవాడలోని సెంట్రల్ నియోజకవర్గం పరిధిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సిఎం పాల్గొననున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ పథకంలో భాగంగా రాష్ట్రంలో సొంత ఆటో, మోటార్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 2.90 లక్షల మందికి రూ.436 కోట్లు అందజేయనుంది. ఈ పథకంలో ఆటో డ్రైవర్లు 2,25,621 మంది, త్రీ వీలర్ ప్యాసింజర్ వాహనాల డ్రైవర్లు 38,576 మంది, మోటారు క్యాబ్ డ్రైవర్లు 20,072 మంది, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు 6,400 మంది లబ్ధిపొందనున్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పథకం అందేలా చేయాలని అధికారులకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అర్హత ఉండి జాబితాలో పేరు లేనివారి సమస్యలను పరిష్కరించిన వెంటనే లబ్ధిదారుల జాబితాలో చేర్చేందుకు ఏర్పాటు చేసింది.

ఫిబ్రవరి 23 నుంచి ఇంటర్ పరీక్షలు

- షెడ్యూల్ విడుదల



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియట్ పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన టైమ్ టేబుల్‌ను ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి నారాయణ భరత్ గుప్తా శుక్రవారం విడుదల చేశారు. నూతన విద్యావిధానం-2020 (ఎన్ఇపి)కి అనుగుణంగా ఇంటర్మీడియట్‌లో మార్పులు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ మార్పులు తరువాత తొలిసారి పబ్లిక్ పరీక్షలను బోర్డు నిర్వహించనుంది. ఇప్పటి వరకు 15 రోజులతో ముగిసే పరీక్షలను సుమారు నెల రోజులపాటు జరపనుంది. రానున్న మార్చి 24 వరకు పరీక్షలు జరగనున్నాయి. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలను బోర్డు నిర్వహించనుంది. ప్రాక్టికల్ పరీక్షలు జనరల్ కోర్సులకు ఫిబ్రవరి ఒకటి నుంచి 10వ తేదీ వరకు, ఒకేషనల్ కోర్సులకు జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10 వరకు జరగనున్నాయి. సమగ్రశిక్ష ఒకేషనల్ ట్రేడ్ (ఎన్ఎస్‌క్యూఎఫ్ లెవల్-4) పరీక్ష ఫిబ్రవరి 13న ఉంటుంది. (టైం టేబుల్ 2లో)

విద్యార్థినుల మరణాలపై సమగ్ర దర్యాప్తు

- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్
- పాఠశాల వద్ద తల్లిదండ్రులతో ఆందోళన

6

గాజా నువ్వు ఒంటరి కాదు !

- ప్రపంచవ్యాప్తంగా సంఘీభావ ప్రదర్శనలు
- యూరప్‌లోనూ నిరసనల హోరు

5

తొక్కిసలాట జరగ్గానే పారిపోతారా?

- ఇవేనా నాయకత్వ లక్షణాలు!
- టివికె అధ్యక్షులు విజయ్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం
- కరూర్ ఘటనపై సిట్ ఏర్పాటు

చెన్నై : తమిళనాడులోని కరూర్‌లో చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనకు సంబంధించి తమిళగ వెట్రి కళగం (టివికె) వ్యవస్థాపకులు, ప్రముఖ నటుడు విజయ్‌పై ఆ రాష్ట్ర హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తొక్కిసలాట జరగ్గానే ఆయన ఆ ప్రాంతం నుంచి పారిపోయారని, ఇంత బాధ్యతారాహిత్యమేంటని ప్రశ్నించింది. నాయకత్వ లక్షణాలు ఇవేనా అంటూ నిలదీసింది. కనీసం నాటి విషాద ఘటనపై ఆ పార్టీ పశ్చాత్తాపం కూడా వ్యక్తం చేయలేదని పేర్కొంది. ఈ ఘటనకు సంబంధించిన కేసులో టివికె నేతలు బస్సీ ఆనంద్, సిటిఆర్ నిర్మల్ కుమార్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై జస్టిస్ సెంథిల్‌కుమార్ నేతృత్వంలోని మద్రాసు హైకోర్టు మదురై బెంచ్ శుక్రవారం విచారణ చేపట్టింది. అనంతరం ఈ తొక్కిసలాట ఘటనపై దర్యాప్తునకు సీనియర్ ఐపిఎస్ అస్రా గార్గ్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా ధర్మాసనం టివికె అధినేత విజయ్ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తొక్కిసలాట రోజు విజయ్ వ్యవహరించిన తీరు చూస్తుంటే ఆయన మానసిక స్థితి ఎలాంటిదో తెలుస్తోందని కోర్టు పేర్కొంది. 41 మంది ప్రాణాలను హరించిన ఈ తొక్కిసలాట ఘటన విషయంలో నిర్వహణా తీరు సరిగా లేదని.. విజయ్ పట్ల ప్రభుత్వం కూడా కొంత ఉదాసీనంగా వ్యవహరించిందని జస్టిస్ సెంథిల్ కుమార్ వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై బాధ్యత విషయంలో నిర్వాహకులను, పోలీసులను ఆయన ప్రశ్నించారు. ఒక ఈవెంట్ నిర్వాహకునిగా మీకెలాంటి బాధ్యత లేదా? అని విజయ్‌ని ఉద్దేశించి ఘాటుగా ప్రశ్నించారు. సంఘటన జరిగిన వెంటనే విజయ్ అక్కడ నుండి అదృశ్యమైపోయారని కోర్టు వ్యాఖ్యానించింది. ఇటువంటి ప్రవర్తనను, వ్యవహార శైలిని తీవ్రంగా ఖండించాల్సి వుందని హెచ్చరించింది. టివికె నేతల ముందస్తు బెయిల్ పిటిషన్లపై ఉత్తర్వులను బెంచ్ రిజర్వ్ చేసుకుంది. ముందస్తు బెయిల్‌కు సంబంధించి మిగతా 5లో

ప్రముఖ రచయిత 'లల్లాదేవి' కన్నుమూత

ప్రజాశక్తి - ప్రత్తిపాడు (గుంటూరు జిల్లా)



ప్రముఖ రచయిత పరుచూరి నారాయణ చార్యులు (80) (లల్లాదేవి) గురువారం రాత్రి కన్ను మూశారు. వృద్ధాప్యం తో పాటు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడు తున్న ఆయన గుంటూరు లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య ఆదిలక్ష్మి, కుమార్తె హరి ప్రసన్నరాణి ఉన్నారు. కొడుకు నందగోపాల్ ఇటీవల మరణించారు. శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన స్వస్తలం గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం నిమ్మగడ్డవారి పాలెం. కథలు, చారిత్రక, సాంఘిక నవలలు, నాటకాలు దాదాపు 250పైగా రచించారు. 14 నవలలను కన్నడంలోకి అనువదించారు. పలు సినిమాల కు రచయితగా పనిచేశారు. సామ్రాట్ అశోక్, శ్వేతనాగు వంటి సినిమాలకు ఆయన రచనలే ఆధారం. అనేక రేడియో ప్రసంగాలు, కథలు, త్రైమాసిక నాటికలు ప్రసారమయ్యాయి.

కర్రల సమరంలో ఇద్దరు మృతి

- 80 మందికి గాయాలు
- పది మంది పరిస్థితి విషమం



కర్రల సమరం, (ఇన్‌సెట్‌లో) మృతులు చిన్న తిమ్మప్ప అరికెర, చిన్న ఆంజనేయులు (ఫైల్)

ప్రజాశక్తి-హొళగుంద (కర్నూలు)

కర్నూలు జిల్లా హొళగుంద మండల పరిధిలోని నెరణికి, నెరణికి తండా, కొత్తపేట కొండ గుహలో వెలసిన దేవరగట్టు మాల మల్లేశ్వరుల జైత్రయాత్ర (కర్రల సమరం)లో తల పగిలి ఒకరు, తొక్కిసలాటలో మరొకరు మృతి చెందారు. ఆలూరు మండలం అరికెర చిన్న తిమ్మప్ప (57) సింహాసన కట్ట వద్ద కర్రలతో కొట్టుకోవడంలో తల పగిలి మృతి చెందారు. ఆదోని అరుణ్‌జ్యోతి నగర్ చిన్న ఆంజనేయులు (50) తొక్కిసలాటలో ఊపిరాడక మరణించారు. కర్రల సమరంలో 80 మందికిపైగా గాయాలయ్యాయి. పది మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను ఆలూరు, ఆదోని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నలుగురిని కర్నూలుకు తరలించారు. 800 మంది పోలీసులు ఉన్నప్పటికీ రింగ్ కర్రలను దేవరగట్టుకు రాకుండా నిలువరించలేకపోయారు. అవగాహన సదస్సులు, రింగ్ కర్రలు స్వాధీనం చేసుకున్నప్పటికీ రక్తపాతం ఆగలేదు.

కర్రల సమరం సాగింది ఇలా!

రాత్రి 12 గంటల తరువాత రింగ్ కర్రలతో వేలాది మంది విడతల వారీగా దివిటీలు, డప్పు శబ్దం చేస్తూ వచ్చారు. 1-30 గంటలకు లక్షకు పైగా జనం చేరుకున్నారు. జైత్ర యాత్రలో భాగంగా శ్రీ మాళ మల్లేశ్వరల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న సమయంలో విగ్రహ మూర్తులను దక్కించుకునేందుకు ఒకరిని ఒకరు రింగ్ కర్రలతో కొట్టుకున్నారు. విగ్రహాలను అర్ధకిలో మీటరు దూరంలోని రక్షపడ వద్దకు వెళ్లి గొరవయ్య రెగ్యులర్ పూజారి నుంచి పిడికెడు రక్తం చిందించారు. తిరిగి ఉత్సవ మూర్తులను బసవన్న గుడికి చేర్చడంతో జైత్రయాత్ర ముగిసింది. ఎస్‌పి విక్రాంత్ పాటిల్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యా భరద్వాజ్ ఉత్సవాన్ని పర్యవేక్షించారు. ఇంటర్‌నేషనల్ మీడియా ఇటలీ దేశం నుంచి ముగ్గురు పాత్రికేయులు కవరేజీకి వచ్చారు.

ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి : జన విజ్ఞాన వేదిక

కర్రల సమరంలో మరణించిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని జన విజ్ఞాన వేదిక (జెవివి) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. సమరంలో చోటుచేసుకున్న హింస పట్ల జెవివి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎస్ లక్ష్మణరావు, తవ్వా సురేష్ విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులైన వారి చికిత్సకు అయ్యే పూర్తి ఖర్చు ప్రభుత్వమే భరించాలన్నారు. సంప్రదాయాల పేరిట కొనసాగుతున్న మూఢ విశ్వాసాలను అరికట్టాలని, ఆ దిశగా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

సంపాదకీయం


ఏకపక్ష తొలగింపులు!

బీహార్‌లో వివాదాస్పదమైన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ(సర్)ను పూర్తి చేసిన ఎన్నికల సంఘం 47 లక్షల మందిని తొలగించి తుది ఓటరు జాబితాను ప్రకటించడం దారుణం. ఆరు శాతం ఓటర్లను తొలగించడం అసాధారణమే! అది కూడా సర్‌కు వ్యతిరేకంగా ఇండియా బ్లాక్ పార్టీల నాయకత్వంలో ప్రజా నిరసనలు, సుప్రీంకోర్టులో కేసు నడిచి ఎన్నికల సంఘానికి ధర్మాసనం కొన్నిసార్లు మొట్టికాయలు వేసిన తరువాత కూడా ఈ స్థాయిలో తొలగింపులంటే ప్రజాగ్రహం, కోర్టు చీవాట్లు లేకపోతే ఇసి ఇంకెన్ని లక్షల మంది ఓటర్లను తొలగించేదో కదా! సర్ ప్రక్రియకు ముందు బీహార్‌లో 7.89 కోట్ల మంది ఓటర్లు ఉంటే, అందులో 65.63 లక్షల మంది ఓటర్లను తొలగించి 7.24 కోట్లతో ముసాయిదా ప్రకటించింది. వీరిలో మరణించిన, నకిలీ పత్రాలు సమర్పించిన వారిని, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్ల చిరునామాలను నవీకరించినట్టు ఇసి తెలిపింది. సర్ ప్రక్రియలో కొత్త ఓటర్ల పేర్లను కూడా జాబితాలో చేర్చినట్టు పేర్కొంది. కానీ ఈ వాదన సత్యదూరం. ఎందుకంటే ముసాయిదా కన్నా 17.87 లక్షల మంది ఓటర్లు పెరిగినా వీరిలో 16.56 లక్షలకు పైగా యువత కొత్తగా ఓటర్ రిజిస్ట్రేషన్ కోసం ఫారం-6ను సమర్పించినవారే. పెరిగినదాంట్లో 93 శాతం మంది యువ ఓటర్లు. కనుక తొలి ముసాయిదాలో తొలగించిన 65.63 లక్షల ఓటర్లలో నవీకరించినా లేక సుప్రీం చెప్పాక అంగీకరించిన ఆధారాలతో చేర్చినవి అనుకున్నా అవి కేవలం ఒక లక్షకు అటు ఇటు మాత్రమే వుంటాయి. ఇదీ ఇసి నిర్వాకం.

సర్ పేరిట ప్రజల హక్కులను హరించొద్దని, ఓటర్ల జాబితాను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నవీకరించాలని ఇసిని కోరుతూ కేరళ అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానించడం స్వాగతించదగినది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ సోమవారం ప్రవేశపెట్టిన తీర్మానానికి పాలక ఎల్‌డిఎఫ్, ప్రతిపక్ష యుడిఎఫ్ ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం హర్షణీయం. సర్ చేపడుతున్న సమయం, 2002 జాబితాను ఆధారంగా వినియోగించాలనే నిర్ణయం, ఓటర్ల కోసం నిర్దేశించిన అర్హత షరతులపై అసెంబ్లీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. మైనారిటీ కమ్యూనిటీలు, మహిళలు, పేద కుటుంబాలు, ఎస్‌సి, ఎస్‌టి తెగలు, ఎన్‌ఆర్‌ఐ కేరళీయ ఓటర్ల హక్కును సర్ నిరాకరించవచ్చునని తీర్మానంలో పేర్కొంది. కేరళలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయని, 2026లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని, ఈ సమయంలో సర్ చేపట్టాలనే ఇసి ఎత్తుగడ దురుద్దేశంతో కూడుకున్నదన్న విమర్శ సహేతుకమే! ఇసి నిర్ణయం జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్‌ఆర్‌సి)ను అమలు చేయడానికి పరోక్ష మార్గమంటూ తీర్మానం ఆందోళన వ్యక్తం చేయడం సబబైనది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించనున్న నేపథ్యంలో.. అవి పూర్తయ్యేంత వరకు సర్‌ను వాయిదా వేయాలన్న డిమాండ్ శత శాతం సమర్థనీయం.

సర్ రాజ్యాంగ చెల్లుబాటు సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్నప్పటికీ.. ఎన్నికలు సమీపిస్తున్న కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల్లో దాన్ని అమలు చేయడంపట్ల ఇసి చూపుతున్న ఆతృత అమాయకపు చర్యగా అనుకోరాదు. పౌరసత్వ సవరణ చట్టాన్ని పునరుద్ధరింపచేసేందుకు వినియోగించే సెక్షన్లను సర్‌లో వినియోగించడం, పౌరసత్వాన్ని మత ఆధారితంగా చేయడానికి ప్రయత్నించడం ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న పెద్ద సవాలుగా భావించవలసి వుంటుంది. 1987 తర్వాత జన్మించిన వ్యక్తులు వారి తల్లిదండ్రుల్లో ఎవరికైనా పౌరసత్వానికి సంబంధించిన ఆధారాలను సమర్పించాలనే షరతు వయోజన ఓటు హక్కును విస్మరిస్తుంది. 2003 తర్వాత జన్మించిన వ్యక్తులు ఇద్దరు తల్లిదండ్రుల పౌరసత్వ ఆధారాలను సమర్పించాలి. సుప్రీంకోర్టు గట్టిగా ఆదేశించిన తరువాత మాత్రమే ఆధార్ కార్డును ప్రాతిపదికగా అంగీకరించిందంటే ఓటర్లను జాబితాలకు దూరం చేయడానికి ఇసి ఎంతలా యత్నిస్తుందో విదితమవుతోంది. రికార్డులను రూపొందించలేకపోయారనే సాకుతో ఓటర్ల జాబితా నుండి వ్యక్తులను మినహాయించడం రాజ్యాంగం హామీ ఇచ్చిన వయోజన ఓటు హక్కును తిరస్కరించడమే. అక్టోబర్ 7వ తేదీ నుండి జరగనున్న సుప్రీంకోర్టులో తుది వాదనల అనంతరం సర్ చట్టబద్ధత విషయం తేలనుంది. ప్రస్తుతం సాగుతున్న ఎన్నికల కమిషన్ బీహార్ సందర్శన తర్వాత ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించవచ్చని వార్తలొస్తున్నాయి. ఈ ఉత్కంఠకు ఎలా తెర పడుతుందో మరి!

మహనీయుల మాట



ఓటు హక్కు ఎంత గొప్ప ఆయుధమో మీరు ఎప్పుడైనా గమనించారా? ప్రజలు దీన్ని ఉపయోగించుకోవాలి. విప్లవం కన్నా ఇది చాలా నెమ్మదిగా జరిగే ప్రక్రియ. కానీ పది రెట్లు ఎక్కువగా నమ్మదగిన ప్రక్రియ.

- ఫ్రెడరిక్ ఏంగెల్స్

ప్రజల దృష్టి మళ్లించడం కాదు, సమస్యలు పరిష్కరించాలి

విశ్లేషణ

వి.ఆర్



ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కార్మికుల జీవితాల గురించి అనేకం మాట్లాడిన కూటమి నేతలు ఏకంగా 13 గంటల పని విధానానికి ఈ అసెంబ్లీ సమావేశంలో చట్టం చేశారు. స్త్రీ శక్తి పథకం గురించి శాసనసభలో సుదీర్ఘ ప్రసంగం చేసిన ముఖ్యమంత్రి, మహిళలను రాత్రి షిఫ్టుల్లో పని చేయించరాదనే చట్టాన్ని మార్చి 'రాత్రి పగలు తేడా లేదు, యజమానుల ఇష్టానుసారం మహిళలు కూడా పని చేయాల్సిందే' అని ఈ చట్టంలో చేర్చారు. ఈ విధానాన్ని అడ్డుకోవలసిన ప్రతిపక్షం సభకు హాజరు కాలేదు. యజమానుల చిరకాల కోరిక సులభంగా నేరవేరింది. శాసనమండలిలో మెజారిటీగా వున్న వైసిపి ఈ బిల్లుపై ఓటింగ్‌కు పట్టు పట్టకుండా వాకౌట్ చేయడం ఎవరి ప్రయోజనాల కోసం?

ఈ సీజన్‌లో ఉల్లి, టమోటా, ధాన్యం రైతులు గిట్టుబాటు ధరలు లేక తీవ్రంగా నష్టపోయారు. దాదాపు అన్ని జిల్లాల్లో యూరియా కోసం రైతులు గంటలకొద్దీ క్యూలైన్లలో నిలబడాల్సి వచ్చింది. తమ వృత్తిని కాపాడమని మత్స్యకారులు, తమ భూమి నుండి తరిమేయకండని గిరిజనులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారు. అంగన్‌వాడీలు, ఆశాలు, మున్సిపల్ కార్మికులు, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు తమకు ఇచ్చిన హామీలను అమలు చేయమని వివిధ రూపాల్లో ఉద్యమాలు చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ఎనిమిది రోజులు జరిగాయి. తమ సమస్యల పరిష్కారానికి ఈ సమావేశాలు ఎంతో కొంత ఉపయోగపడతాయని ఆశించిన ఈ తరగతులకు నిరాశే ఎదురైంది. పాతవి పరిష్కారం కాకపోగా కొత్త సమస్యలను సృష్టించారు పాలకులు. కార్మికులకు 13 గంటల పని దినం, పది ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించే పిపిపి విధానం, మద్యం అమ్మకాలను మరింత పెంచేందుకు బార్ అండ్ రెస్టారెంట్లకు అనుమతులకు ఈ అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించారు. గనుల రాయల్టీ ఫీజు వసూలు చేసుకునే అధికారాన్ని ప్రైవేట్ కంపెనీకి అప్పగించారు. మేజర్ పంచాయితీల్లోని ప్రజలపై భారాలు వేసే 'రూర్బన్' విధానాన్ని రూపొందించారు. భూ సేకరణ వేగంగా కొనసాగించాలని నిర్ణయించారు. వీటి నుండి ప్రజల దృష్టి మళ్ళించేందుకు వ్యక్తుల చుట్టూ చర్చను లేవదీసి శాసనసభను రోజుకో మలుపు తిప్పారు.

ఎనిమిది రోజులు సాగిన శాసనసభలో ఏడు రోజుల పాటు ముఖ్యమంత్రి ఏడు అంశాల మీద సుదీర్ఘ ఉపన్యాసం చేశారు. వీటన్నింటి సారాంశం ప్రైవేటీకరణ విధానాలను వేగంగా అమలు చేయడం, బలవంతాన భూములను సేకరించడం, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు మద్దతుగా నిలవడం. మరోవైపు తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వనందుకు అలక పూనిన జగన్ మోహన్ రెడ్డి శాసనసభకు ఈసారి కూడా హాజరు కాలేదు. ఆ పార్టీకి చెందిన పది మంది ఎమ్మెల్యేలూ వెళ్లలేదు. ఇక మిగిలింది ఏకపక్షమే, అది అధికారపక్షమే. అందుకే శాసనసభ సమావేశాల పట్ల ప్రజల్లో పెద్దగా ఆసక్తి లేదు. ప్రజల మీద భారాలు వేసే విధానాలను, ప్రజల ఆస్తులను, సహజ వనరులను తమ వారికి కట్టబెట్టేందుకు ఇంతకు మించిన తరుణం లేదని పాలక పార్టీలు భావిస్తున్నాయి. ప్రజా వ్యతిరేక విధానాలను వేగంగా చట్టబద్ధం చేసుకుంటున్నాయి. కార్మికుల హక్కుగా వున్న ఎనిమిది గంటల పనిదినాన్ని మార్చాలని చాలా కాలంగా యజమానులు కోరుకుంటున్నారు, పాలకులను డిమాండ్ చేస్తున్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 40కి పైగా వున్న కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి హక్కులు లేని ఆధునిక బానిసలుగా కార్మికులను మార్చివేశారు. ఇదే విధానాన్ని దేశమంతటా అమలు చేయాలని రాష్ట్రాలను బిజెపి పాలకులు ఒత్తిడి తెస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కార్మికుల జీవితాల గురించి అనేకం మాట్లాడిన కూటమి నేతలు ఏకంగా 13 గంటల పని విధానానికి ఈ అసెంబ్లీ సమావేశంలో చట్టం చేశారు. స్త్రీ శక్తి పథకం గురించి శాసనసభలో సుదీర్ఘ ప్రసంగం చేసిన ముఖ్యమంత్రి, మహిళలను రాత్రి షిఫ్టుల్లో పని చేయించరాదనే చట్టాన్ని మార్చి 'రాత్రి పగలు తేడా లేదు, యజమానుల ఇష్టానుసారం మహిళలు కూడా పని చేయాల్సిందే' అని ఈ చట్టంలో చేర్చారు. ఈ విధానాన్ని అడ్డుకోవలసిన ప్రతిపక్షం సభకు హాజరు కాలేదు. యజమానుల చిరకాల కోరిక సులభంగా నేరవేరింది. శాసనమండలిలో మెజారిటీగా వున్న వైసిపి ఈ బిల్లుపై ఓటింగ్‌కు పట్టు పట్టకుండా వాకౌట్ చేయడం ఎవరి ప్రయోజనాల కోసం?

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు, వామపక్షాలు, కొందరు వ్యక్తులు దీర్ఘ కాలంగా పోరాడుతున్నారు. కేంద్రం ప్యాకేజి ఇచ్చినందుకు ప్రధానికి, కేంద్రానికి ధన్యవాదాలు తెలుపుతూ అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం పెట్టింది. ఈ ప్యాకేజి ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణలో భాగమేనని అనేక ఆధారాలతో రుజువవుతున్నా పాలకుల చెవికి ఎక్కడం లేదు. ఉక్కు ఫ్యాక్టరీలోని 43 విభాగాలను ముక్కలు ముక్కలుగా ప్రైవేటీకరిస్తున్న కేంద్రానికి ధన్యవాదాలు తెలిపి మోడీ పట్ల తమ భక్తిశ్రద్ధలను చాటుకోవాలని టిడిపి, జనసేన నేతలు భావించడం ఆంధ్రుల ఆత్మగౌరవానికి భంగకరం. కేంద్రం పట్ల వైసిపి లొంగుబాటు వైఖరిని అవకాశంగా తీసుకున్న టిడిపి, ధన్యవాద తీర్మానానికి మద్దతు తెలుపుతారా లేదా అంటూ ఆ పార్టీ ఎమ్మెల్సీలను నిలదీసింది. ఏం చేయాలో పాలుపోని వైసిపి ఎమ్మెల్సీలు వాకౌట్ చేసి సరిపుచ్చుకున్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలను మండలిలో ప్రశ్నించిన ఒకే ఒక్కడు పిడిఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి.

పది ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకుంది. దానికి పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్‌షిప్ (పిపిపి) అని ముసుగు వేసుకుంది. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక మెడికల్ కాలేజీని నిర్మించి వీలైతే నేరుగా ప్రైవేటీకరణ, లేకపోతే పిపిపి విధానం ద్వారా వైద్య విద్యను కార్పొరేట్లకు అప్పగించాలనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయంలో భాగంగా మన రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు వచ్చాయి. వీటిలో ఐదు కాలేజీలు పూర్తయి అడ్మిషన్లు జరిగాయి. వీటిలో 50 శాతం సీట్లు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు (ఇష్టం వచ్చిన రేటుకు సీట్లను అమ్ముకోవడం) పేరుతో గత వైసిపి ప్రభుత్వం 107, 108 జివోలు తెచ్చింది. నాడు ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన టిడిపి, జనసేన నాయకులు నేడు 50 శాతం కాదు, మొత్తం వ్యాపారం చేసుకునే పిపిపి విధానానికి సిద్ధమయ్యారు. ప్రజల సొమ్ముతో నిర్మించిన భవనాలను, 835 ఎకరాల భూమిని, ప్రభుత్వ ఆధీనంలో వున్న ఆసుపత్రులను కారుచౌకగా ప్రైవేట్ వారికి అప్పగించే ఈ విధానం రాష్ట్ర ప్రజలకు పెనుభారంగా మారనుంది. దీనిపై వామపక్షాలు, ప్రజాతంత్రవాదులు ప్రశ్నించడం పెరగడంతో పిపిపి అంటే ప్రైవేటీకరణ కాదని లోకేష్‌తో పాటు, బిజెపి కి చెందిన రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి అసెంబ్లీలో కొత్త భాష్యాలు చెప్పారు. తాటి చెట్టు ఎందుకు ఎక్కావంటే దూడ గడ్డికి అని చెప్పినంత మాత్రాన వాస్తవాన్ని ప్రజలు గుర్తించకపోరు. ఇంత ప్రమాదకరమైన విధానం మీద శాసనసభలో చర్చే లేకుండా పోయింది. మాజీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ప్రస్తుత బిజెపి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావుకు పిపిపి విధానం కంటే సినిమా రేట్ల మీద, చిరంజీవి అవమానం మీద ఇప్పుడు ప్రేమ పుట్టుకొచ్చింది. ఇందుకు ఎమ్మెల్యే బాలకృష్ణ అసందర్భ ప్రేలాపన తోడైంది. చిరంజీవి స్పందన, ప్రజల్లో దుమారం లేవడంతో రెండు రోజుల తర్వాత తీరిగ్గా కామినేని శ్రీనివాసరావు తన వాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు. ఈలోగా వైద్య విద్య ప్రైవేటీకరణ పక్కదారి పట్టింది.

గత, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ ఉద్యోగులకు రూ.30 వేల కోట్లకు పైగా బకాయిపడ్డాయి. ఉద్యోగ విరమణ చేసిన వారికి గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, రిటైర్‌మెంట్ లాంటి సదుపాయాలు సంవత్సరాలుగా చెల్లించడంలేదు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు డి.ఎ లు బకాయిలు వున్నాయి. దసరా పండగకు కనీసం రెండు డి.ఎ లైనా వస్తాయనే ఆశ నిరాశ అయ్యింది. బోధనేతర పనుల నుండి తమను మినహాయించాలని, అనవసర యాప్‌లతో వేధించరాదని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర వ్యాప్తంగా 'రణభేరి' యాత్ర నిర్వహించి గుంటూరులో వేలాది మందితో సభ జరిపింది. స్పందించే సమయం మాత్రం పాలకులకు లేదు. గతంలో శాసనమండలిలో ఐదారుగురు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు వుండడంవల్ల ప్రభుత్వాన్ని నిలదీసేవారు. దీని ప్రభావం శాసనసభ మీద పడి పాలకులకు ఎంతో కొంత స్పందించక తప్పేది కాదు. ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వ స్కీమ్ కార్మికులు సంవత్సరంన్నర కాలంగా ఆందోళనలు చేయాల్సి వచ్చింది. ఈ కార్మిక సంఘాలతో మాట్లాడేందుకు మంత్రులకు తీరికలేదు.

కర్నూలు జిల్లాలో ఉల్లి రైతులు గిట్టుబాటు ధర కోసం రోడ్లు ఎక్కారు. ఒక దశలో కిలో 50 పైసలకు అమ్ముకోవలసి రావడంతో రైతుల్లో ఆగ్రహం పెరిగి, మార్కెట్‌లో బైఠాయించారు. దిగుబడి ఎక్కువ రావడంతో కొనుగోలు సమస్య వచ్చిందని రెడీమేడ్ సమాధానంతో సమస్యను పక్కదారి పట్టించాలని ప్రభుత్వం ప్రయత్నించింది. రైతుల్లో వ్యతిరేకత వస్తుందనే సమాచారంతో క్వింటా రూ.1,200కు కొనుగోలు చేస్తామని ప్రకటించాల్సి వచ్చింది. కలెక్టర్ ప్రారంభించిన కొనుగోలు కేంద్రం గంట కూడా అమలు కాలేదు. రాష్ట్రంలో యూరియా సమస్యే లేదని మొదట్లో వాదించిన ప్రభుత్వం చివరకు యూరియా కొరతను అంగీకరించింది. పది శాతానికి మించి యూరియా తగ్గించుకుంటే బస్తాకు రూ.800 సబ్సిడీ మొత్తాన్ని రాష్ట్ర ఖజానాకు జమ చేస్తానన్న కేంద్రం తాయిలాలకు ఆశపడి 25 శాతం కోటా తగ్గించుకున్న విషయం వెలుగులోకి రావడంతో ఆ రూ.800 రైతులకు ఇస్తామని ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రకటించాల్సి వచ్చింది. టమోటా ధర ఒకేసారి పది పైసలకు పడిపోయింది. బత్తాయి, అరటి ధరలు భారీగా తగ్గిపోయాయి. నెల్లూరు జిల్లాలో ఈ సీజన్‌లో పండిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వ కేంద్రాలు ప్రారంభించక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతులకు గిట్టుబాటు ధరలు అందించలేని పాలకులు ఈ సంవత్సరం 10.29 శాతం మద్యం అమ్మకాలను పెంచి సుమారు రూ.30 వేల కోట్లను రాష్ట్ర ఖజానాకు జమ చేసుకున్నారు.

ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం వంకావారి గూడెం పరిసరాల్లో నేవీ ఆయుధ డిపో, అల్లూరి, పార్వతీపురం మన్యం జిల్లాలో హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటు తమ జీవితాలకు తీరని నష్టం చేస్తుందని అడవిబిడ్డలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో జరుగుతున్న ప్రభుత్వ కుట్రలను అడ్డుకుంటున్నారు. బిజెపి, టిడిపి, జనసేన కూటమి నేతలు గిరిజనుల జీవితాలను ఛిద్రం చేస్తూ బలవంతపు భూ సేకరణకు సిద్ధపడుతున్నారు. కాకినాడ జిల్లా యు కొత్తపల్లి మండలం మత్స్యకారులు తమ వృత్తిని కాపాడమని రోడ్లపైకి వచ్చారు.

నెల్లూరు జిల్లా సంగం మండలం పెరుమన గ్రామం వద్ద అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పరు ఢీ కొట్టడంతో ఏడుగురు చనిపోయిన సందర్భంలోనే గనుల రాయల్టీ ఫీజు వసూలు చేసే అధికారాన్ని ప్రైవేట్ వారికి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎ.ఎం.ఆర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ రూ.1130 కోట్లతో టెండర్‌ను దక్కించుకుంది. ఈ సందర్భంలోనే ఎచ్చెర్ల బిజెపి ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో వైసిపి అనుకూల జి.కె.ఇన్‌ఫ్రా కంపెనీ తనకు తెలియకుండా మైనింగ్ చేస్తుందని, దీని వెనక టిడిపికి చెందిన ఓ ఎమ్మెల్యే అండదండలు వున్నాయని అసెంబ్లీలో మాట్లాడారు. అధికార పార్టీ నేతల అండతో ఇసుక, మట్టి అక్రమ మైనింగ్ పెద్ద మాఫియాలాగా పనిచేస్తుంది. ఇలాంటి స్థితిలో కార్పొరేట్ కంపెనీలకు ఉపయోగపడే రాయల్టీ వసూళ్ల విధానం మన సహజ వనరుల దోపిడిని మరింత తీవ్రం చేస్తుంది.

ప్రజలు ఒకటి అడుగుతుంటే మరొకటి మాట్లాడడం పాలకులకు వెన్నతో పెట్టిన విద్య. ఈ అసెంబ్లీ సమావేశాల్లో జరిగిన కొన్ని సంఘటనలు ఇందుకు తాజా నిదర్శనం. విజయవాడకు చెందిన టిడిపి ఎమ్మెల్యే బొండా ఉమా పర్యావరణ నియంత్రణ బోర్డు అధికారుల మీద, ఉపముఖ్యమంత్రి మీద అసెంబ్లీలో విమర్శచేశారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మీద బుచ్చయ్య చౌదరి, ధూళిపాళ్ల నరేంద్ర, కూన రవికుమార్, తెనాలి శ్రావణ్ కుమార్ విమర్శలు చేశారు. అన్ని శాఖల్లో లోకేష్ జోక్యం పెరిగిందని బిజెపి విష్ణుకుమార్ రాజు, తాను సిఫార్సు చేసిచేసి లెటర్ ప్యాడ్లు అయిపోతున్నాయే కాని పనులు జరగలేదని బొజ్జల సుధీర్‌రెడ్డి, సోషల్ మీడియాపై హోంమంత్రి సరిగా స్పందించడంలేదని ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, పితాని సత్యనారాయణ విమర్శలు చేశారు. ఆ తర్వాత ఎవరికి వారు గప్‌చిప్ అయ్యారు. సందట్లో సడేమియా లాగా ప్రజలపై భారాలు వేయడం, ప్రైవేటీకరణ విధానాలు అమలు చేయడాన్ని మాత్రం ఈ అసెంబ్లీ సమావేశాల్లో చట్టబద్ధం చేసుకున్నారు.

★

వక్ఫ్ వార్ షురూ..?

అటు ఇటు

పీపీ

"ఇప్పుడు ఉత్తరాది రాష్ట్రాలు వక్ఫ్ ఆస్తులపై బిజెపి ప్రభుత్వాల దాడి, ముస్లిం సంస్థల, వ్యాపారుల నిరసనలతో అట్టుడికిపోతున్నాయి. మరీ ముఖ్యంగా యోగీశ్వర పాలనలోని ఉత్తరప్రదేశ్‌లోనైతే ఉద్రిక్తతలు పెరిగిపోతున్నాయి. 'ఐ లవ్ మహ్మద్' అంటూ ముస్లింలు తలపెట్టిన కార్యక్రమాలకు సమాజ్‌వాది పార్టీ మద్దతు ప్రకటిస్తే సిఎం ఆదిత్యనాథ్ కత్తి కట్టారు. వక్ఫ్ ఆస్తుల్లో వున్నాయంటూ బరేలీ జిల్లాలో 38 దుకాణాలను సీజ్ చేశారు. మున్సిపల్ అధికారులు బలవంతంగా మూసేయించారని వ్యాపారులు అంటున్నారు."

లాభం లేనిది వ్యాపారి వరదన పోడని సామెత. మత రాజకీయాలు కూడా అంతే. ఏ అంశాన్ని వారు తీసుకున్నా దాంట్లో వేరువేరు 'మతాల మధ్య చిచ్చు పెట్టే వ్యూహమే పరమావధిగా వుంటుంది. కొంత కాలం కిందట హడావుడిగా, ఏకపక్షంగా వక్ఫ్ కొత్త చట్టం తీసుకురావడం అందుకోసమేనని విమర్శకులు, నిపుణులు ఘోషించారు. వివిధ పార్టీలు, పక్షాలు సుప్రీం కోర్టులో సవాలు చేశాయి కూడా. రాజ్యాంగ పరంగా మైనార్టీల మత హక్కులకు భంగం కలిగించే అంశాలపై స్టే విధించిన న్యాయస్థానం పూర్తి విచారణను వాయిదా వేసింది. అయితే అసలు లోపల ఉద్దేశం మరోలా వున్నపుడు అంత తేలిగ్గా ఆగుతారా? ఇప్పుడు ఉత్తరాది రాష్ట్రాలు వక్ఫ్ ఆస్తులపై బిజెపి ప్రభుత్వాల దాడి, ముస్లిం సంస్థల, వ్యాపారుల నిరసనలతో అట్టుడికిపోతున్నాయి. మరీ ముఖ్యంగా యోగీశ్వర పాలనలోని ఉత్తరప్రదేశ్‌లోనైతే ఉద్రిక్తతలు పెరిగిపోతున్నాయి. 'ఐ లవ్ మహ్మద్' అంటూ ముస్లింలు తలపెట్టిన కార్యక్రమాలకు సమాజ్‌వాది పార్టీ మద్దతు ప్రకటిస్తే సిఎం ఆదిత్యనాథ్ కత్తి కట్టారు. వక్ఫ్ ఆస్తుల్లో వున్నాయంటూ బరేలీ జిల్లాలో 38 దుకాణాలను సీజ్ చేశారు. మున్సిపల్ అధికారులు బలవంతంగా మూసేయించారని వ్యాపారులు అంటున్నారు. వీటిపై ఏవైనా డాక్యుమెంట్లు వుంటే చూపించాకే తెరచుకోవచ్చని పోలీసులు హెచ్చరిస్తున్నారు. మేం వేసిన కేసులు తేలకుండానే ఎలా మూసేస్తారని దుకాణాదారుల ఘోష. ఈ నిరసనల్లో ముస్లిం పూజారులను, సహాయకులనూ కూడా అరెస్టు చేశారట. ఇక బీహార్‌లోనూ వైశాలి జిల్లాలో 'ఐ లవ్ మహ్మద్' పోస్టర్లు అంటించారని అరెస్టులు చేస్తున్నారు. మధ్య ప్రదేశ్‌లోనైతే బిజెపి మాజీ ఎంపీ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ ముస్లింలను రిపేర్ల కోసం కూడా ఇళ్లలోకి రానివ్వొద్దని, వారితో సోదర బంధం అసలొద్దని రెచ్చగొడుతున్నారు. వీటన్నిటి గమ్యం ఒకటే కదా!

రామా...అలా అన్నామా?

సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సి.జె. చంద్రచూడ్ ఇటీవల అయోధ్యలో బాబ్రీ మసీదు విధ్వంసంపై చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపాయి. వివాదాస్పద కట్టడం ప్రాంగణంలో ఇరు మతాలవారు తమ తమ అనుమతుల మేరకు పూజాదికాలు చేసుకోవలసి వుండగా...విధ్వంసాలు, వివాదాలు ఆ ఉత్తర్వును ఉల్లంఘించడమే కదా అని అడగ్గా- ఆ మాటకొస్తే అసలు ఆలయాన్ని పడగొట్టి బాబ్రీ మసీదు కట్టడమే దేవుడికి అపచారం కదా అని ఆయన సెలవిచ్చారు. 2019లో జస్టిస్ చంద్రచూడ్ సహా సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పులో ఆ మాటలు లేవు. ధర్మాసనం ఆదేశంపై అక్కడ బాగా లోతుగా తవ్వకాలు జరిపిన ఎ.ఎస్.ఐ (భారత పురావస్తు సర్వే సంస్థ) కూడా నిర్దిష్టంగా రామమందిరం వున్నట్టు, దాన్ని కూల్చి మసీదు కట్టినట్టు తేల్చలేదు. కాకపోతే ఏదో కాలంలో ఏదో మతపరమైన కట్టడం వుండేదని మాత్రం చెప్పింది. ఈ నేపథ్యంలో సంభావ్యతలు (ప్రాబబిలిటీస్) ఆధారంగా ఆ స్థలాన్ని మందిర నిర్మాణానికి ఇస్తున్నట్టు తీర్పులో చెప్పారు. ఆ తీర్పులో భాగస్వామి అయిన చంద్రచూడ్ ఇన్నాళ్లయ్యాక ప్రధాన న్యాయమూర్తిగా కూడా పనిచేసి విరమించాక ఈ మాట అనడం దిగ్భ్రాంతికరమే. సి.జె గా వున్నప్పుడు కూడా చంద్రచూడ్ గుజరాత్‌లో ఆలయ సందర్శనకు వెళ్లి ఆ ధ్వజస్తంభం మీద ఎగిరే పతాకమే రాజ్యాంగ పతాకం అనడం వివాదానికి కారణమైంది. ఢిల్లీ జిల్లా కోర్టులలో న్యాయమూర్తులు రెండు కోట్ల టోకరా కేసులో నిబంధనలు ఉల్లంఘించి బెయిల్ ఇచ్చినందుకుగాను ఎక్కడైనా శిక్షణకు పంపాలని సుప్రీం కోర్టు నిన్ననే వ్యాఖ్యానించింది. మరి సాక్షాత్తూ మాజీ ప్రధాన న్యాయమూర్తిగారే ఈ విధంగా మాట్లాడ్డంపై ఏమంటుందో?

మోహన్ 'లాల్ సలామ్'

మళయాల సూపర్ స్టార్, తెలుగువారికీ చిరపరచితుడు మోహన్‌లాల్‌కు ఈ మధ్యనే దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు వచ్చింది కదా. సూపర్ సీనియర్లను వదిలిస్తే తర్వాతి సీనియర్లలో రజనీకాంత్ తర్వాత ఈ గౌరవం పొందుతున్న కథానాయకుడు ఈయనే. ఈ పురస్కారం పొందినందుకు మోహన్‌లాల్‌కు 'లాల్ సలామ్' పేరుతో ఘన సత్కారం ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ ముఖ్య అతిథిగా పాల్గొనే ఈ వేడుకలో చిత్రపరిశ్రమ అతిరథ మహారథులంతా పాల్గొంటున్నారు. ఆ పిమ్మట 'ఆదాము నమ్ముక్కు పాదమ్' పేరిట సంగీత విభావరి సాగుతుంది. 65 ఏళ్ల మోహన్‌లాల్ ఇప్పటికి 360 చిత్రాల్లో నటించారు. సూపర్ స్టార్ అయినా 'దృశ్యం' వంటి మామూలు పాత్రల్లోనూ ఆయన ఇట్టే ఇమిడిపోతారు. నిజానికి దృశ్యం-3లో ఆయన నటిస్తున్నప్పుడే దాదా సాహెబ్ వార్త వచ్చిందట. వాణిజ్యపరంగా మలయాళ సినిమాను రూ.వంద కోట్ల మైలురాయి దాటించిన తొలి విజేత కూడా ఆయనే.

హిందీ రూసీ భాయ్ భాయ్

'హిందీ చీనీ భాయ్ భాయ్, హిందీ రూసీ భాయ్ భాయ్' నినాదాలు నవ స్వతంత్ర భారతీయుల చెవుల్లో ప్రతిధ్వనించేవే చాలా కాలం. మనం నిలదొక్కుకోవడానికి, స్వావలంబన వంటి విధానాలు తీసుకోవడానికి ఆలంబనగా నిలిచింది నాటి



సోవియట్ యూనియన్. ఆ వ్యవస్థ విచ్ఛిన్నమైనా ప్రస్తుత రష్యాతో కూడా సత్సంబంధాలు కొనసాగించడం మోడీ ప్రభుత్వానికి అనివార్యంగా మారింది. ఆంక్షలను ధిక్కరించి రష్యా నుంచి చమురు కోనుగోలు చేయడం నేటి ప్రపంచ రాజకీయంలో ఓ కీలకాంశంగా మారింది. ఇప్పటికి ఇజ్రాయిల్ ప్రేరిత గాజా ఫార్ములాను మోడీ అత్యుత్సాహంగా బలపర్చడం నిజమే గానీ రష్యా చైనాలతో కలవకపోతే మన స్థానం వుండబోదన్న స్పృహ మాత్రం పెరిగింది. మొన్న ఐరాస సమావేశంలో విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రసంగంలోనూ ఈ నూతన వాస్తవికత కొంత కనిపించిందని విదేశాంగ విధాన నిపుణులు వ్యాఖ్యానించారు. అదెలా వున్నా చెరగని గత కాలపు గురుతులుగా 62 ఏళ్లపాటు దేశ రక్షణకు పనిచేసిన నాటి సోవియట్ మిగ్-21 విమానం గత వారం వీడ్కోలు పలికింది. వైమానిక దళం సగౌరవంగా సాగనంపుతుంటే 'హిందీ రూసీ భాయ్ భాయ్' మాట వినిపించింది. తాజాగా రష్యా అధ్యక్షుడు పుతిన్ తమ దగ్గర చమురు కొన్న భారతదేశం నష్టపోకుండా మరో సుహృద్భావ సూచన చేశారు. మన దగ్గర వ్యవసాయ, వైద్య సంబంధమైన పరికరాలు కొనడం పెంచుతామని ప్రకటించారు. ఇక్కడ కలిసివచ్చేదేమంటే రష్యాకు మనం రూపాయల్లోనే చెల్లింపులు చేయడం. వారూ అవే తిరిగిస్తారు. మన మార్కెట్లలో సందడికి కూడా ఇది కొంత కారణమని ఆర్థిక నిపుణులు అంటున్నారు. అయినా అప్పుడూ ఇప్పుడూ రష్యా, చైనా అంటే కళ్లలో నిప్పులు పోసుకునేవారు మాత్రం కళ్లు తెరవగలరా మరి?

కవిత్వం

జాషువా! మొనగాడా!!



పల్లవి: బ్రతికినప్పుడు వేటాడిన
మతోన్మాదమీనాడు..
నిను స్మరించి.. నిను ధరించి
తరిస్తోంది చూడు!
జేజేలు సత్కవీ! జాషువా
మొనగాడా!
భజన ఏద్దైతేనేం? భళిరా!
విశ్వనరుడా!

చరణం: హరిశ్చంద్రుడికి
కాటిసీనులోన నీవే తోడైనావు..
తల ఎత్తుకు తిరుగుతోంది గబ్బిలాల జాతి
చీకట్లను చీల్చే.. మరో..
వెలుగు దీపమైనావు "జేజేలు"
భగవద్గీతల ముసుగులో
కుల, మతోన్మాదాలు
సనాతనం పేరుతో
పరి పరి పైత్యాలు!
పని గంటలు పెంచినోళ్ళు
మేడే పాటించినట్టు,
తెలియనిది ఎవరికి!?
మనువాదుల లోగుట్టు "జేజేలు"
హిందువా! క్రైస్తవా!?
యాదవా! మాదిగా!?
ఏదీ కాదని కవితతో
ఎరుక బరచినావు
ప్రజల నాల్కలయందు
జీవిస్తున్నావు
గర్వకారా! గగన తారా!
గమ్యం చూపించావు!

- నల్లి ధర్మారావు, సెల్ : 7660967313

(ఇటీవల బిజెపి వారు కూడా జాషువా సంస్మరణ కార్యక్రమాలు చేసినందుకు...)

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com



ఉగ్రవాదాన్ని అడ్డుకోకపోతే నామరూపాలుండవ్ !

- పాక్‌కు ఆర్మీ చీఫ్ తీవ్ర హెచ్చరిక

జైపూర్ : పాకిస్థాన్‌కు భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. తక్షణమే ప్రభుత్వ ప్రాయోజిత ఉగ్రవాదానికి తెర దించకపోతే ప్రపంచ పటంలో నామరూపాల్లేకుండా చేస్తామని ఆయన హెచ్చరించారు. రాజస్తాన్‌లోని శ్రీగంగానగర్ జిల్లాలో అనుప్‌గఢ్‌లో సైనికులను ఉద్దేశించి జనర్ ద్వివేది ప్రసంగించారు. సరిహద్దులో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఆపరేషన్ సిందూర్ 2.0కు సంసిద్ధంగా ఉండాలని సైనికులకు ఆయన పిలుపునిచ్చారు.

'ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్రవాద స్థావరాలను మాత్రమే గుర్తించాం. పాక్‌లోని సాధారణ పౌరులపై మాకు ఎలాంటి ఫిర్యాదుల్లేవ్. కానీ ఒక దేశంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే ప్రపంచపటంలో దాని నామరూపాల్లేకుండా చేస్తాం' అని ద్వివేది తెలిపారు. 1965, 1971 యుద్ధ సమయాల్లో సైనికులతో సాధారణ ప్రజలు కూడా చేయిచేయి కలిపి నిలిచారని, ఇందుకు చరిత్రే సాక్ష్యమని చెప్పారు. రాబోయే రోజుల్లో కూడా సాధారణ ప్రజలు సైన్యంతో చేరాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ప్రజల ఉత్సాహం సైనికుల మనోధైర్యాన్ని పెంచుతుందని అన్నారు.

బీహార్‌లో దారుణం

- 'వందేభారత్' రైలు ఢీకొని ముగ్గురు మృతి

పాట్నా : పట్టాలు దాటుతుండగా వందేభారత్ రైలు ఢీకొనడంతో ముగ్గురు యువకులు మృతి చెందిన ఘటన బీహార్‌లోని పూర్ణియా జిల్లాలో సంభవించింది. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. జిల్లాలో కస్బ పట్టణంలోని ఒక లెవెల్ క్రాసింగ్ వద్ద శుక్రవారం ఉదయం 5 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. బాధితులంతా 18 ఏళ్ల నుంచి 25 ఏళ్ల లోపు వయస్సు ఉన్నవారే. ఉదయం వేళ కావడంతో దృగ్గోచర కాంతి లేకపోవడం, మేఘావృతమైవుండటంతో పరిసరాలన్నీ మబ్బుగా ఉండటంతో రైలు వస్తున్న విషయాన్ని యువకులు గుర్తించలేకపోయారని, అందువల్ల ప్రమాదం చోటుచేసుకుందని పూర్ణియా జంక్షన్ స్టేషన్ మేనేజర్ మున్నా కుమార్ తెలిపారు. జోగ్బాని నుంచి పాటలీపుత్రకు వెళుతున్న వందేభారత్ వీరిని ఢీకొట్టిందని చెప్పారు. క్షతగాత్రులను చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించారు.

రైల్వే పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని, ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేస్తున్నారు. ఈ ప్రమాదం లెవల్ క్రాసింగ్ సిబ్బంది నిర్లక్ష్యం వలన జరిగిందా లేదా వేగంగా రైలు వస్తున్నప్పటికీ బాధితులు పట్టాలు దాటడానికి ప్రయత్నించడం వలన జరిగిందా అనేది ఇంకా అస్పష్టంగా ఉందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.

ముంబయి తీరంలో రూ.325 కోట్ల కుంభకోణం

ముంబయి : మహారాష్ట్రలోని తీర ప్రాంతంలో రూ.325 కోట్ల విలువైన కుంభకోణం వెలుగులోకి వచ్చింది. షిప్పింగ్, లాజిస్టిక్ షిప్పింగ్ వ్యవహారాల్లో కుంభకోణం చోటుచేసుకున్నట్లు ఫిర్యాదు అందడంతో ముంబయి పోలీసులు విచారణ ప్రారంభించారు. ఆల్‌రౌండ్ లాజిస్టిక్ లిమిటెడ్ అనుబంధ సంస్థ ఎఎల్ఎక్స్ షిప్పింగ్ ఏజెన్సీపై రుషభ్ సీలింగ్ అండ్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ విశాల్ మెహతా ఈ ఫిర్యాదు చేశారు. దుబాయ్‌కు చెందిన అల్లాదీన్ ఎక్స్‌ప్రెస్ డిఎంసిసి, ఒఇఎల్ ఎక్స్‌ప్రెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలపైనా ఆరోపణలు చేశారు. షిప్పింగ్ కార్యకలాపాల్లో భారీ లాభాలు గడించవచ్చనే మాటలతో ఈ రంగంలో కోట్లాది రూపాయలు పెట్టుబడి పెట్టాలా తనని ప్రేరేపించారని ఫిర్యాదులో విశాల్ మెహతా ఆరోపించారు.

బలూచిస్తాన్‌లో పాక్ సైనికచర్య

- ఏడుగురు తీవ్రవాదులు మృతి

ఇస్లామాబాద్ : పాకిస్తాన్‌లోని వాయవ్య బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో భద్రతా బలగాల ఆపరేషన్‌లో ఏడుగురు తీవ్రవాదులు మరణించారని పాకిస్థాన్ ఆర్మీ శుక్రవారం తెలిపింది. తీవ్రవాదులున్నారనే సమాచారం అందడంతో బలూచిస్తాన్ ప్రావిన్స్‌లోని షెరాని జిల్లాలో ఈ ఆపరేషన్‌ను నిర్వహించారని ఆర్మీ మీడియా విభాగం ఐఎస్‌పిఆర్ ఒక ప్రకటనలో తెలిపింది.

తీవ్రవాదులు ఎక్కడైతే వున్నారో అక్కడే వారిని మట్టుబెట్టిన భద్రతా బలగాలు వారి నుండి, వారి స్థావరాల నుండి పెద్ద మొత్తంలో ఆయుధాలను, మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. ఈ ప్రాంతంలోని పలు తీవ్రవాద కార్యకలాపాలతో ఈ తీవ్రవాదులకు సంబంధాలు వున్నాయని ఆ ప్రకటన పేర్కొంది.

తొక్కిసలాట బాధిత కుటుంబాలకు సిపిఎం అండ

- రెండేళ్ల చిన్నారి కుటుంబానికి ఓదార్పు
- తల్లిని కోల్పోయిన కుమారుడి చదువు కొనసాగింపునకు ఎంఎ బేబి హామీ

చెన్నయ్ : తమిళనాడులోని కరూరులో ఇటీవలి తొక్కిసలాట ఘటనలో ఆప్తులను కోల్పోయిన బాధిత కుటుంబాలను, నాటి ఘటనలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడిని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధానకార్యదర్శి ఎంఎ బేబీ శుక్రవారం నాడు పరామర్శించారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు యు వాసుకి, పార్లమెంటు సభ్యులు కె రాధాకృష్ణన్, డాక్టర్ వి శివదాసన్, నాయకులు ఆర్ సచ్చిదానందం, జ్యోతిబసు, ఎస్ బాలా తదితరులు ఆయనతో పాటు ఉన్నారు. ఈ పెను విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన రెండేళ్ల చిన్నారి ధ్రువ్ విష్ణు తల్లిదండ్రులను, అత్తమ్మను కూడా ఎంఎ బేబీ బృందం ఓదార్చింది. నాడు బిడ్డని ఎత్తుకొని ఆసుపత్రికి పరుగులు తీస్తున్న ధ్రువ్ విష్ణు తండ్రి విమల్ దృశ్యాలు.. చూసినవారందరినీ కంటతడి పెట్టించాయి. తొక్కిసలాట ప్రాంతానికి సమీపంలోని ఇందిరానగర్‌లో వీరి ఇల్లు ఉంది. నాడు ర్యాలీ చూడటానికి చిన్నారిని బయటకు తీసుకొచ్చారు. ఇంతలోనే తొక్కిసలాట.. హాహాకారాలు, ఉరుకులు..పరుగులు..ఏం జరిగిందో తెలుసుకునేలోపే ఘోరం జరిగిపోయింది. అప్పటి దాకా అత్తమ్మతో ఆడుకుంటూ ఉన్న చిన్నారి జీవచ్ఛవంలా కనిపించాడు. బిడ్డను ఎత్తుకొని విమల్ ఆసుపత్రి వైపు పరుగులు తీసినా లాభం లేకపోయింది. ఎంఎ బేబీ బృందానికి నాటి ఘటనను చెబుతూ చిన్నారి అత్తమ్మ గుండెలవిసేలా విలపించారు. 'అన్నా, వదినమ్మ అంతా కలిసి ర్యాలీని చూద్దామని బయటకు వచ్చాం. బిడ్డను నేనే ఎత్తుకున్నా.. ఇంతలోనే జనమంతా పరగులు తీస్తున్నారు. మేము ఇంట్లోకి పరుగులు తీశాం. ఇంతలో బిడ్డ జారిపోయాడు. చూసుకునేలోపే మాకు దక్కకుండాపోయాడు' అని ఆమె బోరున విలపించారు. సిపిఎం బృందం ఆమెను, చిన్నారి తల్లిదండ్రులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆ తర్వాత ఎమూర్ పుడూర్ వద్ద చంద్రమ్మ కుటుంబాన్ని పరామర్శించింది. ఆమె కుమారుడు శక్తికుమార్ రెండేళ్ల క్రితమే చదువు మానివేశారు. కుటుంబ సభ్యుల నుంచి ఈ విషయం తెలుసుకున్న సిపిఎం బృందం చలించిపోయింది. శక్తికుమార్ తిరిగి చదువు కొనసాగించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పార్టీ చూసుకుంటుందని హామీ ఇచ్చారు. అనంతరం కరూరు వైద్య కళాశాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడిని ఎంఎ బేబీ, వాసుకి తదితరులు పరామర్శించారు.



చిన్నారి ధ్రువ్ కుటుంబాన్ని ఓదారుస్తున్న ఎంఎ బేబీ, యు వాసుకి తదితరలు

ఈ సందర్భంగా ఎంఎ బేబీ మాట్లాడుతూ తొక్కిసలాట ఘటన అనేక మంది కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపిందన్నారు. ఆప్తులను కోల్పోయి బాధిత కుటుంబాలు గుండెలవిసేలా కన్నీటిపర్యంతమయ్యారని, మాటలకందనంత బాధ అనుభవిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కష్టసమయంలో వారికి అన్ని విధాలా తోడుగా ఉంటామని చెప్పారు. తొక్కిసలాట ఘటన తరువాత అత్యంత ప్రశంసనీయంగా రాష్ట్ర ప్రభుత్వం, వైద్యులు, ఇతర ప్రభుత్వ అధికారులు ప్రతిస్పందంచారని బేబీ అన్నారు. ప్రత్యేకించి పోస్టుమార్టం 8 గంటల్లోనే పూర్తి చేశారని, ఇది ఒకరకంగా రికార్డు అని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో ర్యాలీ నిర్వాహకులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినట్లు కనిపిస్తోందని బేబీ విమర్శించారు. జనసమూహాన్ని నియంత్రించడానికి ఎలాంంటి చర్యలు తీసుకులేదన్నారు. టివికె అధ్యక్షులు విజయ్ జనాలపైకి చిన్న నీటి బాటిళ్లను విసిరివేయడంతో వాటిని పట్టుకోవడానికి జనాల మధ్య పెనుగులాట జరిగినట్లు చెబుతున్నారని, ఇది చాలా బాధ్యాతారాహిత్యం అని ఆయన అన్నారు.

చట్టబద్ధమైనంత మాత్రానే ప్రతిదీ న్యాయబద్ధం కాదు

- సిజెఐ జస్టిస్ గవాయ్ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : కేవలం చట్టబద్ధం చేసినంత మాత్రానే ప్రతిదీ న్యాయబద్ధమైనది కాబోదని, ఇతరాత్ర విషయాలను కూడా క్షుణ్ణంగా పరిగణనలోకి తీసుకోవాల్సివుంటుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ శనివారం వ్యాఖ్యానించారు. స్వతంత్ర భారతంలో దేశద్రోహ చట్టాలు, అమెరికాలో బానిస చట్టం, వలస భారతంలో క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్‌ల మధ్య పోలికలను చెబుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశద్రోహం లాంటి చట్టాలను సాధారణంగా ప్రతిఘటనను అణిచేసేందుకు ప్రయోగిస్తుంటారని ఆయన విశ్లేషించారు. 'ఒకటి చట్టబద్ధం చేసినంత మాత్రాన అది న్యాయమైనదని అర్థం కాదు. దీన్ని గుర్తుంచుకోవడం చాలా ముఖ్యం. చేదైన ఈ వాస్తవం గురించి చరిత్ర మనకు అనేక ఉదాహరణలు ఇస్తుంది. ఉదాహరణకు బానిసత్వమనేది..ఒకప్పుడు అమెరికా సహా ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో చట్టబద్ధమైనది. అలాగే భారత్‌లో ఇలాంటి వలసకాలం నాటి చట్టాలు అనేకమున్నాయి. వాటిలో క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్, 1871 ఒకటి, దాని ప్రకారం పుట్టుకతోనే ఆ



తెగల్లో, కమ్యూనిటీల్లో పుట్టిన వారందరూ నేరస్తులేనని చట్టం ముద్ర వేస్తుంది. ఆదిమ వాసులను, సమాజంలో పక్కకు నెట్టబడిన కొన్ని కమ్యూనిటీల పట్ల వ్యవస్థాగతమైన అన్యాయాలను చూపిస్తూ శిక్షిస్తున్న చట్టాలు ప్రపంచవ్యాప్తంగా చాలా చోట్ల వున్నాయి. దేశ ద్రోహ చట్టాలను తరచుగా ప్రతిఘటనను అణచివేయడానికి ఉపయోగిస్తూ వుంటారు' అని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. సర్ మారిస్ రాల్ట్ స్మారకోపన్యాసంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో చట్టబద్ధ పాలన అనే అంశంపై ఆయన ప్రసంగించారు. కేవలం చట్టబద్ధమైనది ఏమిటి, న్యాయమైనది, నిష్పాక్షికమైనది ఏమిటి అనే రెండు అంశాల మధ్య తేడాను భారత రాజ్యాంగం చక్కగా నొక్కి చెప్పిందని ఆయన అన్నారు. ప్రాథమిక హక్కుల అమలు కోసం సుప్రీం కోర్టును ఆశ్రయించేందుకు భారత రాజ్యాంగంలోని 32వ అధికరణ హామీ కల్పిస్తోందని, ఇది రాజ్యాంగానికి గుండెకాయ వంటిదని ఆయన వ్యాఖ్యానించారు.

హమాస్‌కు ట్రంప్ డెడ్‌లైన్

వాషింగ్టన్ డీసీ: ఇజ్రాయిల్–హమాస్ యుద్ధానికి ముగింపు పలికే అంశంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హమాస్‌కు డెడ్‌లైన్ విధించారు. ఆదివారం సాయంత్రం 6 గంటల్లోగా (అమెరికా కాలమానం ప్రకారం) గాజా ప్రణాళికపై ఒప్పందం కుదుర్చుకోవాలన్నారు. లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. యుద్ధాన్ని ముగించాలన్న తన ప్రణాళికను అంగీకరిస్తూ సంతకం చేయకపోతే హమాస్ అంతుచూస్తానని సామాజిక మాధ్యమాల వేదికగా హెచ్చరికలు జారీ చేశారు.

ట్రంప్ ఇటీవల ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహుతో కలిసి 20 సూత్రాల ఫార్ములాను ప్రతిపాదించిన విషయం తెలిసిందే. దీని ప్రకారం ఒప్పందం కుదిరిన 72 గంటల్లో బందీలందరినీ హమాస్ విడుదల, ప్రతిగా 250 మంది ఖైదీలను ఇజ్రాయెల్ విడిచిపెట్టాలి తదితర నిబంధనలున్నాయి.

గాజా నువ్వు ఒంటరి కాదు !

- ప్రపంచవ్యాప్తంగా సంఘీభావ ప్రదర్శనలు
- ఇజ్రాయిల్ అమానవీయ దాడులపై ఆగ్రహం
- యూరప్‌లోనూ నిరసనల హోరు

రోమ్ : అమెరికా అండదండలతో యుద్ధోన్మాదంతో ఊగిపోతూ గాజాలో పాలస్తీనియన్లను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయిల్ సాగిస్తున్న దాష్టీకాలను ఖండిస్తూ ప్రపంచవ్యాప్తంగా నిరసనలు హోరెత్తుతున్నాయి. వైమానిక దాడులతో విరుచుకుపడుతూ భూతల దాడులతో గాజాను దురాక్రమిస్తూ ఇజ్రాయిల్ యుద్ధనేరాలకు పాల్పడుతోందంటూ నిరసనకారులు నినదించారు. ఒకవైపు శాంతి సూక్తులు చెబుతూ మరోవైపు గాజాకు చేరాల్సిన మానవతాసాయాన్ని సైతం అడ్డుకుంటూ అత్యంత దారుణాలకు ఇజ్రాయిల్ ఒడిగడుతోందని ఆగ్రహం వ్యక్తం చేవారు. గాజాకు మానవతా సాయాన్ని తీసుకెళుతున్న అంతర్జాతీయ నౌకలు, బోట్ల బృందాన్ని ఇజ్రాయిల్ అడ్డగించింది. గాజాకు సాయాన్ని తీసుకెళుతున్న గ్లోబల్ సముద్ ఫ్లోటిల్లా (జిఎస్ఎఫ్)ను పూర్తిగా తమ అధీనంలోకి తీసుకున్నట్లు ఇజ్రాయిల్ నావికా దళం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ జిఎస్ఎఫ్‌లో 50 వరకు బోట్లు, నౌకలు వున్నాయి. 40కి పైగా దేశాలకు చెందిన 500మందికి పైగా వలంటీర్లు వున్నారు. పాలస్తీనియన్లకు ఆహారం, వైద్య సాయం అందకుండా ఇజ్రాయిల్ నావికాదళం అమలు చేస్తున్న ఆంక్షలను సవాలు చేస్తూ జిఎస్ఎఫ్ బయలుదేరింది. తాజా పరిణామాలతో మధ్యధరా సముద్రంలో సహాయక బోట్లన్నీ నిలిచిపోయాయి. ఒకే ఒక్క నౌక ఇంకా గాజాకు చాలా దూరంలో వుందని పేర్కొంది. ఈ



గ్రీస్ రాజధాని ఏథెన్స్‌లో నిర్వహించిన సంఘీభావ ప్రదర్శనలో వేలాదిగా పాల్గొన్న ప్రజలు

నేపథ్యంలో ఇజ్రాయిల్ దాష్టీకాన్ని ఖండిస్తూ యూరప్ వ్యాప్తంగానూ తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ఇటలీ, జర్మనీ, ఫ్రాన్స్, నెదర్లాండ్స్, బ్రిటన్ తదితర దేశాల్లో వేలాదిమందితో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. గాజా వెళుతున్న ఆ నౌకల్లోని తమ పౌరుల భద్రతకు హామీ కల్పించాలంటూ పలు దేశాల ప్రభుత్వాలు ఇజ్రాయిల్‌ను డిమాండ్ చేశాయి. గ్రీక్ పార్లమెంట్ సభ్యులు గురువారం ఈ చర్యలను ఖండించారు. సిట్టింగ్ ఎంపితో సహా పలువురు గ్రీక్ పౌరులు ఆ నౌకల్లో వున్నారని, వారి భద్రతకు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ సహా పలు పార్టీల ప్రతినిధులు కూడా ఈ సంఘటనను విమర్శించారు. ఇజ్రాయిల్ తక్షణమే దీనిపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటలీ రక్షణ మంత్రి గెయిడో క్రాసెటో కూడా ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. ఫ్లోటిల్లాను ఇజ్రాయిల్ స్వాధీనం చేసుకున్న తర్వాత రోమ్, మిలన్, నాప్లెస్‌లతో సహా ఇటలీలో పలు చోట్ల పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. రైల్లే స్టేషన్లలో,యూనివర్శిటీల్లో నిరసనలు, ధర్నాలు జరిగాయి. సార్వత్రిక సమ్మెకు యూనియన్లు పిలుపిచ్చాయి. పౌరులు ప్రయాణిస్తున్న నౌకలపై దాడులు జరగడం అంటే మానవతా సంఘీభావంపైనే దాడి అని విమర్శించారు. అలాగే గ్రీస్ విదేశాంగ మంత్రి జార్జి గెరాపెట్రిటిస్ కూడా ఈ చర్యను నిరసించారు. ఇతర దేశాల సహకారంతో ఆ నౌకల్లోని వారి భద్రతకు చర్యలు తీసుకోవడానికి కృషి చేస్తామన్నారు. పోర్చుగీస్ అధ్యక్షుడు, అధికార యంత్రాంగం కూడా తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు.

మొరాకోలో నిరసనల హోరు..

- పోలీసు కాల్పుల్లో ఇద్దరు మృతి
- స్కూల్స్, హాస్పటల్స్ కోసం యువత అందోళనలు

రబాత్ : మొరాకోలో నిరసనలు హోరెత్తుతున్నాయి. బుదవారం పోలీసులు కాల్పుల్లో ఇద్దరు మృతి చెందారు. అనంతరం నిరసనలు దేశవ్యాప్తంగా విస్తరించాయి. ఆ దేశ యువత స్కూల్స్, హాస్పటల్స్ కోసం ఉద్యమిస్తుంది. గతవారం ప్రారంభమైన ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. యువత నడుపుతున్న జెన్‌జెడ్ 212 అనే గ్రూపు మెరుగైన విద్యా, ఆరోగ్య సదుపాయాలకోసం సెప్టెంబర్ 27వ తేదీన ఆందోళనలకు పిలుపునిచ్చింది. తక్కువ సంఖ్యలో ప్రారంభమైన ప్రదర్శనలు తరువాత పెద్ద సంఖ్యలో సాదారణ ప్రజలు కూడా పాల్గొన్నారు. ఇవి దేశంలోని ఇతర ప్రాంతాలకూ విస్తరించాయి. మొరాకో దేశ ప్రధాన మంత్రి అజిజ్ అఖనవుచ్ ఫుట్‌బాల్ స్టేడియాలకు అధిక మొత్తంలో నిధులు ఖర్చు చేస్తూ స్కూల్స్, హాస్పటల్స్‌ను గాలికి వదిలేసారని వారు విమర్శిస్తున్నారు. మాకు ఆరోగ్య సదుపాయాలు, చదుకుకోవడాని స్కూల్స్ కావాలి, స్టేడియాలు వద్దు అని వారు కోరుతున్నారు. ఇటీవల అగాదీర్ ప్రభుత్వ హాస్పటల్‌లో సరైన వైద్యం అందక 8 మంది మహిళలు మరణించారని, దీనికి భాద్యత వహిస్తూ ప్రధాని అజిజ్ రాజీనామా చేయాలని యువత డిమాండ్ చేస్తున్నారు. మొదట్లో ప్రభుత్వ అనుకూల మీడియా యువత ఆందోళనలను పట్టించుకోలేదు. అయితే సాదారణ ప్రజలు కూడా మద్దతు పలకటంతో ప్రభుత్వం కలవరపడింది. మరోవైపు యువతను రెచ్చగొట్టేవిదంగా విదేశ నటులు, మా యువత ఆందోళనలు పట్టించుకోము అంటూ ప్రకటనలు చేసింది. ఫుట్‌బాల్ వరల్డ్‌కప్ నిర్వహించాల్సిన తరుణంలో ప్రభుత్వం సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం అవుతాయని, 2026లో జరిగే ఎన్నికల్లో దీని ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు..

తొక్కిసలాట జరగ్గానే పారిపోతారా?

(మొదటిపేజి తరువాయి)

విచారణ సందర్భంగా ప్రభుత్వం తన వాదనలు వినిపిస్తూ పార్టీ స్వంత కార్యకర్తల వ్యవహార శైలి కారణంగానే ఈ తొక్కిసలాట జరిగిందని పేర్కొంది. నేతలు కూడా బాధ్యతారాహితంగా వ్యవహరించారని పేర్కొంది. 41మంది అమాయకుల ప్రాణాలు పోతే కోర్టు కళ్ళు మూసుకుని కూర్చోదని బెంచ్ వ్యాఖ్యానించింది. మౌన ప్రేక్షకురాలిగా, చేతులు ముడుచుకుని, తన బాధ్యతలు విడనాడదని పేర్కొంది. ఈ సంఘటన ఎలా జరిగింది, తదనంతర పర్యవసానాలు ఎలా వున్నాయనేది యావత్ ప్రపంచం చూసిందని బెంచ్ పేర్కొంది. ఒక వీడియో పుటేజీని ప్రస్తావిస్తూ బెంచ్, టివికె బస్సు కింద ద్విచక్ర వాహనాలు పడిపోయినా ఆ బస్సు డ్రైవర్ చూసినా బస్సును ఆపడం లేదు. ఇది వాహనాన్ని ఢీ కొట్టిన కేసుగా పరిగణించలేమా? అని ప్రశ్నించింది. ఎందుకు హిట్ అండ్ రన్ కేసును నమోదు చేయలేదని పోలీసులను కూడా బెంచ్ ప్రశ్నించింది. దాన్ని ఎందుకు పోలీసులు పరిగణనలోకి తీసుకోలేదని అడిగింది. పార్టీ నేత అదవ్ అర్జునా పెట్టిన వివాదాస్పద పోస్టును పరిగణనలోకి తీసుకున్న కోర్టు "ఈ అర్జున చట్టానికి అతీతుడా? కోర్టు ఆదేశిస్తేనే మీరు చర్యలు తీసుకుంటారా? అని పోలీసులను ప్రశ్నించింది. తక్షణమే అద్ అర్జునపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోర్టు ఆదేశించింది.

రోడ్ షోలకు సంబంధించి సమగ్ర మార్గదర్శకాలు జారీ చేసేంతవరకు వాటికి అనుమతి ఇవ్వవద్దని హోం కార్యదర్శిని, డిజిపిని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుంది. నిర్వాహకులకు తమ స్వంత కార్యకర్తలకు హాని కలిగించాలనే ఉద్దేశ్యం లేదని దీన్ని నేరపూరితమైన హత్యగా పరిగణించవద్దని బస్సీ ఆనంద్, నిర్మల్ కుమార్ తరపు న్యాయవాది రాఘవాచారి పేర్కొన్నారు.

సుప్రీంలో హెబియస్ కార్పస్ పిటిషన్ వేసిన వాంగ్‌చుక్ సతీమణి



న్యూఢిల్లీ : జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ), 1980 కింద తన భర్త, పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆయన సతీమణి డాక్టర్ గీతాంజలి అంగ్‌మో సుప్రీంకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. లేహ్‌లో గత నెల 24న హింసాత్మక ఆందోళనలు తలెత్తిన నేపథ్యంలో వాంగ్‌చుక్‌ను అదుపులోకి తీసుకున్నారు. వాంగ్‌చుక్ ఆచూకీ గురించి స్పష్టంగా వెల్లడించాల్సిందిగా అధికారులను ఆదేశించాలని ఆమె సుప్రీంకోర్టును కోరారు. అలాగే ఆయనను తక్షణమే నిర్బంధం నుండి విడుదల చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. రాజస్థాన్‌లోని జోథ్‌పూర్‌లో వాంగ్‌చుక్‌ను వుంచినట్లు తెలుస్తోంది. ఇప్పటికే వారం గడిచిపోయిందని ఆమె పేర్కొన్నారు. ఏ ప్రాతిపదికన ఆయనను నిర్బంధంలోకి తీసుకున్నారో ఎలాంటి సమాచారం లేదని, పైగా ఆయన ఆరోగ్యం గురించి కూడా తెలియరాలేదని అన్నారు. శాంతి భద్రతలకు, దేశ భద్రతకు ప్రమాదంగా భావించిన వ్యక్తులను ముందస్తు నిర్బంధం కింద అదుపులోకి తీసుకోవడానికి ఎన్ఎస్ఎలోని సెక్షన్ 3 వెసులుబాటు కల్పిస్తుంది. ఆ వ్యక్తి చర్యలు జాతీయ ప్రయోజనాలకు లేదా శాంతి భద్రతలకు భంగకరంగా వున్నాయని భావించి, అందుకు సంబంధించిన కీలక సమాచారాన్ని కనుగొన్న తర్వాత మాత్రమే సంబంధిత అధికారి ఉత్తర్వులను జారీ చేయాలని ఎన్ఎస్ఎ పేర్కొంటోంది. సుప్రీంకోర్టు కూడా ఇందుకు సంబంధించి వరుసగా కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. సెప్టెంబరు 24న లేహ్‌లో సంభవించిన పరిణామాల దృష్ట్యా వాంగ్‌చుక్‌ను లేహ్ జిల్లాలో వుంచరాదంటూ కేంద్ర పాలిత ప్రాంతమైన లడఖ్ పాలనా యంత్రాంగం ఒక ప్రకటన జారీ చేసింది.

కనీస మద్దతు ధరపై మళ్లీ వంచన

- రబీ పంటలకూ మద్దతు కరువు
- మోడీ సర్కార్ తీరుకు నిరసనగా ఆందోళనలు
- అఖిల భారత కిసాన్ సభ పిలుపు

న్యూఢిల్లీ : ఆరుగాలం కష్టించి, కుటుంబ సభ్యులంతా చెమటోడ్చి అన్నదాతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కల్పించడంలో కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వ బిజెపి ప్రభుత్వం మరోమారు వంచనకు పాల్పడిందని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటీవలి కేంద్ర మంత్రివర్గ సమావేశంలో రబీ పంటలకు ఆమోదించిన ఎంఎస్‌పి రేట్లు తీవ్ర నిరాశజనకంగా ఉన్నాయని పేర్కొంది. ఈ మేరకు ఎఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలె, విజూ కృష్ణన్ ఒక ప్రకటన విడుదల చేశారు. 2014 లోక్‌సభ ఎన్నికల సమయంలో బిజెపి తన ఎన్నికల ప్రణాళికలో 'సి2 ప్లస్ 50 శాతం' వుండేలా ఎంఎస్‌పి ప్రకటిస్తామని హామీ ఇచ్చిందని, కానీ ఇప్పుడు ఎ2 ప్లస్ ఎఫ్ఎల్ ఫార్ములాతోనే ఎంఎస్‌పిని ప్రకటించి మళ్లీ వంచిందని పేర్కొన్నారు. కుసుమ పువ్వు, కాయ ధాన్యాలకు అత్యధికంగా పెంచామని ప్రభుత్వం పదే పదే గొప్పలు చెప్పుకుందని, కానీ పెరిగిన ఉత్పత్తి వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోనపుడు ఈ అత్యధిక పెంపు కూడా డొల్లేనని విమర్శించారు. అన్ని పంటలకు కూడా, స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన సి2 ప్లస్ 50శాతం ఫార్ములా రేటు కన్నా తక్కువగానే ఎంఎస్‌పిని ప్రకటించారని పేర్కొంది.

పంట	ఎ2 ప్లస్ ఎఫ్‌ఎల్ రూ.	సి2	సి2 ప్లస్ 50 శాతం	రైతులకు నష్టం క్వింటాలుకు రూ.లలో
గోధుమ	2585	1804	2706	121
బార్లీ	2150	1862	2793	643
పప్పు	5875	5243	7864.5	1989.5
మసుర	7000	4875	7312.5	312.5
ఆవాలు	6200	4458	6687	487
కుసుమ	6540	5738	8607	2067

2014 నుండి 11ఏళ్ళుగా ప్రధాని మోడీ పదే పదే ఈ దేశ రైతాంగాన్ని మోసం చేస్తూనే వస్తున్నారని ఎఐకెఎస్ నేతలు విమర్శించారు. 2022 కల్లా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని 2016లో ప్రధాని మోడీ ప్రకటించారు. కానీ ఆ హామీని నిలబెట్టుకోవడంలో ఆయన ఘోరంగా విఫలమయ్యారు. కానీ ఉత్పత్తి వ్యయాన్ని రెట్టింపు చేయడంలో మాత్రం ఆయన విజయం సాధించారని వారు విమర్శించారు. దేశవ్యాప్తంగా పంటల సేకరణకు హామీ పూర్వకమైన ఎలాంటి నిర్దిష్ట వ్యవస్థ లేనందున, అలాగే ప్రకటించిన ఎంఎస్‌పి ప్రాతిపదికగా ఉత్పత్తిలో 15శాతం కంటే తక్కువే సేకరించినందున ఏ మాత్రమూ లాభదాయకం కాని ఈ కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) భారీ మెజారిటీ రైతులకు కేవలం లాంఛనప్రాయమే. ఈ కారణంగానే కచ్చితమైన సేకరణతో, చట్టబద్ధమైన ఎంఎస్‌పికి హామీ ఇవ్వాలని రైతు సంఘాలు గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి. మోడీ ప్రభుత్వ బూటకపు వైఖరిని తేటతెల్లం చేస్తూ దేశవ్యాప్తంగా గ్రామాల్లో ప్రచారాలు చేపట్టాలని, ప్రభుత్వం చేస్తున్న మోసానికి, ద్రోహానికి వ్యతిరేకంగా నిరసనలు తెలియచేయాలని ఎఐకెఎస్ తన శాఖలకు పిలుపునిచ్చింది.

అమరావతి కోసం భూసేకరణ

(మొదటిపేజి తరువాయి)

భద్రత పనుల కోసం రూ.449.92 లక్షల విలువైన వరద నష్ట మరమ్మతు పనులు చేసేందుకు పరిపాలనా పరమైన అనుమతినిచ్చేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. వైఎస్ఆర్ కడప జిల్లాలోని మైలవరం ఆనకట్టకు అవసరమైన ప్లేట్లు, యాంగిల్స్, హైటెన్షన్ బోల్టులు, రేడియల్ క్రస్ట్‌గేట్లను బలోపేతం చేసేందుకు రూ.3,19,48వేల అంచనా వ్యయంతో తయారుచేసిన ప్రతిపాదనలకు ఆమోదముద్ర పడింది. తిరుపతి జిల్లాలోని తిరుపతి, తిరుమలకు తాగునీరు అందించేందుకు కళ్యాణి డ్యామ్‌కు నీటి సరఫరా పనులకు రూ.126.06 కోట్లతో పరిపాలనా పరమైన అనుమతులు, అనంతపురం జిల్లా ఉరవకొండ, వజ్రకరూర్ మండలం విడపనకల్ మండలాల్లోని 10,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు కొట్టాలపల్లి లిఫ్ట్ పథకం నుంచి హెచ్ఎన్ఎస్ఎస్ ప్రధాన కాల్వ నుంచి 100 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసేందుకు రూ.55.60కోట్లకు పరిపాలనా పరమైన అనుమతులు ఇచ్చేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. అనంతపురం జిల్లా మిడ్ పెన్నార్ ప్రాజెక్టు మరమ్మతులు, ఆనకట్ట సుందరీకరణ పనులకు రూ.5.20కోట్లకు పాలనాపరమైన అనుమతులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

డి పట్టాల భూములు లీజు, కౌలుకు ఇచ్చేందుకు పచ్చజెండా :

ఎపి అసైన్డ్ ల్యాండ్స్ (నిషేధ బదిలీలు) బిల్లు -2025ను సవరించే ముసాయిదా బిల్లును రాష్ట్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. బిల్లు సవరణ ద్వారా డి పట్టాలు పొందిన భూ యజమానులు వారి భూములను వాణిజ్య అవసరాలకు కౌలు, లీజుకు ఇచ్చుకునే వెసులు బాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

మరికొన్ని నిర్ణయాలు

- ధాన్యం సేకరణ బకాయిలు క్లియర్ చేసేందుకు వీలుగా నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా రూ.వెయ్యికోట్లు అదనపు వర్కింగ్ క్యాపిటల్ రుణం పొందేందుకు అనుమతి. ఈ మొత్తాన్ని స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌కు ఇంటర్- కార్పొరేట్ రుణంగా బదిలీ చేస్తారు.
- డేటా బేస్ భూవివరాలు సేకరించేందుకు వీలుగా రిఫరెన్స్‌స్టేషన్ నెట్‌వర్క్‌ను నేషనల్ ఫ్లాట్ ఫామ్‌తో అనుసంధానించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, సర్వే ఆఫ్ ఇండియా, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ మధ్య అవగాహనకు అంగీకారం.
- నంద్యాల జిల్లా పాణ్యం మండలం పిన్నాపురంలోని 174.10 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎన్ఆర్ఇడిసిఎపికు బదిలీ చేసేందుకు ఎకరా మార్కెట్ విలువను రూ.6.25లక్షలుగా నిర్ణయిస్తూ మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది.

ప్రజాస్వామ్యం ఉంటేనే ప్రశ్నించగలం

(మొదటిపేజి తరువాయి)

దిగుమతులపై 40 శాతం పన్నులు విధిస్తుందని, పన్నులు ఎత్తేయాలని ట్రంప్ కోరుతున్నారని, అలాగనుక చేస్తే లక్షలాది మంది ఉత్పత్తిదారులు నష్టపోతారన్నారు. ముఖ్యంగా పాలు, సోయాబీన్, మొక్కజొన్న, మందులు తదితర రంగాల్లో విదేశీ దిగుమతులను అనుమతిస్తే రాష్ట్రంలో ఒక్క పాడి పరిశ్రమలోనే 50 లక్షల మంది పాడి రైతులు నష్టపోతారని తెలిపారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవాలన్నా, కార్మిక చట్టాలను కాపాడుకోవాలన్నా, రైతులకు గిట్టుబాటు ధర లభించాలన్నా, దళితుల భూములు కాపాడుకోవాలన్నా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ఈ సదస్సులో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, ఎ.పుల్లయ్య, టి.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి-నెల్లూరు



నెల్లూరు ఎసిఎస్ఆర్ ప్రభుత్వ వైద్యకళాశాల విద్యార్థి శుక్రవారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలం సంతజూటూరు గ్రామానికి చెందిన బి.గీతాంజలి (21) ఎసిఎస్ఆర్ మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నారు. కళాశాలకు అనుబంధంగా ఉన్న హాస్టల్‌లో ఉంటున్నారు. అనాటమి ప్రాక్టికల్ క్లాస్ ఉండడంతో దసరా సెలవులు ముగించుకుని గురువారం రాత్రి గీతాంజలి, ఆమె స్నేహితురాలు హిమనందిని హాస్టల్‌కు వచ్చారు. శుక్రవారం ఉదయం ప్రాక్టికల్స్‌కు హిమనందిని వెళ్లిన తర్వాత ఫ్యాన్‌కు ఉరేసుకుని గీతాంజలి ఆత్మహత్య చేసుకున్నారు. ప్రాక్టికల్ ప్రారంభమైన గీతాంజలి రాకపోవడంతో అనుమానం వచ్చిన ఉపాధ్యాయులు హాస్టల్‌కు వెళ్లారు. తన గది తలుపులు మూసి ఉండడంతో పగులగొట్టి చూడగా అప్పటికే ఫ్యాన్‌కు విగతజీవిలా గీతాంజలి వెలాడుతున్నారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. మృతురాలి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. విద్యార్థిని మృతిపై విచారణ చేపట్టి, అందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు సిఐ రోశయ్య తెలిపారు.

ఇ-క్రాప్ నమోదుకు గడువు పెంపు

- ఈ నెల 25 వరకూ అవకాశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పంటల వివరాలు నమోదు కార్యక్రమం 'ఇ - క్రాప్' గడువు ఈ నెల 25 వరకూ పొడిగించినట్లు వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. సామాజిక తనిఖీలు, సవరణకు తుది గడువు ఈ నెల 30వ తేదీ, తుది జాబితా ప్రకటన ఈ నెల 31వ తేదీన నిర్వహించనున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితుల కారణంగా నమోదులో పురోగతి సాధించలేకపోయినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2.90 కోట్ల ల్యాండ్ పార్శిల్‌కు 88 లక్షలు మాత్రమే నమోదు చేసినట్లు వెల్లడించారు. వ్యవసాయ, అనుబంధ శాఖలకు రైతుల వారీ పంట సాగు, భూ వివరాల నమోదు కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో రైతు సేవా కేంద్రంలో ఉంటే వ్యవసాయ సహాయకులు నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. పొడిగించిన గడువు ప్రకారం ఇ-క్రాప్ నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఇతర విధులు అప్పగించకుండా చూడాలని, విఆర్ఒలు సంయుక్త పర్యవేక్షణ ప్రక్రియలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని జిల్లాల కలెక్టర్లకు సూచించారు.

పుష్కరాలకు పోలవరం పూర్తి

- 2026 జనవరి కల్లా ఎడమకాలువ కూడా..
- నవంబరు నుంచే ప్రధాన డ్యామ్ పనులు
- పోలవరంపై సమీక్షలో సిఎం చంద్రబాబు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు పనులు నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు పనులపై శుక్రవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. డయాఫ్రం వాల్ మొత్తం 63,656 క్యూబిక్ మీటర్లకు 37,302 క్యూబిక్ మీటర్ల పనులు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. బట్రస్ డ్యామ్ పనులు వందశాతం పూర్తయ్యాయని తెలిపారు. వైబ్రో కాంప్రాక్షన్ పనులు కూడా 74 శాతం మేర పూర్తయ్యాయని ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన సిఎం.. కేంద్ర జల సంఘం, నిపుణుల కమిటీ నుంచి ఎప్పటికప్పుడు ప్రాజెక్టుల పనులపై అనుమతులు తీసుకుని పనులు పూర్తి చేయాలని తెలిపారు. నాణ్యత విషయంలో రాజీపడొద్దని అధికారులకు సూచించారు. నవంబరు నుంచి ఇసిఆర్ఎఫ్ డ్యామ్ పనులు ప్రారంభించాలని, 2027 డిసెంబరుకు పూర్తి చేయాలని తెలిపారు. పోలవరం కుడికాలువను అనుసంధానించే సొరంగాల నిర్మాణం, ఎడమ కాలువకు అనుసంధానం చేసేలా అప్రోచ్ ఛానల్ హెడ్ రెగ్యులేటర్ ఇరిగేషన్ టన్నెల్, కెఎల్‌బండ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రధాన ఎడమ కాలువ పనులు 2026 జనవరి నాటికల్లా అనకాపల్లి వరకూ పూర్తి చేయాలని తెలిపారు. ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణ, నిర్వాసితులకు పునరావాసం నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పోలవరం ప్రాజెక్టు పనులను ఎప్పటికప్పుడు తెలుసుకునేలా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. వచ్చే వర్షాకాలంలోగా వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలని ఆదేశించారు.

పోలవరం వద్ద పర్యాటక ఆకర్షణలు

పోలవరం వద్ద పర్యాటకులను ఆకర్షించేలా నిర్మాణాలుండాలని సిఎం సూచించారు. ప్రాజెక్టు నుంచి భద్రాచలం, పాపికొండలు, దిగువున ధవళేశ్వరం వరకూ వివిధ ప్రాంతాలను అద్భుతంగా తీర్చిదిద్దాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టు కనెక్టివిటీ కింద ఐకానిక్ రోడ్డు నిర్మించాలన్నారు. దీన్ని జాతీయ రహదారికి అనుసంధానం చేయాలని సూచించారు. రాజమహేంద్రవరం కేంద్రంగా పర్యాటకాన్ని అభివృద్ధి చేసేలా అఖండ గోదావరి ప్రాజెక్టు చేపట్టాలన్నారు. సమీక్షలో జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సిఎస్ విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

మా గ్రామాల్లో ఎటువంటి సభలూ నిర్వహించొద్దు

- మడకంవారిగూడెంలో రీసర్వే గ్రామసభను అడ్డుకున్న గిరిజనులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోకుండా తమ గ్రామంలో ఎటువంటి సర్వే, గ్రామ సభలు నిర్వహించొద్దని మడకంవారిగూడెం గిరిజనులు స్పష్టం చేశారు. గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రామసభను అక్కడి ప్రజలు అడ్డుకున్నారు. రీసర్వే పేరిట ఆయుధ డిపోకు భూములను సేకరించే కుట్ర జరుగుతోందని గిరిజనులు వాపోతున్నారు. ఎపి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తెల్లం దుర్గారావు మాట్లాడుతూ రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ పెద్దిరాజు ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ ఏర్పాటు చేశారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటును విరమించుకుంటున్నట్లు అధికారిక ప్రకటన చేసిన తరువాతే గ్రామసభగాని, సర్వేలుగాని చేపట్టాలని రెవెన్యూ సిబ్బందిని అడ్డుకున్నామన్నారు. ఈ నెల 5న పీసా గ్రామసభను నిర్వహించనున్నట్లు, గిరిజనులు పెద్దఎత్తున హాజరై నేవీ ఆయుధ డిపోకు వ్యతిరేకంగా భవిష్యత్ కార్యాచరణ రూపొందించాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘాల నేతలు మడకం వెంకటేశ్వరరావు, మడకం శేషగిరి, రాముడు, కారం నాగదుర్గ, పి వెంకటేశ్వరావు, శంకురుడు పాల్గొన్నారు.

రోడ్ల కోసం గిరిజనుల జలదీక్ష

ప్రజాశక్తి - వి.మాడుగుల (అనకాపల్లి జిల్లా)



తాడివలస గెడ్డలో జలదీక్ష చేస్తున్న గిరిజనులు

అనకాపల్లి జిల్లా వి.మాడుగుల మండలం శంకరం పంచాయతీ పరిధి గిరిజన గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని, గెడ్డలపై బ్రిడ్జిలు నిర్మించాలని కోరుతూ ఏడు గ్రామాలకు చెందిన గిరిజనులు శుక్రవారం తాడివలస గెడ్డలో జలదీక్ష చేపట్టారు. 'పవన్ కల్యాణ్ బాబూ మా గ్రామాలకు రోడ్ల సౌకర్యం కల్పించరూ.. ' అంటూ చేతులెత్తి దండం పెడుతూ నిరసన కొనసాగించారు. ఈ జల దీక్షకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి వెంకన్న, మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తి, జిల్లా కమిటీ సభ్యులు బిటి దొర, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె భవాని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.9.30 కోట్లతో తాడివలస, గొప్పూరు, రాయిపాలెం, రాజంపేట, వెలగలపాడు, కొత్తవలస, మామిడిపాలెం గ్రామాలకు రోడ్ల సౌకర్యం కల్పిస్తామని, కొత్తవలస, తాడివలస, మామిడిపాలెం గెడ్డలపై బ్రిడ్జిలు నిర్మిస్తామని చెప్పి, కొంత మేరకు రోడ్ల పనులు చేశారన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పాత పనులను రద్దు చేసిందన్నారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్, నాబార్డు నిధులతో కొత్తగా రూ.11 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్టు అధికారులు చెబుతున్నారన్నారు. ఎన్నో ఆశలు పెట్టుకుని గిరిజనులు ఓటువేస్తే నేడు చంద్రబాబు సర్కారు అస్సలు పట్టించుకోవడం లేదన్నారు. వర్షాకాలంలో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, డోలీ మోతలే దిక్కవుతున్నాయని తెలిపారు. రోడ్ల విషయంలో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మాట తప్పారన్నారు. కార్యక్రమంలో శంకరం సర్పంచ్ ఎస్ రమేష్, యడ్ల కొండలరావు, గోట్టురు అప్పారావు, సాగర ఈశ్వరరావు, సోలం చంద్ర, గిన్నెపల్లి సన్యాసమ్మ, సూమర్ల చంటి పాల్గొన్నారు.



రాజధాని అమరావతిలో పర్యటిస్తున్న మలేషియా బృందంతో పురపాలక శాఖ మంత్రి పి నారాయణ

అమరావతిలో పెట్టుబడులు

- మలేషియా కంపెనీల ఆసక్తి
- మంత్రి నారాయణతో చర్చలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో, తుళ్లూరు

రాబోయే ఐదేళ్లలో రూ.6 వేలకోట్ల నుంచి రూ.10 వేలకోట్ల వరకూ పెట్టుబడులు పెడతామని మలేషియాకు చెందిన పలు కంపెనీల ప్రతినిధులు.. పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణకు తెలిపారు. దీనికి సంబంధించిన పలు ప్రాజెక్టుల వివరాలనూ వివరించారు. మలేషియాకు చెందిన పలు కంపెనీల ప్రతినిధులు శుక్రవారం రాజధాని అమరావతి పరిధిలో పర్యటన అనంతరం వెలగపూడి సచివాలయంలో భేటీ అయ్యారు. సెలాంగార్ స్టేట్ ఎక్స్‌కో మంత్రి పప్పారాయుడు, క్లాంగ్ ఎంపి గనబతిరావ్, మలేసియా ఆంధ్రా బిజినెస్ ఛాంబర్, పలు ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. అమరావతిలో అభివృద్ధికి కలిసి పనిచేస్తామని పప్పారాయుడు తెలిపారు. మలేషియాలో తెలుగు మూలాలున్న పలు కంపెనీల ప్రతినిధులు వారి ప్రాజెక్టుల వివరాలనూ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. ఎడ్యుకేషన్, టూరిజం, హాస్పిటాలిటీ, అండ్ కామర్స్, రియల్ ఎస్టేట్ వంటి కీలక సెక్టార్లలో పెట్టుబడులు పెట్టేందుకు ఆయా సంస్థలు ముందుకొచ్చాయి.

మెడికల్ యూనివర్సిటీ ఏర్పాటుకు సైబర్‌జయ యూనివర్సిటీ ముందుకొచ్చింది. ఫైవ్‌స్టార్ హోటల్స్ ఏర్పాటుకు బెర్జయ ఆసక్తి తెలిపింది. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ప్రపంచంలో ఐదు రాజధానుల్లో అమరావతి ఒకటిగా ఉండాలని భావిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రణాళికాబద్ధంగా నిర్మిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే రూ.51 వేల కోట్ల విలువైన పనులకు టెండర్లు పూర్తయ్యాయని, 360 కిలోమీటర్ల మేర ట్రంకరోడ్లు, 1,500 కిలోమీటర్ల మేర లేఅవుట్ రోడ్లు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు కలిపి 4 వేల ఇళ్లు వచ్చే మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నామని చెప్పారు. రెండున్నరేళ్లలో అసెంబ్లీ, హైకోర్టు భవనాలు పూర్తి చేస్తామని చెప్పారు. గత మూడు నెలలుగా వర్షాల వల్ల పనులకు ఆటంకం కలిగిందని, రాబోయే రోజుల్లో వేగవంతం చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, సిఆర్‌డిఎ కమిషనర్ కన్నబాబు, అదనపు కమిషనర్ భార్గవతేజ పాల్గొన్నారు.

రాజధానిలో మలేషియా బృందం పర్యటన

రాజధాని అమరావతిలో శుక్రవారం మలేషియా బృందం పర్యటించింది. బృందంలో మలేషియాలోని సె లాంగార్ స్టేట్ ఎక్స్ కో మంత్రి పప్పారాయుడు, క్లాంగ్ ఎంపి గనబతిరావ్, మలేషియా - ఆంధ్రా బిజినెస్ ఛాంబర్ ప్రతినిధులు ఉన్నారు.

రాయపూడి వద్ద నిర్మాణం పూర్తి చేసుకున్న ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల క్వార్టర్స్, సెక్రటరీ, ప్రిన్సిపల్ సెక్రటరీల గృహ నిర్మాణాలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన సముదాయాలు తదితర నిర్మాణాలను బృందం పరిశీలించింది. రాజధాని నిర్మాణ పురోగతి, ఇతర అంశాలను మున్సిపల్ శాఖ మంత్రి పి నారాయణ, సిఆర్‌డిఎ కమిషనర్ కె కన్నబాబు వివరించారు. అనంతరం సచివాలయంలో మలేషియా బందంతో అధికారులు సమావేశమయ్యారు. రాజధాని నిర్మాణంతో పాటు పలు అంశాలపై చర్చించారు.

విద్యార్థినుల మరణాలపై సమగ్ర దర్యాప్తు

- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్
- పాఠశాల వద్ద తల్లిదండ్రులతో ఆందోళన



పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి - కురుపాం (పార్వతీపురం మన్యం జిల్లా)

ఎపి గురుకుల పాఠశాల గిరిజన విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ అశోక్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్యమందించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలోని గురుకుల పాఠశాల ఆవరణలో శుక్రవారం గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ మంత్రి సంధ్యారాణి సొంత జిల్లాలో విద్యార్థుల ప్రాణాలకు భరోసా లేకుండాపోయిందని, గిరిజన విద్యార్థులు మరణిస్తే పాఠశాల వద్దకు మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వచ్చే పరిస్థితి లేదని అన్నారు. గిరిజన విద్యార్థుల ప్రాణాలంటే అంత చులకనగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాలలో ఎఎన్ఎంలను నియమిస్తామని గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి పెట్టిన మొదటి సంతకం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ గురుకుల ఆశ్రమ పాఠశాలలన్నింటిలో మౌలిక వసతులు కల్పించి విద్యతో పాటు వారి ఆరోగ్యానికి కూడా రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని, మరణించిన విద్యార్థుల కుటుంబంలో ఒకరికి నాలుగో తరగతి ఉద్యోగ అవకాశం కల్పించాలని, నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.

జిల్లా వైద్యాధికారులను అడ్డుకున్న సంఘం నాయకులు

విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసేందుకు వస్తున్న జిల్లా వైద్య శాఖ అధికారి ఎస్ భాస్కరరావును ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కూరంగి సీతారాం, ఎం శ్రీనివాసరావు అడ్డుకుని నిలదీశారు. ఈ సందర్భంగా విద్యార్థులు రోగాల బారిన పడడానికి గల కారణాలు ముందు తల్లిదండ్రులకు తెలియజేసి లోపలికి వెళ్లాలని అడ్డుకున్నారు. తల్లిదండ్రులు ముందు విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, నమూనాలు తీసి పంపిస్తామని సమగ్ర సమాచారం రెండు రోజుల్లో తెలియజేస్తా మని హామీ ఇవ్వడంతో డిఎంహెచ్ఒను లోపలికి వెళ్లడానికి అనుమతించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గంగారావు, అనిల్, అఖిల్ విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భారత ఇంధన ఎగుమతులు పెరుగుదల

న్యూఢిల్లీ : రష్యా రిఫైనరీలపై దాడులు తీవ్రం కావడంతో ప్రపంచ ఇంధన మార్కెట్‌లో తీవ్ర ఇబ్బందులు మొదలయ్యాయి. దీంతో ఆ కొరతను భర్తీ చేయడానికి భారత్ తన ఇంధన ఉత్పత్తుల ఎగుమతులను వేగవంతం చేసింది. ప్రైవేటు రంగంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్, నయారా ఎనర్జీ సంస్థలు బ్రెజిల్, తుర్కియే, యుఎఇ, పలు ఆఫ్రికా దేశాలకు భారీగా ఎగుమతి చేస్తున్నాయి. ఇప్పటి వరకు ఆయా దేశాలు రష్యాలో శుద్ధి చేసిన ఇంధనంపై ఇన్నాళ్లు ఆధారపడ్డాయని ఎకనామిక్ టైమ్స్ కథనంలో పేర్కొంది.

చమురు శుద్ధి సామర్థ్యం దెబ్బతినడంతో రష్యా దేశీయ అవసరాలపైనే ఎక్కువ దృష్టి సారించింది. శీతాకాలం సమీపిస్తుండటంతో.. రష్యాలో చమురు అవసరాలు భారీగా పెరగనున్నాయి. దీంతో సెప్టెంబర్ నెలలో రోజుకు రెండు లక్షల బ్యారెళ్ల ఇంధన ఎగుమతులను తగ్గించిందని క్లెప్లర్ నివేదికలో వెల్లడించింది. రిఫైనరీలు దెబ్బతినడం, పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై నిషేధం వంటివి ప్రభావం చూపాయని ఆ సంస్థ నిపుణులు వెల్లడించారు.

భారత్ నుంచి బ్రెజిల్‌కు శుద్ధి చేసిన ఇంధన ఎగుమతులు పెరిగి రోజుకు 97 వేల బ్యారెళ్లకు చేరాయి. ఆగస్టులో ఇవి కేవలం 40 వేల బ్యారెళ్లు మాత్రమే ఉన్నాయి. ఇక మన దేశం నుంచి తుర్కియేకు కూడా ఎగుమతులు అంతకు ముందు నెలతో పోలిస్తే 20 వేల బ్యారెళ్ల నుంచి 56 వేల బ్యారెళ్లకు చేరాయి. గతేడాది అసలు మన దేశం నుంచి తుర్కియేకు చమురు ఎగుమతి చేయలేదు. పై రెండు దేశాలకు అధికంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి ఎగుమతులు అవుతున్నాయి.

కార్ల అమ్మకాలకు జిఎస్‌టి జోష్

ఇక యుఎఇకి భారత్ నుంచి శుద్ధి చేసిన ఇంధన ఎగుమతి పెరిగింది. ఆగస్టులో 1.4 లక్షల బ్యారెళ్లు కొనుగోలు చేయగా.. సెప్టెంబర్‌లో 2.01 లక్షల బ్యారెళ్లకు చేరడం గమనార్హం. మొత్తంగా భారత్ నుంచి శుద్ధి చేసిన ఇంధన ఎగుమతులు గత నెల ఏకంగా 14 శాతం పెరిగి రోజుకు 1.59 మిలియన్ పీపాలుగా నమోదయ్యాయి.

కంపెనీ అవసరాలు తీర్చలేని వారు ఇంటికే..

- చర్యలు ప్రారంభించిన టిసిఎస్

న్యూఢిల్లీ : ప్రఖ్యాత ఐటి సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) లేఆఫ్‌ల ప్రక్రియను ప్రారంభించింది. ప్రస్తుత ఆటోమేషన్ యుగంలో కంపెనీ అవసరాలను తీర్చలేని ఉద్యోగులను ఇంటికి పంపిస్తోంది. అయితే, దీర్ఘకాలం కంపెనీతో అనుబంధం కలిగిన ఉద్యోగులకు మాత్రం దాదాపు రెండేళ్ల వేతనం పరిహారంగా చెల్లించనుంది. ఈ ఏడాది జులైలో ప్రకటించిన 12 వేల మందికి లేఆఫ్‌ల ప్రకటనలో భాగంగా ఈ ప్రక్రియను చేపట్టింది. క్లయింట్ అవసరాలు తీర్చలేని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాలు లేని ఉద్యోగులను టిసిఎస్ తొలగిస్తోంది. ఇందులో భాగంగా మూడు నెలల నోటీసు పీరియడ్ ఇస్తోంది. అంటే ఆ మూడు నెలలకు కంపెనీ వేతనంగా చెల్లిస్తుంది. దీనికి అదనంగా ఆరు నెలల నుంచి 2 ఏళ్ల వరకు వేతనాన్ని పరిహార ప్యాకేజీ కింద చెల్లించనుంది. అయితే, ఎవరైతే 8 నెలలకు మించి బెంచ్‌పై ఉంటారో వారికి 'సింప్లర్ ప్యాకేజీ' మాత్రమే చెల్లిస్తారు. అంటే నోటీసు పీరియడ్ వేతనాన్ని మాత్రమే చెల్లిస్తారు.

గరిష్టంగా రెండేళ్లు

కంపెనీలో 10-15 ఏళ్లుగా ఉద్యోగం చేస్తూ తాజా లేఆఫ్‌లలో ఉద్యోగం కోల్పోయిన వారికి ఏడాదిన్నర వేతనాన్ని పరిహారంగా చెల్లిస్తారు. అదే 15 ఏళ్లు దాటిన వారికి గరిష్టంగా రెండేళ్ల వేతనంగా ఇస్తారు. దీంతోపాటు అదనంగా ఔట్‌ప్లేస్‌మెంట్ సేవలు లభిస్తాయి. అవసరమైన వారికి టిసిఎస్ కేర్స్ ప్రోగ్రామ్ కింద మానసిక ఆరోగ్యానికి సంబంధించిన చికిత్స లేదా థెరపీని అందిస్తారు. దీంతో పాటు రిటైర్మెంట్‌కు దగ్గరపడిన వారికి ముందస్తు ఉద్యోగ విరమణకు టిసిఎస్ అవకాశం కల్పిస్తోంది. వీరికి 6 నెలల నుంచి 2 ఏళ్ల వరకు వేతనాన్ని పరిహార ప్యాకేజీ చెల్లించడంతోపాటు బీమా ప్రయోజనాలను కల్పిస్తారు.

ఎఐకి వీడియోగేమ్‌లపై శిక్షణ

- ఉద్యోగుల నియామకానికి చర్యలు

న్యూఢిల్లీ : ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన కృత్రిమ మేధ అంకుర సంస్థ ఎక్స్ ఎఐ గ్రోక్ ఎఐ చాట్‌బాట్ సేవల్ని అందిస్తున్న సంగతి తెలిసిందే. గ్రోక్‌కు వీడియో గేమ్‌లపై శిక్షణనివ్వడానికి మస్క్ సంస్థ ఉద్యోగులను నియమించుకోవడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. వీడియో గేమ్‌ల కోసం నియమించుకొనే ట్యూటర్లు గ్రోక్‌కు గేమ్‌లు రూపొందించడం, కథలను డిజైన్ చేయడం, యూజర్ల ఆలోచనా వైఖరి.. అభిరుచులు వంటి విషయాలపై ఎక్స్‌ఎఐ గ్రోక్‌కు శిక్షణనివ్వనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

పంట నష్టాన్ని అంచనా వేయండి

- మంత్రి అచ్చెన్నాయుడు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉత్తరాంధ్రలో భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతినే అవకాశం అధికంగా ఉందని, వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులు తక్షణమే క్షేత్ర స్థాయిలో పంట నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేయాలని వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులతో శుక్రవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అవసరమైన పక్షంలో ఇతర జిల్లాల సిబ్బందిని కోస్తా జిల్లాలకు తరలించి దెబ్బతిన్న పంటలను అంచనా వేయడం, రైతులకు సూచనలు, సలహాలిచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వాయుగుండం ప్రభావం వల్ల పడిన వర్షాల కారణంగా వరదలు సంభవించే అవకాశం ఉందని, అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. దెబ్బతిన్న పంటలను కాపాడుకునే అంశంపై అధికారులు రైతులకు తగి సూచనలు ఇవ్వాలన్నారు. కాల్వలు, చెరువులకు గండ్లు పడకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలని జల వనరులశాఖ అధికారులను ఆదేశించారు. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు రెవెన్యూ, విద్యుత్, పోలీసు, జలవనరులశాఖ అధికారులు సమ న్వయంతో పనిచేయాలన్నారు. ఒడిశా, ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో పడుతున్న భారీ వర్షాలతో నాగావళి, వంశధార నదులు ఉప్పొంగుతున్న నేపథ్యంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు.

జిల్లాల్లో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, వరద సహాయక చర్యల్లో ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్, పోలీసు, అగ్నిమాపక సిబ్బంది సమర్థవంతంగా, వేగంగా స్పందించాలని మంత్రి సూచించారు.

విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించండి

- ముఖ్యమంత్రికి సిపిఐ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, సమ్మెను నివారించేందుకు తగు చర్యలు చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఎం చంద్రబాబుకు ఆయన శుక్రవారం లేఖ రాశారు. విద్యుత్ సంస్థల్లోని ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు గత కొంత కాలంగా సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు చేస్తున్నారని చెప్పారు.

రెగ్యులర్ ఉద్యోగుల ప్రధాన సమస్యలతోపాటు కాంట్రాక్టు కార్మికులను సంస్థలో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇతర పలు డిమాండ్లపై పలుమార్లు చర్చలు జరిగినప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. గత ఎన్నికల ముందు విద్యుత్ సంస్థల్లోని కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఈ నెల 15 నుంచి సమ్మెలోకి వెళ్లేందుకు యాజమాన్యానికి ఇప్పటికే నోటీసు సమర్పించిందని పేర్కొన్నారు. విద్యుత్ ఉద్యోగులు సమ్మెలోకి వెళితే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడే ప్రమాదం నెలకొందన్నారు. తాగు, సాగునీరు, పరిశ్రమలకు విద్యుత్ కీలకమైనందున సరఫరాలో సమస్యలు ఏర్పడితే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యుత్ జెఎసితో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

గంటల్లోనే చెక్కు క్లియరెన్స్

- నేటి నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ : ఏదైనా చెక్కు క్లియర్ అవ్వాలంటే ప్రస్తుతం రెండ్రోజుల సమయం పడుతోంది. ఇకపై ఈ సమయం గణనీయంగా తగ్గనుంది. శనివారం నుంచి కొన్ని గంటల్లోనే చెక్కు క్లియర్ కానుంది. ఆర్‌బిఐ ఆదేశాల మేరకు బ్యాంకులు దీన్ని అమలు చేయనున్నాయి.


చెక్కులు క్లియర్ చేయడానికి అయ్యే సమయాన్ని గంటల వ్యవధిలోకి తగ్గించేందుకు ఆర్‌బిఐ కంటిన్యూస్ క్లియరింగ్ వ్యవస్థను తీసుకొచ్చింది. దీంతో చెక్కు సమర్పించిన గంటల వ్యవధిలోనే క్లియర్ అవుతుంది. ఈ విధానంలో వ్యాపార వేళల్లో చెక్కుల స్కానింగ్, సమర్పణ, క్లియరింగ్ అనేవి నిరంతరాయంగా సాగుతాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు చెక్కులు సమర్పించవచ్చు. సాయంత్రం 7 గంటల్లోపు క్లియర్ అవుతాయి. అంటే చెక్కు ఉదయం డిపాజిట్ చేస్తే అదే రోజు సాయంత్రానికల్లా నగదు మీ బ్యాంకు ఖాతాలో జమవుతుంది. సంబంధిత చెక్కును ఆమోదించడమో, తిరస్కరించడమో ఏదైనా సరే సాయంత్రం 7 కల్లా జరిగిపోవాలని బ్యాంకులను ఆర్‌బిఐ ఆదేశించింది. మొత్తం రెండు దశల్లో ఈ వ్యవస్థ అందుబాటులోకి రానుంది. ఫేజ్-1లో భాగంగా సాయంత్రం 7 గంటల్లోపు గడువు నిర్దేశించగా.. ఫేజ్-2లో కేవలం మూడు గంటల్లోనే చెక్కు క్లియర్ చేయాల్సి ఉంటుంది. 2026 జనవరి 3 నుంచి రెండో దశ ప్రారంభమవుతుంది. అంటే బ్యాంకు పనివేళల్లో ఎప్పుడు చెక్కు సమర్పించినా మూడు గంటల వ్యవధిలోనే బ్యాంకు ఖాతాలో నగదు జమవుతుంది.

ఒడిదుడుకుల్లో సూచీలు

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రోజంతా ఒడిదుడుకులు ఎదుర్కొని, ఆఖరి గంటలో కొనుగోళ్ల మద్దతుతో వరుసగా రెండో ట్రేడింగ్ సెషన్‌లోనూ రాణించాయి. నిఫ్టీ మరోసారి 24,900 స్థాయికి చేరువైంది. సెన్సెక్స్ ఉదయం 80,684.14 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,983.31) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 80,649.57- 81,251.99 మధ్య కదలాడిన సూచీ.. చివరికి 223.86 పాయింట్ల లాభంతో 81,207.17 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 57.95 పాయింట్ల లాభంతో 24,894.25 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.79గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, యాక్సిస్ బ్యాంక్, కొటక్ మహీంద్ర బ్యాంక్, ఎల్‌అండ్‌టి షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టెక్ మహీంద్రా, మారుతీ సుజుకీ, అల్ట్రాటెక్ సిమెంట్, సన్‌ఫార్మా, ఐసిఐసిఐ బ్యాంక్ షేర్లు నష్టాలు చవిచూశాయి.

ఒంటరి ఏనుగు హల్‌చల్

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): పలమనేరు రూరల్ మండలం ముసలిముడువద్ద శుక్రవారం ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. ఇక్కడే కుంకి ఏనుగులు ఉండటంతో వాటిని గమనించిన ఒంటరి ఏనుగు ప్రహరీ గోడను బద్దలు కొట్టి చేసి హల్‌చల్ చేసింది. ఇది గమనించిన అటవీ అధికారులు దూరంగా తరిమివేశారు. అయితే చుట్టుపక్కల పంట పొలాలను ధ్వంసం చేశాయని రైతులు విచారం వ్యక్తం చేశారు.



పసివాళ్లకు యుద్ధ గండం

ఇజ్రాయిల్ దమనకాండలో హరిస్తున్న ప్రాణాలు

- వైద్యసేవలు అందక మృత్యువుడిలోకి
- జాతివిధ్వంస విధానాల నుంచి కాపాడండి..అంతర్జాతీయ సమాజం డిమాండ్

గాజా : "గత 24 నెలలుగా ఇజ్రాయిల్ దమనకాండలో చిక్కుకున్న 2.2 మిలియన్లకు పైగా పాలస్తీనియన్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏ పాపం చేయని పసివాళ్ల ప్రాణాలకు యుద్ధ గండం పొంచివుంది. ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమంలో చిన్నారుల బతుకులకే కాదు. భావితరాలకు ముప్పుగా మారింది'' అని సెంట్రల్ గాజాలోని నుసెయిరాత్‌లోని డాక్టర్ ఖామిస్ ఎలెస్సీ పేర్కొన్నారు. వారిని ప్రాణాలను కాపాడటానికి సత్వరమే చర్యలు తీసుకోవటానికి ప్రపంచ నాయకులంతా ముందుకు రావాల్సిన అవసరమున్నదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. "వారు పాలస్తీనియన్లు తప్ప ఈ యుద్ధంతో వారికి సంబంధం లేదు. వారు ఆకలితో చనిపోతున్నారు. ఇప్పుడు వారికి వైద్యం , గౌరవప్రదమైన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ నిరాకరించబడుతోంది.'' అని ఆవేదన వ్యక్తం చేశారు. అక్టోబర్ 2023 నుంచి ఇజ్రాయిల్ దాడుల్లో గాయపడిన 170,000 మంది కాకుండా, 350,000 మంది దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నారు. ఇజ్రాయిల్ దిగ్బంధం, నిరంతర బాంబు దాడుల కారణంగా సరైన చికిత్స పొందలేక పోతున్నారని పేర్కొన్నారు. కాలిన గాయాల బాధితులకు "పరిశుభ్రత లేకపోవడం, పరిశుభ్రమైన నీరు అందలేదు. యాంటీబయాటిక్స్ లేవు. పోషకాహారం లేకపోవడం వల్ల బ్యాక్టీరియా ప్రబలుతోంది'' అని ఎలెస్సీ అన్నారు.ఇలాంటి పరిస్థితుల్లో రోగులు వ్యాధులతో పోరాటలేరు.

ఆసుపత్రులు కూడా పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందించలేకపోతున్నాయి. ఉన్న కొద్దిపాటి ఆస్పత్రుల్లోనూ ఆకలిచిన మేర వైద్యాన్ని అందించలేకపోతున్నామని వైద్యులు పేర్కొంటున్నారు.

శాంతించిన గోదావరి

- కాటన్ బ్యారేజీ వద్ద సాధారణ స్థితికి ప్రవాహం

ప్రజాశక్తి - యంత్రాంగం

రెండోజులుగా ఉగ్రరూపం దాల్చిన గోదావరి శుక్రవారం సాయంత్రానికి శాంతించింది. భద్రాచలం వద్ద కూడా గోదావరి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం అక్కడ 40 అడుగుల నీటి మట్టం నమోదైంది. ఇక్కడ కూడా మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద ప్రవాహం సాధారణ స్థితికి చేరుకుంది. గురువారం ఉధృతంగా ఉన్న ప్రవాహం రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరింది. తరువాత నుంచి క్రమంగా తగ్గుముఖం పట్టింది. శుక్రవారం తెల్లవారు జామున రెండు గంటలకు 11.70 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. శుక్రవారం రాత్రికి మరింత తగ్గి 10.30 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం బ్యారేజీ నుంచి 7.86 లక్షల క్యూసెక్కులను సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. గోదావరి తగ్గుముఖం పట్టినా కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు కాజ్‌వే ఇంకా ముంపులోనే ఉంది. దీంతో వాగు అవతల గల 12 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచే ఉన్నాయి. మరో రెండు రోజుల్లో ఆయా గ్రామాలకు రాకపోకలు కొనసాగే అవకాశం ఉంది.

పోలవరం నుండి 8,00,702 క్యూసెక్కులు విడుదల

పోలవరంలో గోదావరి వరద స్వల్పంగా తగ్గింది. పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న 8,00,702 క్యూసెక్కుల అదనపు జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 31.720 మీటర్లు, దిగువన 23 మీటర్ల నీటిమట్టం నమోదైంది. ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం 11.24 మీటర్లు నమోదైనట్లు సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు.

చిన్న కుళ్లాయప్ప క్యారికేచర్‌కు అంతర్జాతీయ బహుమతి

ప్రజాశక్తి-నార్పల

అబ్లా ఆర్ట్ ఫౌండేషన్ ఈజిప్ట్ కార్టూన్ ఫ్లాట్ ఫాం కార్టూన్, ఎల్‌నాస్‌ఎల్‌హెల్వా-2025 అంతర్జాతీయ విజేతలను ఇటీవల ప్రకటించింది. ఇందులో క్యారికేచర్ విభాగంలో వివిధ దేశాల నుంచి పలువురు కార్టునిస్ట్‌లు.. పోటీ పడ్డారు. ఇందులో భారతదేశం నుంచి అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రానికి చెందిన చిన్న కుళ్లాయప్ప (చిన్ని ఆర్ట్స్) సత్తా చాటారు. ఈయన క్యారికేచర్‌కు ద్వితీయ స్థాయి అంతర్జాతీయ అవార్డు లభించింది. చిన్న కుళ్లాయప్ప కేశేపల్లి "హైస్కూల్‌లో ఆర్ట్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన క్యారికేచర్‌కు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

బాణసంచా తయారీ స్థావరంపై దాడి

- రూ.5 లక్షల విలువైన ముడిసరుకు స్వాధీనం

ప్రజాశక్తి - మండపేట

కోనసీమ జిల్లా మండపేట టౌన్ పరిధిలో రావులపేట పెంకిటింటిలో ఎటువంటి లైసెన్సు అనుమతి లేకుండా దీపావళి బాణసంచా తయారు చేస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు మండపేట టౌన్ పోలీస్ లు గురువారం దాడులు చేశారు. సుమారు రూ .ఐదు లక్షల విలువ గంధకం, అల్యూమినియం డస్ట్, బొగ్గు పొడి, ఆయిల్, ఇసుక ఇతర ముడి సామాన్లతో పాటు సుమారు 2,500 కేజీలు మతాబులు, చిచ్చుబుడ్లు తయారీకి ఉపయోగించే రసాయన మిశ్ర మాన్ని సీజ్ చేశారు. దీనిపై మండపేట టౌన్ సురేష్ కేసు నమోదు చేసి తయారీ దారుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ సురేష్ మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా లైసెన్సు లేకుండా ఎటువంటి మందుగుండు సామగ్రిని కలిగి ఉండటం, తయారు చేయటం, చట్టరీత్యా నేరమన్నారు. లైసెన్సు కలిగి ఉన్నవారు సంబంధిత నిబంధనలు పాటిస్తూ ఎటు వంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా బాణసంచా సామగ్రి కలిగి ఉన్న, తయారు చేసిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జీవన సౌరభం

విజ్ఞానం ఉన్నదని గర్వించడమంత అజ్ఞానం మరొకటి లేదు.

మీ కోసం

రెండు లేదా మూడు వెల్లుల్లి రెబ్బలను పేస్టులా చేసి, స్పూన్ తేనెతో కలిపి రోజూ మూడుసార్లు పిల్లలకు తినిపిస్తే దగ్గు, జలుబు నుంచి త్వరగా కోలుకుంటారు.



పాఠశాల జీవితం



బెల్ మోగగానే క్లాస్‌లోకి పరుగులు
చాక్ దూళితో గురువు గారి ముచ్చట్లు
మిత్రుల నవ్వుల్లో ఆటల తియ్యదనం
స్కూల్ జీవితం పండుగే పండుగ!

పుస్తకం తెరిస్తే అక్షరాలు నాట్యం
కథల్లో దాగిన కలల సవ్వడి
అక్షరమే మనకో మిత్రుడవుతాడు
జ్ఞానం కాంతితో మార్గం చూపుతాడు!

తనకో బంతి, నాకో బంతి
మైదానంలో ఎగిరే నవ్వుల గాలి
పరుగులు పెడితే దుమ్మే పూలమాల
ఆటలలోనే దొరుకుతాయి స్నేహ బంధాలు!

గురువు మాటలో వెలుగే గమ్యం
కలల తరగతి మాయమంతా
ప్రతి రోజు ఒక కొత్త అక్షరం
మన భవిష్యత్తు సింహాసనం అవుతుంది!


బెంచి పంచుకోవడం స్నేహం మొదలు
లంచ్‌బాక్స్ రుచిలో మమత పరిమళం
స్నేహమే స్కూల్‌కి శోభ తెస్తుంది
హృదయంలో ఎప్పటికీ నిలిచిపోతుంది!

- ఆరాల నిహాల్ యాదవ్,
5వ తరగతి,
ఎస్ఆర్ఎం స్కూలు, కోదాడ,
సూర్యాపేట జిల్లా.

లెక్క చేయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని పండ్లను అంకెలుగా గణించి లెక్క చేశాం. చివరి వరుస సమాధానం మీరు రాబట్టండి.





నేను గీసిన బొమ్మ



దలాయి వర్షిత్
7వ తరగతి,
ఇన్ఫెంట్ జీసస్ స్కూలు (టెక్కలి),
పెద్ద కేశినాయుడు పేట



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వెనుకబడ్డ విద్యార్థులకు వెన్నుదన్నుగా...

చదువు మధ్యలో ఆపేసిన పిల్లలను అక్కున చేర్చుకుని వారు చదువులో ముందుకు వెళ్లటానికి చేయూత నందిస్తున్నారు ఈ ఆర్టీసీ కండక్టర్. పేద దళిత కుటుంబం నుంచి కష్టనష్టాలను ఎదుర్కొన్న ఆమె... ఇప్పుడు తన లాంటి పిల్లలు ఆపదలో ఉన్నారని తెలిస్తే వెంటనే స్పందిస్తారు. చదువు మధ్యలో ఆపేయటం మంచిది కాదనీ, కొనసాగించటం ద్వారానే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తామని నచ్చజెప్పి, నడిపిస్తున్నారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తారు. ఆత్మన్యూనతా భావాన్ని పోగొట్టడానికి ప్రయత్నిస్తారు. ఆమే మేడికొండ చంటి.

కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలం సీతాయలంక గ్రామానికి చెందిన మేడికొండ సత్యం, నాంచారమ్మ దంపతుల కుమార్తె మేడికొండ చంటి. ప్రస్తుతం ఆర్టీసీ అవనిగడ్డ డిపో పరిధిలో అవనిగడ్డ- మచిలీపట్నం రూట్‌లో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఎంకాం వరకూ చదివారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే- పేద పిల్లలకు ఉచితంగా విద్యాబోధన చేస్తున్నారు. చదువు మధ్యలో ఆపేసిన పిల్లల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి చదువుకునేలా ఒప్పిస్తారు. తాను విధుల్లో ఉన్న బస్సులో పిల్లల నుంచి పెద్దల వరకూ అందరూ ఒక క్రమపద్ధతిలో ఉండేలా చూసుకుంటారు. పిల్లలతో చదువుకు సంబంధించిన విషయాలు మాట్లాడి, వారిని ప్రోత్సహిస్తారు. అవసరమైన వారికి దన్నుగా నిలిచి, దారి చూపిస్తారు. చాలా సున్నితంగా జీవన, సబ్జెక్ట నైపుణ్యాలు బోధిస్తుంటారు. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలు చదువుకునోచుకోక పడుతున్న ఇబ్బందులు చెప్పినప్పుడు ఆమె .. పరీక్షల్లో ఆ పిల్లల ఉత్తీర్ణత బాధ్యతను సైతం తీసుకుంటారు. సెలవు రోజుల్లో, తీరిక సమయాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

చదువు మధ్యలో ఆగిపోకుండా ...

పేదరికం కారణంగా చదువుకు ఎవ్వరూ దూరం కాకూడదని చంటి భావన. గత 19 సంవత్సరాలుగా ఇదే విషయమై కృషిని చేస్తున్నారు. ఆమె వద్ద శిక్షణ పొందిన పిల్లలు నేడు ఇంటర్, డిగ్రీ, పిజిలను పూర్తిచేసిన వారూ ఉన్నారు. మరికొందరు వృత్తి, ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. జువ్వలపాలేనికి చెందిన బి.నరేష్ 8వ తరగతిలో డ్రాపౌట్. ఆమె ఇచ్చిన తర్ఫీదుతో పదో తరగతి, ఆతర్వాత డిప్లమో పూర్తిచేసి ప్రస్తుతం సివిల్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. బి.హిమబిందు టెన్త్ మేథ్స్‌లో ఫెయిల్. చంటి మార్గదర్శనంలో ఇప్పుడు ఎం.ఫార్మశీ పూర్తిచేశారు. జువ్వలపాలెంలోని ఎలిమెంటరీ స్కూలులో ఇంగ్లీషు సబ్జెక్టులో పిల్లలు బాగా వెనుకబడి ఉన్నారని గమనించి 15 రోజులపాటు చంటి ఇచ్చిన శిక్షణతో వారి నిపుణత పెరిగింది. రోజారాణి, తిరుపతమ్మ అనే విద్యార్థులు మంచి మార్కులు సాధించారు. భట్టిప్రోలు సమీపంలోని కోళ్లపాలేనికి చెందిన ఎ.సాయి టెన్త్ ఫెయిలై అవనిగడ్డలో మేనమామ ఇంట్లో ఉంటూ పొలం పనులకు వెళ్తున్నాడు. అతడితో మాట్లాడి పరీక్షలు రాయించగా టెన్త్, ఐటిఐ పూర్తిచేసి ప్రస్తుతం డిఆర్‌డిఒలో పనిచేస్తున్నాడు. మాధురి, మహిమ కూడా టెన్త్ పాసయ్యేందుకు దోహదపడ్డారు. ప్రశాంత్ టెన్త్ సోషల్ ఫెయిల్ నుంచి ఉత్తీర్ణత సాధించి మొవ్వ ఒకేషనల్ కాలేజీలో ఇంటర్‌లో 800కుపైగా మార్కులు సాధించి కళాశాలలో ద్వితీయస్థానం పొందారు. స్పందన మేథ్స్‌లో 14 మార్కులతో ఫెయిలవ్వగా, చంటి వద్ద శిక్షణ పొందిన తర్వాత 67 మార్కులు వచ్చాయి. ప్రియచందన, సౌమ్య కూడా మంచిగా రాణిస్తున్నారు. స్ఫూర్తి, డేవిడ్ మేథ్స్‌లో తిరిగి పాసయ్యారు. కార్తీక్, ప్రణీత్ నాలుగు సబ్జెక్టుల వెనుకబాటుతో ఉన్నవారు పాసయ్యారు. ఇంటర్ ఫెయిలైన జి.నాగచైతన్యకు 67 మార్కులు వచ్చాయి. ప్రస్తుతం డిగ్రీ చదువుతున్నాడు. తన గ్రామంలోని బిసి బాలుర వసతిగృహంలోనూ చంటి మేథ్స్, సోషల్ చెప్పారు.

సామాజిక సేవల్లోనూ...

దేశ నాయకుల వర్ధంతులు, జయంతులు, స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డే సందర్భాల్లో ఆమె 1 నుంచి పదో తరగతి విద్యార్థినీ విద్యార్థులకు ఏటేటా పుస్తకాలు, ప్యాడ్లు అందజేస్తుంటారు. అవనిగడ్డ-మచిలీపట్నంలో లక్ష్మీపురం వద్ద బస్సు ఎక్కి మోపిదేవి గుడి వద్దకు బిక్షాటన చేయటానికి 14 ఏళ్లలోపు పిల్లలు ఆది, సోమవారాల్లో ఎక్కువగా బస్సు ఎక్కుతుంటారు. వారితో మాట్లాడి మార్పు కోసం ప్రయత్నిస్తూనే ఉంటారు. చల్లపల్లి, విజయవాడ, మొవ్వలోని అనాథ, వికలాంగ, మానసిక వికలాంగుల కేంద్రాలను ఆమె తన కుమారుడు, తన పుట్టినరోజులతోపాటుగా ఇతర పండుగలు, ప్రత్యేక రోజుల్లో వెళ్తారు. అక్కడి పిల్లలకు నెలకు సరిగా వివిధ రకాల సరుకులు, అల్పాహారం వంటివి అందజేస్తుంటారు.



ఆమె జీవితం కన్నీటి కడగండ్లే...

చంటికి ఇంత తపన ఎందుకంటే- ఆమె కూడా అలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నారు. కుటుంబంలో ముగ్గురూ ఆడపిల్లలే. చంటి ఆఖరి అమ్మాయి. కుటుంబ సభ్యులంతా వ్యవసాయ పనులకు వెళ్లే వారు. వచ్చిన డబ్బులతో కుటుంబ పోషణ జరిగేది. చంటి కూడా ఓ వైపు చదువుకుంటూనే సెలవు రోజుల్లో కూలి పనులకు వెళ్లేది. తాను ఎనిమిదో తరగతిలో ఉన్నప్పుడు తల్లిదండ్రులు చనిపోవటంతో అక్కలు, మేనమామ వివాహం చేశారు. మూడేళ్ల గడిచాక 2003-04లో పదో తరగతి పరీక్షలు నేరుగా రాసి, 421 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. 2006 నుంచి తీరిక వేళల్లో గ్రామంలోని పేద పిల్లలు, డ్రాపౌట్ పిల్లలను గుర్తించి వారికి ఉచితంగా చదువు చెప్పటం ప్రారంభించారు. తర్వాత ఓ ప్రయివేటు కళాశాలలో క్లర్క్‌గా పనిచేశారు. లెక్కలు, సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులపై ఉన్న ఇష్టంతో వాటిని సాధన చేస్తూ, ప్రావీణ్యం పెంచుకున్నారు. ఆర్టీసీ కండక్టర్ పోస్టులకు నోటిఫికేషన్ రాగా, ఎంపికై 2008లో ఉద్యోగ బాధ్యతల్లోకి వచ్చారు. 2012లో పోస్టల్ విభాగంలో ఉద్యోగానికి ఇంటర్వ్యూలు వచ్చాయి. ఆ ముందురోజే తన అత్త గారు చనిపోవటంతో వాటికి వెళ్లలేకపోయారు. కానీ, తన చదువును ఆ తరువాత కూడా కొనసాగించి పోస్టు గ్రాడ్యుయేషన్ చేశారు. గ్రూప్స్ రాసి ప్రజలకు సేవ చేసే అధికారిగా గుర్తింపు పొందాలన్నది ఆమె లక్ష్యం.

- యడవల్లి శ్రీనివాసరావు

గ్రూప్స్‌లో గెలిచి సామాజిక సేవ చేస్తా ...

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఎపిపిఎస్‌సి గ్రూప్స్ పరీక్షల్లో నెగ్గి ఉన్నతాధికారిగా సమాజ సేవ చేయాలనేది నా లక్ష్యం. 2016లో గ్రూప్ 2లో స్క్రీనింగ్ వరకూ వెళ్లా. ఈసారి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నా. భవిష్యత్తులో ఖచ్చితంగా సాధిస్తాననే నమ్మకం ఉంది. పేద కుటుంబంలో నుంచి వచ్చా. ఆ సాదక బాధకాలు నాకు బాగా తెలుసు. ఏ కారణంతోనూ పిల్లలు చదువుకు దూరం కాకూడదని అనుకుంటాను. అందుకే సాధ్యమైనంత మేర అలాంటి వారిని చదువులో ప్రోత్సహిస్తున్నాను.



- మేడికొండ చంటి,
ఆర్టీసీ కండక్టర్



'మిత్ర మండలి' క్లీన్ ఎంటర్‌టైనర్ : ప్రియదర్శి

బివి వర్క్స్ బ్యానర్‌పై బన్నీ వాసు సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్‌టైన్మెంట్స్‌పై కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డాక్టర్ విజయేందర్‌రెడ్డి తీగల సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'మిత్ర మండలి'. ప్రియదర్శి, నిహారిక ఎన్ఎం, విష్ణు ఓయి, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా నటించారు. వెన్నెల కిషోర్, సత్య, వి.టి.వి. గణేష్ ముఖ్య పాత్రలు పోషించారు. టీజర్‌తోపాటుగా 'కట్టందుకో జానకి', 'స్వేచా స్టాండు', 'జంబర్ గింబర్ లాలా' వంటి పాటలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యాయి. ఈనెల 16న విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్స్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. విజయవాడలో దసరా ఉత్సవ్ ఈవెంట్‌లో ఈ చిత్ర యూనిట్ సందడి చేసింది. ప్రెజెంటర్ బన్నీ వాసు, నిర్మాత భాను ప్రతాప, సంగీత దర్శకుడు ఆర్ఆర్ ధ్రువన్, నటులు ప్రసాద్ బెహరా, విష్ణు ఓఐ, నిహారిక మాట్లాడారు. 'తెలుగు సినిమా గుండె విజయవాడలో కొట్టుకుంటుందని మా పరిశ్రమలోని వ్యక్తులు ఎల్లప్పుడూ చెబుతారు. ఈనెల 16న రానున్న 'మిత్ర మండలి' థియేటర్లలో కుటుంబం మొత్తంతో ఆస్వాదించగల క్లీన్ ఎంటర్‌టైనర్' అని కథానాయకుడు ప్రియదర్శి అన్నారు.



చిరు సినిమాలో 'ఉదిత్ నారాయణ్' పాట

దర్శకుడు అనిల్ రావిపూడి ... ఒకప్పుడు స్టార్స్‌గా రాణించిన నటీనటులతో ముఖ్య పాత్రలు చేయిస్తూ సినిమాకు మంచి హైప్ తీసుకొస్తున్నారు. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా వెంకటేశ్‌తో 'సంక్రాంతికి వస్తున్నాం' తీసి బాక్సాఫీస్ వద్ద భారీ విజయం అందుకున్నారు. ఇందులోని 'గోదారి గట్టు మీద' పాటను రమణ గోగులతో పాడించి నేటి యువతరాన్ని సైతం కట్టిపడేశారు. ఇప్పుడు అలనాటి క్రేజీ గాయకుడు ఉదిత్ నారాయణ్‌తో మేజిక్ క్రియేట్ చేసేందుకు సిద్ధమయ్యారు. చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు'లో ఉదిత్ నారాయణ్‌తో ఓ పాట పాడిస్తున్నారు. 90 దశకం చివరిలో 2000 తర్వాత వచ్చిన తెలుగు సహా ఇతర భాషల్లో ఉదిత్ నారాయణ్ స్వరం శ్రోతలను ఓ ఊపు ఊపేసింది. తెలుగులో ఆయన పాటలకు విశేషమైన క్రేజ్ ఉండేది. చిరంజీవి నటించిన చిత్రాల్లోని 'రామ్మా చిలకమ్మా..', 'కైకలూరి కన్నె పిల్ల..', 'వానా వానా వెన్నెల వానా...' వంటి పాటలను ఆయన ఆలపించారు. ఇప్పుడు 'మీసాల పిల్ల' అంటూ అలరించబోతున్నారు.



కెనడాలో భారతీయ సినిమా ప్రదర్శనలు నిలిపివేత

కెనడాలో భారతీయ చిత్ర ప్రదర్శనలు నిలిచిపోయాయి. ఒంటారియో ప్రావిన్స్‌లోని ఓక్‌విల్ నగరంలోని 'ఫిల్మ్.కా సినిమాస్' అనే థియేటర్‌పై కొందరు దుండగులు దాడికి పాల్పడ్డారు. తొలుత సెప్టెంబర్ 25న ఈ థియేటర్‌పై దాడి జరిగింది. కొందరు మండే ద్రవాన్ని పోసి నిప్పంటించారు. అప్రమత్తమైన యాజమాన్యం మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఆ తర్వాత గురువారంనాడు మరోసారి దాడి జరిగింది. థియేటర్ వద్ద ఓ దుండగుడు కాల్పులు జరిపాడు. వారం వ్యవధిలోనే రెండుసార్లు దాడి జరగడంతో యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రేక్షకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని భారతీయ సినిమాల ప్రదర్శనను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. తదుపరి ప్రకటన వెలువడేంత వరకు ఈ నిషేధం అమల్లో ఉంటుందని తెలిపింది. ఈ నిర్ణయంతో పవన్ కల్యాణ్ ఓజీ, రిషబ్‌శెట్టి కాంతార చాప్టర్-1 సహా పలు సినిమాల ప్రదర్శన ఆగిపోయింది.

బిలీనియర్ల క్లబ్‌లో షారూక్

హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025లో షారుఖ్‌ఖాన్ రూ.12,490 కోట్ల ఆస్తితో తొలిసారిగా బిలియనీర్ క్లబ్‌లో ప్రవేశించారు. ఆయన తర్వాత సెలబ్రిటీలలో ప్రపంచ ప్రఖ్యాత గాయని టేలర్ స్విఫ్ట్, హాలీవుడ్ కమెడియన్ జెర్రీ సైన్‌ఫేల్డ్, స్టార్ హీరో ఆర్నాల్డ్ ష్వార్జ్‌నేగర్ కూడా ఉన్నారు. 'ఒకప్పుడు జేబులో కేవలం రూ.1050 ముంబైకి వచ్చాను' అని చెప్పిన ఆయన, ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత ధనిక నటుల జాబితాలో నిలిచారు. ఈ జాబితాలో షారుఖ్ తర్వాత ఇండియా నుంచి జూహీ చావ్లా అండ్ ఫ్యామిలీ రూ.7,790 కోట్ల ఆస్తితో రెండో స్థానంలో నిలవగా, హృతిక్ రోషన్ రూ.2,160 కోట్లతో మూడో స్థానంలో ఉన్నారు. కరణ్ జోహార్ రూ.1,880 కోట్లతో నాల్గవ స్థానంలో, అమితాబ్ బచ్చన్ అండ్ ఫ్యామిలీ రూ.1,630 కోట్లతో ఐదో స్థానంలో నిలిచారు. జూహీ చావ్లా షారుఖ్‌తో కలిసి కోల్‌కతా నైట్ రైడర్స్ ఫ్రాంచైజీలో వాటా కలిగి ఉన్నారు.



త్వరలో వివాహ బంధంలోకి విజయ్ దేవరకొండ, రష్మిక

- హైదరాబాద్‌లో నిశ్చితార్థం

హైదరాబాద్ : కొంతకాలంగా ప్రేమలో ఉన్న విజయ్ దేవరకొండ, రష్మిక త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారు. ఇరు కుటుంబాలు, కొద్దిమంది సన్నిహితుల సమక్షంలో హైదరాబాద్‌లో వీరి నిశ్చితార్థం శుక్రవారం జరిగినట్లు సమాచారం. ఇరువురి కుటుంబాలు పెళ్లి ఏర్పాట్లలో నిమగ్నమవుతుండగా, ఫిబ్రవరిలో ఈ జంట పెళ్లి పీటలెక్కబోతుందని విశ్వసనీయ సమాచారం. ప్రముఖ సినీ, రాజకీయ, వ్యాపార రంగానికి చెందినవారంతా ఆ వివాహ వేడుకలో పాల్గొనే అవకాశం ఉంది.

విజయ్ దేవరకొండ, రష్మిక ఇప్పటికే కలిసి నటించిన గీతగోవిందం, డియర్ కామ్రేడ్ సినిమాల ద్వారా రొమాంటిక్ కెమిస్ట్రీతో మిలియన్ల అభిమానులను ఆకట్టుకున్నారు. అప్పట్నుంచి వీరి జంటపై అభిమానుల్లో ఒక ప్రత్యేకమైన అటాచ్‌మెంట్ ఏర్పడింది. ఇప్పుడు వీరి వివాహం అధికారికమవుతుందన్న వార్తతో సోషల్ మీడియాలో అభిమానులు ఆనందంతో మునిగిపోయారు.



సైబర్ నేరాలపై అవగాహన కల్పించండి: హీరో అక్షయ్ కుమార్

ముంబయి: తన టీనేజ్ కూతురు మొబైల్‌లో ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్న సమయంలో .. నగ్న ఫోటో పంపాలంటూ ఓ సైబర్ క్రిమినల్ మెసేజ్ చేశాడని బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన కూతురు చాలా సమయస్ఫూర్తితో స్పందించి.. మొబైల్‌ను స్విచాఫ్ చేసిందన్నారు. ముంబయిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన సైబర్ అవగాహన కార్యక్రమంలో అక్షయ్ కుమార్ మాట్లాడుతూ ఈ ఉదంతాన్ని గుర్తు చేశారు. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో పాటు సీనియర్ పోలీసు ఆఫీసర్లు కూడా ఆ వేదికపైనే ఉన్నారు.కొన్ని నెలల క్రితం ఈ ఘటన జరిగిందని, తన కుమార్తె ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్న సమయంలో ఓ అపరిచిత వ్యక్తి ఆమెకు తారసపడ్డాడని, అతను తొలుత స్నేహపూర్వకంగా మెసేజ్‌లు చేశాడని, తర్వాత ఆ వ్యక్తే అకస్మాత్తుగా నగ్న ఫోటోలు పంపాలంటూ మెసేజ్ చేసినట్టు అక్షయ్ పేర్కొన్నారు. కానీ ఆ సమయంలో తన కుమార్తె చాలా తెలివిగా ప్రవర్తించి, చాకచక్యంగా తన ఫోన్‌ను స్విచాఫ్ చేసిందని, ఆ తర్వాత తల్లి వద్దకు వెళ్లి జరిగిన విషయాన్ని చెప్పిందని అక్షయ్ గుర్తు చేశారు. తన కూతురు అలర్ట్‌గా ఉండడం వల్ల.. సైబర్ క్రిమినల్స్ బారినపడలేదన్నారు. రాష్ట్రంలోని 8వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు స్కూళ్లలో సైబర్ అవగాహనపై పాఠాలు బోధించేలా చూడాలని సిఎం ఫడ్నవీస్‌ను అక్షయ్ కోరారు.

అమెరికా వర్సిటీలకు ఇండో-అమెరికన్ల భూరి విరాళాలు

న్యూయార్క్: ఇండో-అమెరికన్లు అగ్రరాజ్య విశ్వవిద్యాలయాలకు భారీగా విరాళాలు ఇస్తున్నట్టు తాజాగా ఓ నివేదిక వెల్లడించింది. ఇండియాస్‌పోర సంస్థకు చెందిన 2024 ఇంపాక్ట్ రిపోర్ట్, బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ సంయుక్తంగా దీనిని తయారుచేశాయి. అమెరికా ఉన్నత విద్యావ్యవస్థను భవిష్యత్తుకు అనుగుణంగా మలచడంలో భారతీయుల విరాళాలు ఏరకంగా ఉపకరిస్తున్నాయో వెల్లడించింది.

తమ కెరీర్ ప్రారంభానికి సహకరించిన కాలేజీల వృద్ధికి కేవలం మాటల రూపంలో కాకుండా ధన రూపంలోనూ సాయం చేస్తున్నారని ఇండియాస్‌పోర చైర్మెన్ ఎంఆర్ రంగస్వామి వెల్లడించారు. వారు అమెరికా భవితపై విశ్వాసంతో.. అది అందరికీ అవకాశాలు కల్పించాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. 78శాతం ఇండో-అమెరికన్లు కనీసం బ్యాచిలర్స్ డిగ్రీ అంతకంటే ఉన్నత విద్యను పూర్తి చేశారు. ప్రస్తుతం 2,70,000 మంది భారతీయ విద్యార్థులు అక్కడ చదువుతున్నారు. ఈ విద్యార్థుల నుంచి ఆ దేశానికి 10 బిలియన్ డాలర్లు (రూ.83 వేల కోట్లకు పైగా) లభిస్తోంది.

2008లో ఇండో - అమెరికన్లు అక్కడి విశ్వవిద్యాలయాలకు మొత్తం రూ.25,000 కోట్లు ఇచ్చారు. ఈ విరాళాల్లో కూడా అత్యధికంగా మెడికల్, హెల్త్‌సైన్స్, ఇంజినీరింగ్, బిజినెస్ ఎడ్యుకేషన్‌కు వెళుతున్నాయి. సాంస్కృతిక పరిరక్షణకు కూడా రూ.1,170 కోట్లు విరాళంగా అందాయి.

బీహార్ రాజకీయ పార్టీలతో నేడు ఇసి భేటీ త్వరలో ఎన్నికల షెడ్యూల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బీహార్‌లో రాజకీయ పార్టీలతో కేంద్ర ఎన్నికల సంఘం శనివారం భేటీ కానుంది. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బీహార్‌లో రాజకీయ పార్టీలతో చర్చలు జరపనున్నట్లు ఎన్నికల సంఘం అధికారి ఒకరు శుక్రవారం తెలిపారు. త్వరలో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తామని చెప్పారు. త్వరలో ఎన్నికల నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ నేతత్వంలోని ఇసి బృందంలో బీహార్‌లో రెండు రోజుల పాటు పర్యటించనుంది. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీల ప్రతినిధుల నుండి అభిప్రాయాలను స్వీకరించనుంది. శనివారం సమావేశానికి బిజెపి, కాంగ్రెస్, సిపిఎం, జెడియు, ఆర్‌జెడి, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్, సిపిఐ పార్టీల నుంచి ముగ్గురు చొప్పున ప్రతినిధులను సమావేశానికి పంపాలని ఎన్నికల సంఘం కోరింది. బీహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ తరువాత సెప్టెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ఇసి విడుదల చేసింది. ఇందులో 7.42 కోట్ల మంది ఓటర్ల వివరాలు ఉన్నాయి. ఎస్ఐఆర్ తరువాత 47 లక్షలకు పైగా ఓటర్ల పేర్లను తొలగించారు.

ఎన్నికల వేళ.. మహిళా ఓటర్లకు ఎర

- బీహార్‌లో నితీష్‌కుమార్ ఎత్తుగడ

పాట్నా : త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ మహిళలకు ఎర వేశారు. శుక్రవారం సుమారు 25 లక్షల మందికి ఒకొక్కరికి రూ. 10 వేలు వారి వారి బ్యాంక్ ఖాతాలకు బదిలీ చేశారు. ఇందు కోసం రూ. 2500 కోట్లను విడుదల చేశారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రులు సమ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హాలతో కలిసి ఈ నిధులు విడుదల చేశారు. ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన పథకం కింద మహిళలు తమ సొంత ఎంపికతో నచ్చిన వ్యాపారం చేసుకోవడానికి ఆర్థిక సాయం చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద మొత్తంగా ఒక కోటి మంది మహిళలకు రూ 10 వేల కోట్లు బదిలీ చేస్తామని చెప్పారు. మిగిలిన వారికి ఈ నెల 8 లోగా సాయం అందిస్తామని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అనేక మంది మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి మృతికి సిఎం సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో : కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ప్రజల సందర్శనార్థం ఆయన భౌతికకాయాన్ని హైదరాబాద్‌లోని జుబ్లీహిల్స్ ఉన్న తన నివాసంలో ఉంచారు. ఆయన భౌతికగాయాన్ని సందర్శించి సిఎం రేవంత్ రెడ్డి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపి అనిల్ కుమార్‌యాదవ్, మేయర్ గద్వాల విజయలక్ష్మి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఒక మంచి నాయకుడిని కోల్పోయిందనీ, ఎన్ని కష్టాలు వచ్చినా పార్టీని వీడలేదని వారు గుర్తు చేసుకున్నారు.

ప్రమాదస్థాయిని మించిన వంశధార

ప్రజాశక్తి - యంత్రాంగం

బుధవారం అర్ధరాత్రి నుండి కురుస్తున్న వర్షంతో మహోగ్రరూపం దాల్చిన వంశధార ఉవ్వెత్తున ప్రవహించింది. అనేకచోట్ల కరకట్టలను ఒరుసుకుని పరుగులు పెట్టింది. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళన స్థానిక ప్రజల్లో నెలకొంది. పల్లపు ప్రాంతాలు పెద్దఎత్తున జలమయమయ్యాయి. అయితే, శుక్రవారం సాయంత్రం 4 గంటల తరువాత వరద తీవ్రత కొంచెం తగ్గడంతో అధికారయంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. వంశధార వరద ధాటికి కొత్తూరు మండలం పెనుగోటివాడ జల దిగ్బంధంలో చిక్కుకుంది. మాతల వంతెనపై మూడు అడుగుల మేర వరద నీరు ప్రవహించింది. అదే మండలంలోని కుంటిభద్ర, వసప, నివగాం, మాతల, వి.ఎన్ పురం, కుద్దిగాం, పొన్నుటూరు, సోమరాజపురం, ఆకులతంపర, అంగూరు, పాతపాడు, మాకవరం తదితర గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. హిరమండలం మండలంలోని జిల్లేడుపేటను వరద నీరు చుట్టుముట్టడంతో ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు బోట్ల సాయంతో గ్రామస్తులకు నిత్యావసర సరుకులను అందించారు. నాగావళి నదిలో శ్రీకాకుళం పాత వంతెన గరిష్ఠంగా 28 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. గరిష్ఠంగా 40 వేల క్యూసెక్కుల వరకు చేరే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. అటు మహేంద్రతనయ, బాహుదా నదులూ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బాహుదా నది వరద ప్రవాహంలో చిక్కుకున్న ఓ యువకుడిని పోలీసులు రక్షించారు. పలాస మండలం బ్రాహ్మణతర్లా వరహాల గెడ్డ వంతెనపై నుంచి మూడడుగుల ఎత్తులో వరద నీరు ప్రవహించడంతో బ్రాహ్మణతర్లా, లక్ష్మీపురం, బంటుకొత్తూరు, నీలిభద్ర, కేశుపురం, పెద్దనారాయణపురం తదితర గ్రామాలకు రెండు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. కిష్టుపురం రైల్వే అండర్ పాసేజ్ లో వరద నీరు చేరడంతో గరుడఖండి, పాత జగదేవుపురం, జగదేవుపురం, లక్ష్మీపురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సమీప గిరిజన గ్రామాలు, గెడ్డల నుంచి వరద నీరు ముంచెత్తడంతో పలాస జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష నివాసాన్ని వరద నీరు చుట్టుముట్టింది. వర్షాల ప్రభావంతో వరి పంట తొమ్మిది వేల ఎకరాల్లో నీట మునిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. వంశధార నదీ పరివాహక ప్రాంతాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

పంటలకు అపార నష్టం

పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో గురువారం కురిసిన భారీ వర్షాలకు భారీ పంట నష్టం వాటిల్లింది. సాలూరు, భామిని, వీరఘట్టాం, కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ మండలాల్లో ఎక్కువగా అరటి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. వీరఘట్టాం మండలంలో అత్యధికంగా వెయ్యి ఎకరాల్లో అరటి నేలకొరిగింది. విజయనగరం జిల్లాలో గాలులకు విద్యుత్తుశాఖకు రూ.20లక్షలు నష్టం వాటిల్లింది. 43 సబ్ స్టేషన్‌లు మరమ్మత్తులకు గురయ్యాయి. జిల్లాలో వ్యవసాయ సర్వీసులు 2126 మరమ్మత్తులకు గురి కాగా వాటిలో 1991 సర్వీసులను పునరుద్ధరించినట్లు విద్యుత్తుశాఖ ఎస్ఇ మువ్వల లక్ష్మణరావు తెలిపారు.

కౌలు రైతు ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం కల్లికోట గ్రామానికి చెందిన బీజ రాము రెండెకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. టమాట, క్యాబేజీ పంటల సాగుకు సుమారు రెండు లక్షల రూపాయలు వరకు పెట్టుబడి పెట్టాడు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నాగావళి నదిలో నీటిఉధృతికి పంట పొలం ముంపునకు గురైంది. దీంతో మనస్థాపం చెందిన రాము....పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సకాలంలో కుటుంబ సభ్యులు స్పందించడంతో ప్రాణపాయం తప్పింది. ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు.

పంటనష్టం అంచనా వేయండి : సమీక్షలో సిఎం

వర్షాలు, వరదుల కారణంగా జరిగిన పంటనష్టంపై తక్షణమే అంచనాలు రూపొందించాలని, బాధితులను ఆదుకోవడానికి అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన ఈ విషయమై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు గొట్టా, తోటపల్లి బ్యారేజీల పరిధిలో భారీ వర్షపాతం నమోదైందని గొట్టా బ్యారేజీకి 1.89 లక్షల క్యూసెక్కులు, తోటపల్లికి 44 వేల క్యూసెక్కులు వస్తోందని శ్రీకాకుళం జిల్లా కలెక్టరు వివరించారు. ఒడిశాలోని వేర్వేరు ప్రాంతాల్లో పడిన భారీ వర్షాల వల్ల వంశధార నదికి 1.05 లక్షల క్యూసెక్కులు వస్తోందనిచెప్పారు. వర్షపు నీటిని సద్వినియోగం చేసుకునేందుకు రిజర్వాయర్లను నీటితో నింపాలని సూచించారు.

హోంమంత్రి సమీక్ష

వరద సహాయక చర్యల్లో ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్, పోలీసు, ఫైర్ సిబ్బంది సమర్థవంతంగా, వేగంగా స్పందించాలని హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. వంశధార, నాగావళి నదుల తీర ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిక సందేశాలు పంపాలని అధికారులను ఆదేశించారు. విపత్తు సమయంలో ప్రజలు తక్షణమే టోల్ ఫ్రీ నెంబరు 112, 1070, 1800, 425, 0101 ద్వారా సమాచారం పొందొచ్చని మంత్రి తెలిపారు.



కొట్టుకుపోయిన వజ్రపుకొత్తూరు మండలం పెద్దబాడాం రోడ్డు

భారత్‌లో ప్రజాస్వామ్యంపై దాడి

- మోడీ సర్కార్‌పై రాహుల్ గాంధీ విమర్శలు
- కొలంబియాలోని ఇఐఎ వర్సిటీలో వ్యాఖ్యలు

బోగోటా: ప్రజాస్వామ్యంపై జరుగుతోన్న దాడితో ప్రస్తుతం భారత్‌కు ముప్పు పొంచి ఉన్నదని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. కొలంబియా పర్యటనలో ఉన్న ఆయన ఇఐఎ విశ్వవిద్యాలయంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా మోడీ ప్రభుత్వంపై పలు విమర్శలు చేశారు. "ఇండియాలో ఎన్నో మతాలు, కులాలు, సంప్రదాయాలు ఉన్నాయి. అక్కడ ప్రతి ఒక్కరికీ ప్రజాస్వామ్య వ్యవస్థ చోటు కల్పిస్తుంది. కానీ ప్రస్తుతం ఈ ప్రజాస్వామ్య వ్యవస్థ ముప్పేట దాడికి గురవుతోంది. ఇదే ప్రస్తుతం భారత్ ఎదుర్కొంటున్న పెనుముప్పు" అని పేర్కొన్నారు. ఇంధన వినియోగంలో వచ్చిన మార్పులతో అనేక సామ్రాజ్యాల సృష్టి జరుగుతూ వస్తోందని అన్నారు. "అప్పట్లో బ్రిటీష్‌వాళ్లు ఆవిరి యంత్రం, బొగ్గుపై నియంత్రణ సాధించారు. దీనితో వాళ్లు సూపర్‌పవర్‌గా ఎదిగారు. ఆ బ్రిటీష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడి 1947లో స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నాం. ఆ తరువాత ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్ వినియోగం బాగా పెరిగింది. దీనితో ప్రపంచ వాణిజ్యంపై అమెరికన్ల పట్టు పెరిగింది. నేడు మన ప్రపంచం ఎలక్ట్రిక్ మోటార్ వైపు మళ్లు తోంది. దీనితో అమెరికా, చైనా మధ్య గట్టి పోటీ ఏర్పడింది. అయితే ఈ విషయంలో చైనా చాలా ముందుంది. ఇక చైనా మా పొరుగు దేశం. కనుక అమెరికా, చైనాలు పోటీపడుతుంటే మధ్యలో మేం ఉన్నాం. చైనా కంటే భారతదేశ జనాభా ఎక్కువ. చైనాలో కేంద్రీకృత వ్యవస్థ ఉంటే, ఇండియాలో వికేంద్రీకృత, వైవిధ్యభరితమైన వ్యవస్థ ఉంది. అది చాలా సంక్లిష్టంగా ఉంటుంది. చైనాతో పోల్చుకుంటే భారత్‌కున్న సామర్థ్యాలు చాలా భిన్నమైనవి. మా భారతదేశం ఆధ్యాత్మిక, సైద్ధాంతిక సంప్రదాయాలను కలిగి ఉంది. అవి చాలా ఆచరణీయమైనవి." అని రాహుల్ చెప్పారు.

అది పెద్ద సవాల్!?

"భారతదేశంలో ఆర్థిక వృద్ధి ఉంది. అది మా ఆర్థిక వ్యవస్థ సేవల ఆధారితమైనది. అయితే భారత్‌కు ఉత్పత్తి సామర్థ్యం లేకపోవడంతో ఉద్యోగాల కల్పన ఆశించిన స్థాయిలో జరగడం లేదు. చైనా చాలా ప్రజాస్వామిక వాతావరణంలో ఉత్పత్తి చేస్తోంది. కానీ భారత్‌కు ప్రజాస్వామ్య వ్యవస్థే ఉండాలి. అలాంటి వ్యవస్థను అభివృద్ధి చేయడం కాస్త సవాలుతో కూడుకున్న వ్యవహారం" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

హెచ్‌జివి క్షిపణిపై దృష్టి..

- గంటకు ఏడువేల కిలోమీటర్లకుపైగా దూసుకెళ్లేలా డిజైన్
- ప్రయోగాలను వేగవంతం చేసిన డిఆర్‌డిఒ

న్యూఢిల్లీ : ఆపరేషన్ సిందూర్ శత్రుసేనలు దడ పుట్టించిన బ్రహ్మోస్ మించిన అధునాతన క్షిపణి వ్యవస్థలు, ఫైటర్ జెట్లు, డ్రోన్ల ప్రాజెక్టులపై భారత్ దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగా హైపర్ సోనిక్ - హెచ్‌జివి క్షిపణి ప్రయోగాలను డిఆర్‌డిఒ వేగవంతం చేసింది. హెచ్‌జివి ధ్వని పరీక్షలను ఈ డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని ప్రయత్నిస్తోందని తెలుస్తోంది. సుమారు గంటకు 7వేలకు పైగా కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లేలా ఈ క్షిపణి శత్రుదేశాల గగనతల రక్షణ వ్యవస్థలకు స్పందించే సమయం కూడా ఇవ్వదని నిపుణులు అంచనా వేస్తున్నారు.

భారత్ స్వయంసమృద్ధి

రక్షణ రంగంలో స్వయంసమృద్ధి సాధిస్తున్న భారత్ అధునాతన క్షిపణి వ్యవస్థలు, ఫైటర్ జెట్లు, డ్రోన్ల ప్రాజెక్టులపై దృష్టి సారిస్తోంది. ఈ క్రమంలో హైపర్‌సోనిక్ క్షిపణి ప్రయోగాలను ముమ్మరం చేస్తోంది. ఇప్పటికే ఎయిర్‌ఫ్రేమ్ ఏరోడైనమిక్స్, థర్మల్ మేనేజిమెంట్, స్క్రామ్ జెట్ ఇంజిన్ పనితీరు, గైడెన్స్ వ్యవస్థకు సంబంధించి క్షేత్రస్థాయి, వైమానిక పరీక్షలను డిఆర్‌డిఒ చేసింది. ఇందులో భాగంగా హైపర్‌సోనిక్ గ్లైడ్ వెహికల్-హెచ్‌జీవీ ధ్వని పరీక్షలను ఈ డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో దడ పుట్టించిన బ్రహ్మోస్ కంటే ఈ క్షిపణులు భీకరంగా పనిచేస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

బాలికపై అత్యాచారం కేసులో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్

ఒంటరి అమ్మాయిలు, ప్రేమ జంటలే లక్ష్యంగా నేరాలకు పాల్పడుతూ ఈనెల 25వ తేది మురకంబట్టు నగర వనం (ఫారెస్టుపార్కు)లో పట్టపగలే ఓ ప్రేమ జంట రహస్య వీడియోలు చిత్రీకరించి ప్రేమికుడిని బంధించి యువతిపై సామూహికంగా అత్యాచారం చేసిన ఎట్టకేలకు పోలీసులు నిందితుల అరెస్టును వెల్లడించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితుల ముఖానికి మాస్కులు లేకుండా స్థానిక జిల్లా ఎస్పీ పాత కార్యాలయం నుండి జిల్లా కోర్టు వరకు రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లి రిమాండ్‌కు తరలించారు.

బాలికపై అత్యాచార ఘటనలో నిందితులుగా మురకంబట్టుకు చెందిన మహేష్, కిషోర్‌తో పాటు సంతపేటకు చెందిన హేమంత్‌గా గుర్తించిన పోలీసులు శుక్రవారం చిత్తూరు నగరంలోని చెన్నమ్మగుడిపల్లి రహదారి వద్ద వాకర్స్ అసోషియేషన్ నిర్మించిన యోగా సెంటర్ వద్ద అదుపులోకి తీసుకున్నారు.

బాలికపై అత్యాచార ఘటనలో ఏ -1 నిందితుడిగా ఉన్న మహేష్ 2019లో చిత్తూరు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలిక ఈవ్‌టిజింగ్ కేసులులో నిందితుడిగా ఉన్నాడు.

ఏ-2 2022లో నగరంలోని ఓ వైన్‌షాపులో పనిచేస్తూ అక్కడి మద్యం బ్లాక్‌లో విక్రయిస్తున్నట్లు కేసు నమోదైంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చిత్తూరు పోలీసులు చిత్తూరు -వేలూరు జాతీయ రహదారిపై నిందితులు సిగ్గుపడేలా ముఖానికి మాస్కులు లేకుండా రోడ్డుపై ఊరేగిస్తూ జిల్లా కోర్టులో పోలీసులు హాజరుపరిచారు.

అత్యాచారం కేసులో పదేళ్లు జైలుశిక్ష

ప్రజాశక్తి - టి.నరసాపురం

బధిర వివాహితపై అత్యాచారానికి పాల్పడిన కుమ్మరి రమేష్ (35)కు కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. దీనికి సంబంధించిన వివరాలను ఎస్ఐ ఎం.జయబాబు శుక్రవారం విలేకరులకు వివరించారు. మండలంలోని కె.జగ్గవరం గ్రామానికి చెందిన వివాహమై మూగ, చెవుడుతో బాధపడుతున్న వివాహితపై 2018 మార్చి 21న కామవరపుకోటకు చెందిన కుమ్మరి రమేష్ అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి సోదరుడు ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ వి.రాంబాబు కేసు నమోదు చేయగా అప్పటి సిఐ దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చింతమనేని రమేష్ వాదనలు వినిపించగా నేరం రుజువైంది. దీంతో ఏలూరు జిల్లా 5వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఆర్‌విఐఎస్.మురళీకృష్ణ ముద్దాయికి పదేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

రాహుల్, జురెల్, జడేజా సెంచరీలు

- ఇండియా 448/5
- వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్ 162/10


కెఎల్ రాహుల్(100పరుగులు) ధృవ్ జురెల్(125పరుగులు) జడేజా(104నాటౌట్)

అహ్మదాబాద్: వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్ట్‌లో టీమిండియా బ్యాటర్లు రాహుల్, జురెల్, జడేజా సెంచరీలతో కదం తొక్కారు. దీంతో రెండోరోజు ఆట ముగిసేసరికి టీమిండియాకు భారీ ఆధిక్యం లభించింది. దీంతో వెస్టిండీస్‌పై తొలి టెస్టులో టీమిండియా పట్టు బిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్‌ను 162పరుగులకే పరిమితం చేసిన టీమిండియా.. అనంతరం భారత బ్యాటర్లు ముగ్గురు శతకాలతో రాణించడంతో 5వికెట్ల నష్టానికి 448 పరుగులు చేసింది. కెఎల్ రాహుల్ (100), జురెల్(125)కి తోడు జడేజా(104నాటౌట్) క్రీజ్‌లో ఉన్నాడు. అనుభవం లేని కరీబియన్ బౌలింగ్ దళానికి చుక్కలు చూపించిన జురెల్, జడేజా జట్టు స్కోర్‌ను 400 దాటించారు. జురెల్ ఔటైనా వాషింగ్టన్ సుందర్(9 నాటౌట్) క్రీజులో కుదురుకోవడంతో రెండో రోజు ఆట ముగిసే సరికి గిల్ సేన 286 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఓపెనర్లు కేఎల్ రాహుల్(100), యశస్వీ జైస్వాల్ విండీస్ బౌలర్లను ఉతికేస్తూ గట్టి పునాది వేశారు. మొదటి వికెట్‌కు 68 పరుగులు రాబట్టిన ఈ ద్వయాన్ని జైడెన్ సీల్ విడదీశాడు. ఆ తర్వాత వచ్చిన సాయిసుదర్శన్(7)ను రోస్టన్ ఛేజ్ ఎల్బీగా వెనక్కి పంపగా 90కే రెండు వికెట్లు పడ్డాయి. ఆదశలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్(50), ధ్రువ్ జురెల్(125) అండగా ఇన్నింగ్స్ నిర్మించాడు రాహుల్. తనదైన షాట్లతో అలరించిన అతడు.. గిల్‌తో 90 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. గిల్ ఔటయ్యాక.. యువ వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్(125) సాయంతో చెలరేగిన రాహుల్ టెస్టుల్లో 11వ సెంచరీ సాధించాడు. వర్రికన్ ఓవర్లో రాహుల్ జస్టిన్ గ్రీవ్స్ చేతికి చిక్కడంతో.. ఎట్టకేలకు 218 వద్ద టీమిండియా నాలుగో వికెట్ కోల్పోయింది.

జురెల్, జడేజా ధనాధన్..

రిషభ్ పంత్ స్థానంలో తనకు దక్కిన అవకాశాన్ని వికెట్ కీపర్ జురెల్ వినియోగించుకుంటూ.. ధనాధన్ ఆటతో అలరించాడు. అతడికి రవీంద్ర జడేజా (104 నాటౌట్) తోడవ్వడంతో వెస్టిండీస్ బౌలర్లు బెంబేలెత్తిపోయారు. వీరిద్దరు బౌండరీలతో విరుచుకుపడుతూ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. ఐదో వికెట్‌కు 206 పరుగులు జోడించి ఆధిక్యాన్ని పెంచారు. మూడో సెషన్‌లో జురెల్ ఔటైన కాసేపటికే జడ్డూ ఈ ఫార్మాట్‌లో ఆరో శతకం పూర్తి చేసుకున్నాడు. విండీస్ బౌలర్లు ఛేస్‌కు రెండు, పియరీ, వర్రికన్, సీల్స్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు...

ఇండియా తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)హోప్ (బి)సీల్స్ 36, కెఎల్ రాహుల్ (సి)గ్రీవ్స్ (బి)వర్రికన్ 100, సాయిసుదర్శన్ (ఎల్‌బి)ఛేస్ 7, గిల్ (సి)గ్రీవ్స్ (బి)ఛేస్ 50, జురెల్ (సి)హోప్ (బి)పియరీ 125, జడేజా (బ్యాటింగ్) 104, సుందర్ (బ్యాటింగ్) 9, అదనం 17. (128ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 448పరుగులు. **వికెట్ల పతనం:** 1/68, 2/90. 3/188, 4/218, 5/424 **బౌలింగ్:** సీల్స్ 19-2-53-1, లియనే 15-0-38-0, గ్రీవ్స్ 12-4-59-0, వర్రికన్ 29-5-102-1, పియిరీ 29-1-91-1, ఛేస్ 24-3-90-2.

వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్: క్యాంప్‌బెల్ (సి)జురెల్ (బి)బుమ్రా 8, చంద్రపాల్ (సి)జురెల్ (బి)సిరాజ్ 0, అథంజే (సి)రాహుల్ (బి)సిరాజ్ 12, కింగ్ (బి)సిరాజ్ 13, ఛేస్ (సి)జురెల్ (బి)సిరాజ్ 24, హోప్ (బి)కుల్దీప్ 26, గ్రీవ్స్ (బి)బుమ్రా 32, పియరీ (ఎల్‌బి)సుందర్ 11, వార్రికన్ (సి)జురెల్ (బి)కుల్దీప్ 8, జాన్ లయనె (బి)బుమ్రా 1, సీల్స్ (నాటౌట్) 6, అదనం 21. (44.1ఓవర్లలో ఆలౌట్) 162 పరుగులు. **వికెట్ల పతనం:** 1/12, 2/20, 3/39, 4/42, 5/90, 6/105, 7/144, 8/150, 9/153, 10/162 **బౌలింగ్:** బుమ్రా 14-3-42-3, సిరాజ్ 14-3-40-4, నితీశ్ 4-1-16-0, జడేజా 3-0-15-0, కుల్దీప్ 6.1-0-25-2, సుందర్ 3-0-9-1.

ఢిల్లీ, తలైవాస్ గెలుపు

- ప్రొ కబడ్డీ సీజన్-12

చెన్నై: ప్రొ కబడ్డీ సీజన్-12లో భాగంగా శుక్రవారం జరిగిన లీగ్ పోటీల్లో దబాంగ్ ఢిల్లీ, తమిళ్ తలైవాస్ జట్లు గెలుపొందాయి. తొలి లీగ్ మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ జట్టు 43-26పాయింట్ల తేడాతో యుపి యోధాస్‌ను, తమిళ్ తలైవాస్ జట్టు 45-33పాయింట్ల తేడాతో హర్యానా స్టీలర్స్‌ను చిత్తుచేశాయి. ఏకపక్షంగా సాగిన తొలి మ్యాచ్‌లో ఢిల్లీ జట్టు రైడర్ ఆశు మాలిక్(14పాయింట్లు), పవార్, అత్రాచలి ట్యాకిల్స్‌లో మెరిసారు. ఢిల్లీ జట్టు రైడ్‌ల ద్వారా 22పాయింట్లు, ట్యాకిల్స్ ద్వారా 11 పాయింట్లు చేజిక్కించుకుంది. ఇక తలైవాస్ రైడర్ అర్జున్ దేశ్‌వాల్ 22పాయింట్లతో సత్తా చాటాడు. ఆ జట్టు ఏకంగా 6సార్లు హర్యానాను ఆలౌట్ చేసింది.

ప్రొ కబడ్డీలో నేడు..
పుణేరి × జైపూర్ (రాత్రి 8.00గం॥లకు)
గుజరాత్ × బెంగాల్ (రాత్రి 9.00గం॥లకు)

రెండో వన్డేలో ఆస్ట్రేలియా-ఎ గెలుపు

తొమ్మిది వికెట్ల తేడాతో ఓడిన ఇండియా-ఎ
నేడు ఆస్ట్రేలియా పర్యటనకు వన్డే జట్టు ప్రకటన
అందుబాటులో రోహిత్, కోహ్లి


నిరాశపరిచిన ఇండియా-ఎ కెప్టెన్ శ్రేయస్

కాన్పూర్: రెండో అనధికారిక వన్డేలో ఆస్ట్రేలియా-ఎ జట్టు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. వర్షం అడ్డంకిగా నిలిచిన ఈ వన్డేలో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిపై ఆసీస్‌కు 167 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా ఆ జట్టు కేవలం 16.4 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. మెకంజీ(70నాటౌట్), కానోల్ (50 నాటౌట్) అర్ధసెంచరీలతో రాణించి మ్యాచ్‌ను ముగించారు. దీంతో మూడు వన్డేల సిరీస్ 1-1తో సమంగా నిలువగా.. మూడో, చివరి వన్డే ఆదివారం జరగనుంది. అంతకుముందు తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత్-ఎ జట్టు 45.5 ఓవర్లలో 246పరుగులకు ఆలౌటైంది. తొలి వన్డేలో సెంచరీ చేసిన ప్రియాన్ష్ ఆర్య స్థానంలో ఈ మ్యాచ్ ప్లేయింగ్ ఎలెవన్‌లోకి వచ్చిన అభిషేక్ తన మార్క్‌ను చూపించలేకపోయాడు. అభిషేక్ తను ఎదుర్కొన్న తొలి బంతికే పెవిలియన్‌కు చేరాడు. భారత ఇన్నింగ్స్ రెండో ఓవర్ వేసిన జాక్ ఎడ్వర్డ్ తొలి బంతిని అభిషేక్‌కు వైడ్-ఆఫ్ డెలివరీగా సంధించాడు. ఆ బంతిని ఈ పంజాబ్ ఆటగాడు కవర్స్‌పై నుంచి షాట్ ఆడాలని చూశాడు. కానీ బంతి మాత్రం అవుట్‌సైడ్-ఎడ్జ్ తీసుకుని మొదటి స్లిప్‌లో ఉన్న సదర్లాండ్ చేతికి వెళ్లింది. దీంతో అభిషేక్ గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్-ఎ 60 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఛేదనలో ఆస్ట్రేలియా జట్టు 48 పరుగుల వద్ద ఉండగా.. వర్షం కురవడంతో తొలుత మ్యాచ్ నిలిచింది.

ఆస్ట్రేలియా పర్యటనకు టీమిండియా జట్టును బిసిసిఐ సెలెక్షన్ కమిటీ శనివారం ప్రకటించనుంది. ఈ టూర్‌కు అందుబాటులో ఉన్నట్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి తెలిపారు.

ఇంగ్లండ్‌కు అదిరే ఆరంభం

- దక్షిణాఫ్రికాపై 10 వికెట్ల తేడాతో ఘన విజయం
- ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్



గౌహతి: ఐసిసి మహిళల వన్డే ప్రపంచ కప్ ఇంగ్లండ్‌కు అదిరే ఆరంభం లభించింది. దక్షిణాఫ్రికా మహిళలపై ఏకంగా 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. తొలుత దక్షిణాఫ్రికాను 69 పరుగులకే పరిమితం చేసిన ఇంగ్లండ్.. ఆ లక్ష్యాన్ని 14.1 ఓవర్లకే పూర్తి చేసింది. ఓపెనర్లు టమ్మీ బ్యూమంట్ (40నాటౌట్), అమీ జోన్స్(18 నాటౌట్) దూకుడైన ఆటతో సఫారీ బౌలర్లకు దడ పుట్టించారు. దక్షిణాఫ్రికా బౌలర్ ఖాక ఓవర్లో బ్యూమంట్ సింగిల్ తీయడంతో ఇంగ్లండ్ భారీ విజయాన్ని మూటగట్టుకుంది. అంతకుముందు ఇంగ్లండ్ బౌలర్లు లినే స్మిత్ (3/7) సంచలన స్పెల్‌తో సఫారీలను దెబ్బకొట్టగా.. నాట్ సీవర్ బ్రంట్(2/5), చార్లీ డీన్(2/14)లు తలా రెండేసి వికెట్లతో మెరిశారు. దాంతో.. లారా వొల్వార్డ్ బృందం 20.4ఓవర్లలో 69 పరుగులకే ఆలౌటయ్యింది. జోఫ్రా(22) మాత్రమే రెండంకెల స్కోర్ చేయగా.. మిగిలిన బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. రెండో ఓవర్‌లోనే కెప్టెన్ లారా వొల్వార్డ్(5)ను లినే స్మిత్ ఔట్ చేసి ఇంగ్లండ్‌కు శుభారంభమిచ్చింది. ఆ తర్వాత.. తంజిమ్ బ్రిట్స్(5), సునే లుస్(2)లను బౌల్డ్ చేసిన స్మిత్ సఫారీలను దెబ్బతీసింది. అనంతరం.. మరినే కాప్ (4)సైతం పెవిలియన్ చేర్చిన ఆమె దక్షిణాఫ్రికాను పీకల్లోతు కష్టాల్లోకి నెట్టింది. టాపార్డర్ బ్యాటర్లు వెనుదిరుగుతున్నా సినాలో జఫ్తా(22) ఒంటరిపోరాటం చేసింది. కానీ, ఆమెను ఎకిల్‌స్టోన్ బౌల్డ్ చేయడంతో దక్షిణాఫ్రికా కోలుకోలేకపోయింది. మరో ఎండ్ నుంచి .. నాట్ సీవర్ బ్రంట్(2-5), చార్లీ డీన్(2-14) పోటీపడుతూ వికెట్ల వేట కొనసాగించి సఫారీలను ఆలౌట్ అంచున నిలిపారు. చివరి వికెట్ అయిన మలబా(3)ను డీన్ బౌల్డ్ చేయడంతో సఫారీల ఇన్నింగ్స్ 69 పరుగులవద్ద ముగిసింది. వన్డేల్లో దక్షిణాఫ్రికాకు ఇదే మూడో అత్యల్ప స్కోర్. గతంలో.. 2009లో న్యూజిలాండ్‌పై 51కే ఆ జట్టు కుప్పకూలింది. పాకిస్థాన్‌పై 2019లో 63 రన్స్‌కే సఫారీ టీమ్ ఆలౌటయ్యింది. తక్కువ స్కోర్‌కు ఆలౌట్ కావడం ఇది మూడోసారి.

స్కోర్‌బోర్డు...

దక్షిణాఫ్రికా మహిళల ఇన్నింగ్స్: వోల్వడార్ట్ (సి అండ్ బి)స్మిత్ 5, బ్రిట్స్ (బి)స్మిత్ 5, లూస్ (బి)బెల్ 2, కాప్ (బి)స్మిత్ 4, బోట్చ్ (ఎల్‌బి)స్కీవర్ బ్రంట్ 6, జోఫ్రా (బి)ఎక్లేస్టోన్ 22, ట్రయాన్ (సి)కాప్సే (బి)స్కీవర్ బ్రంట్ 2, క్లార్క్ (సి)నైట్ (బి)ఎక్లేస్టోన్ 3, క్లాస్ (బి)ఛార్లీ డీన్ 3, ఖాకా (నాటౌట్) 6, మబా (బి)ఛార్లీ డీన్ 3, అదనం 8. (20.4ఓవర్లలో ఆలౌట్) 69పరుగులు. **వికెట్ల పతనం:** 1/9, 2/12, 3/17, 4/19, 5/31, 6/38, 7/48, 8/70, 9/60, 10/69 **బౌలింగ్:** లారెన్ బెల్ 4-0-24-1, లిన్సే స్మిత్ 4-2-7-3, స్కీవర్ 3-1-5-2, సోఫీ ఎక్లేస్టోన్ 6-2-19-2, ఛార్లీ 3.4-0-14-2.

ఇంగ్లండ్ మహిళల ఇన్నింగ్స్: బ్యూమౌంట్ (నాటౌట్) 21, అమీ జోన్స్ (నాటౌట్) 40, అదనం 12. (14.1ఓవర్లలో) 73పరుగులు. **బౌలింగ్:** మారిజానే కాప్ 4-0-13-0, ట్రయాన్ 3-0-17-0, క్లాస్ 4-0-18-0, మాబా 2-1-9-0, ఖాకా 1.1-0-13-0.

ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో నేడు..
శ్రీలంక మహిళలు × ఆస్ట్రేలియా మహిళలు
(వేదిక: కొలంబో; సా.3.00గం॥లకు)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68